UNIVERSAL LIBRARY
OU_204417
UNIVERSAL LIBRARY

OSMANIA UNIVERSITY LIBRARY

Call No. T82/D965 Accession No. T11326

Author [illegible]

Title [illegible]

This book should be returned on or before the date last marked below.

కృతిపతి

టాగోర్ వెంకాజీ సుబ్బారావుగారు బి. ఏ.

Block by M. R Deoskar, Nagpur. *D. S. Press Nag*



శ్రీమాన్ మాచిరాజు దుర్గాశంకరామాత్యుడు

Block by M. R. Deoskar, Nagpur

శివశీలము

మొదటి అంకము

మొదటి రంగము—గడ.

ఆబాజీ శంభూజీలు.

ఆబా—మామగారూ, మహారాజుగారి కొలువు స్వీకరింపవలెనని మిమ్మెన్నో దినాలనుండి నిర్బంధించుచున్నాను ఇంతవరకూ ఏదీ నిశ్చయించుకొనలేదు కదా మీరు? ఎంత గడుసువారండీ!

శంభూ—ఆబాజీగారూ, ఈవిషయమున నేనేదియు నిర్ణయింపలేకున్నాను. వేగిరించి చేసినపని విషము మగును కదా? ఆత్రములో కొలువుగొనువారు అతివేగమున దాని వదలుకొందురు. ఇదీకాక, సేవకుని గుణాగుణములు పరికించుట యజమాని కెంతఆవశ్యకమో, యజమానుని గుణాగుణములను పరికించుట సేవకుని కంతావశ్యము. కాదా? శివాజీ గుణములు [illegible] కేతనూ, [illegible] సావధానముగా ప[illegible] [illegible] పరీక్షా [illegible] ంచిన [illegible]

నా కనుభూతములే. వాటిని నామీదనే ప్రయోగించినాడు! నా మేనల్లుడు—నా సోదరి కుమారుడు—తనతండ్రికి విశ్వాసపాత్రుడనగు ఉద్యోగిని—తన మేనమామను—అట్టి నాపై అకస్మాత్తుగా పడినాడే వాని నైజము నాకు పూర్తిగా అవగతమైనది....ఇందు విశ్వాసఘాతా, కపటమూ కాక ఇంకేమున్నది? ఇంతకన్న వేరు నిదర్శనము కావలెనా?

ఆబా—ఇట్టి స్వల్పవిషయమును మీరు పెద్దచేయ జనునా?

శంభూ—ఇది మీకు అల్పవిషయ మగునేమో కాని నా కట్లు తట్టుట లేదు. అతని కొకనాటి చెలగాట మయ్యెను కాని, నాకు చిరస్థాయి యగు ప్రాణగండముగా పరిణమించి నది!

ఆబా—మహారాజుగారు మీవలె దీర్ఘద్వేషులు కారు. ఇట్టి ప్రమేయములను వా రెప్పటికప్పుడే మరచిపోవుదురు.

శంభూ—నాసంగతి వారు మరచిరన్న అదొక వింత కాదు. వారికిక మీదినుండుటకు ఇం దంత విశేష మేమి కద్దు?...ఇంకొక మాట- అపకారమూ అవమానమును ఒనర్చినవారి నెన్నడును బాధించవు, భరించవలసిన వారి హృదయములకు మాత్రము శల్యము లగును. గొడ్డలివేటుచేత వృక్షము తెగును కాని గొడ్డలి చెక్కు చెదరదే? తానుకొట్టిన చెట్టును ఉపకారబావము క్షమింప లేని గొడ్డలి కెట్టున విందిలమా? ...యుడు మీ మహారాజుగారి మరపు

నకు మఱొక కారణమున్నది. ఎవ్వరైన ఎప్పుడేని హిం
పాటున కపట కృత్యము కావించిననో అది వారి హృద
యమును వేధించును, శివాజీకిన్ననో కాపట్యము పరి
పాటు కావున అది వాని మానసమును దూషింపక పోషిం
చును. ఒకనాడు బీజాపూరు రాజు కంట దుమ్ముజల్లి వారి
తోరణాకోటను లాగుకొనుట, మరునాడు రాత్రి రహస్యముగా
శంభుగాక్షపై బడి సుపేరా[illegible]ము నాక్రమించుకొనుట, మూ
డవనాడు ఫిరంగోటి సర్దారులను వశపఱచుకొని చౌకీకోట
నపహరించుట, నాలవనాడు కొండణా హవల్దారునకు లంచ
ము మేపి ఆదుర్గమును హస్తగతము చేసికొనుట, అయిదవనాడు
పురందరపు ప్రభువుల దాయాదుల కలహములను కారణముగా
జేసుకొని, విశ్వాసఘాతకు వెనుదీయక ఆకోటను పట్టుకొ
నుట, ఆఱవనాడు కల్యాణీదుర్గపు సుబేదారుని ధనాగారము
దోచుకొనుట, — ఇట్టి ఆశగొల్పియో, బెదరించియో స్నే
హము నటించియో తనకార్యమును నిర్వహించుకొనుట తన
నుమహారాజుగారికి నిత్యకృత్యము లగుచున్నవి. ఇంతేకాదు,
జనజన్మదాతయైనను అన్నదాతయైనను కూడ నిస్సంకోచ
ముగా కుట్రలుపన్నుటకు గూడ జంకడు!

ఆహా — మీ రాబాసాహెబు (శివా) గారికి మా
మగారగుటచేతను, వారి కోపము [illegible] కొనసాగెనని నీ
వపేక్షించుచుండుట చేతనూ, [illegible] ను విని ఊరకుం
డనొప్పినదిగాని సందేహా [illegible] చిన వారి

త్యావళిచే మహారాజుగారి కెవరును శత్రువులు కాలేదే? వారు వచ్చిలురనుట కింతకన్న వేరు నిదర్శనము కావలెనా?

శంభూ—ఆవిషయమును మీ రెట్లు సిద్ధాంతీకరింప గలరు? వాని కాపట్యాది శక్తుల యూరగించిన నేను వానియెడ వైరభావ మూనకుండుటకు హేతువులు నా మనోదౌర్బల్యము బుద్ధిమాంద్యమూ అని చెప్పదగును, కాని పైవారికి నాకన్న నెక్కుడు చిత్తపటిమ యుండగూడదా? బహిరంగము గా కాకున్న విని గూఢముగనైన వారు శివాజీని ద్వేషిం పరాదా?

ఆబా—అయ్యా, మీరు వారియెడ ప్రతికూలభావ మూని వారికృత్యములను విషమదృష్టితో పరికించుచున్నారు కావున మీయూహలే నిజమని భ్రాంతిపడుచున్నారు. అను కూలభావమూని సమదృష్టితో వాటినిపరిశీలించినచో మీ యూహ లపోహములని మీకే తోచగలదు.

శంభూ—అమాంతముగా అగ్గిపైబడి వారి నుక్క- డంచుట అయోగ్యము కాదా?

ఆబా—ఆబాసాహెబుగారు తమశత్రువులను మొ దట సామదానములచే సాధింపజూతురు. ప్రభువిశ్వాసనిధాన మగు వారిసైన్యమును వ్యర్థముగా వధించుకొనుట వారి మతము కాదు. ఆ రెండుపాయములును నిష్ఫలములైనచో ఇక వారికేదివెరవు? సాహాత్తుగా శత్రువులపై బడినయెడల తమపక్షమున రక్తస్రావ [illegible]

శంభూ—ఇదంతయూ తమవీరులయందలి దాక్షిణ్యము చేతనా, లేక పిరికితనము చేతనా? నిసర్గవీరుడు ఎదుట నిల్చి హోరాహోరిగా పోరునలయునుగాని దొంగతనముగా పైకొనదగునా?

ఆబా—మహారాజుగారికి పిరికికండ యున్నదనియు దాక్షిణ్యము లేదనియు మీా నోటవింటిని. యుద్ధరంగమున సైనికుల నసిగొల్పి తాము దూరమున నుండక వారితో కలిసి పోరాడుచూ, నిహతులైనవారి కుటుంబభరణార్థము వలయు నేర్పాటులు సల్పుచూ, గాయపడినవారికి స్వయముగా చికిత్స చేయుచుండ—అట్టియెడ జాతిభేదము గాని, కుల శీలవైషమ్యములు గాని పాటింపక అందరిని సమదృష్టితో లాలనపాలనముల నొనర్తురు. అయ్యా, ప్రకృతమున కళ్యాణదుర్గ వ్యాపారపు దోపిడిలో మృతులైనవారి కుటుంబములు నాదరించుచూ, క్షతులైనవారికి చికిత్స గావించుచున్నారు, చూడపద రండు (పోవుదురు)

—: రెండవ రంగము :—

(శివాజీ, బాలకృష్ణపంత్, మంచములపై సైనికులు)

శివా—అమ్మలారా, అయ్యలారా, ఈ యుల్లరిలో మీా సుతులు, పతులు, పితలూ తనువులొరగినారు. వారందరు నాకు తోబుట్టువులని [illegible] చున్నాను. మీా మీా

కుటుంబములనుండి ఒక్కొక్క మానవుడు గతించె గాని, నా హితైషులు, నా అంగరక్షకులూ నాతోడి సమభివ్యవహారులూ, నా కొరకు ప్రాణములు సర్పించు నాసఖులు సోదరులునైన నారనేకులు నన్నువిడిచి చనినారు. అసిధారాతీర్థంబున మునిగియుటచే మనలు దుఃఖసాగరమున ద్రోసి వారు స్వర్గము నలంకరించినారు. ఈ సమరములో కొంత మేలోనగూడక పోలేదు. పుణ్యము చేసుకొనుటచేతనే వారు స్వధర్మము కొరకును స్వరాజ్యముకొరకును తమ ప్రాణములు సర్పించజాలిరి. పుట్టినవారెల్ల గిట్టుట నిజమే, ఐనను శత్రుకోటికి తమ అస్త్రశస్త్రములు పదను చవిజూపి నానావిధ క్లేశపడుచును ప్రాణములు బాసిన ప్రతివీరభయంకరులు ధన్యులు కారే? కావున వారికై మనము వ్యాకులపడరాదు. అట్టిపుణ్యాత్ముల నా కలవడచేయుమని సర్వేశ్వరుని సదా ప్రార్థించుచున్నాను.

ముసలిది.—పదికాలాలు మీరు బతికుండాలి మారాజా. పరమేశ్వరా! వీరిని శిరంజీవిని శెయ్యి.

శివా.—అమ్మా, నీబోటి సాధ్వీమణి దీవన రిత్తయగునా? పరమేశ్వరుడు నాకు ప్రసాదించిన ఆయువెల్ల నా దేశకళ్యాణమునకు నా దేశబాంధవుల యోగక్షేమములకూ ధారపోయుదునని నా దృఢసంకల్పము. ప్రధానీ, నాకొరకమితానందముతో అసువుల బాసి తమకుటుంబములను, తమవారి అంతఃకరణములను పాడొనర్చినవారి కుటుంబముల స్వాస్థ్యములయెడ మనము శ్రద్ధవహింపవలయును. వారికి సంభవించిన ప్రేమ

హానికి మానము ప్రతివిధానము జరుపనేరము. కావున వారి యోగక్షేమములు సనుకూలరీతి నరయుట మనవిధి; అందెట్టి లోపమూ గానీయగూడదు-కళ్యాగ్ర వ్యాగారమును మనకు సగతము చేయుటలో ప్రాణములు గోల్పోయినవారి కుటుంబములు కాప్రస్యవిధానముపై హక్కు గలదు.

రెం॥ ముస॥—మేం కూలోళ్ళం, మాకు డబ్బులోచే పని మహారాజా! మీరు సల్లగా ఉంటే మాకేమిలోటు నాకింకా కొడుకులుంటే వాళ్ళనికూడా మీ పాదాలమీద పడేతును.

శివా—వీరమాతకు తగిన మాటలాడితివి వహ్వా. నివంటి తల్లులు మన దేశమున నుండునంతకాలము వీరులకేమి కొదవ? నీబోటి ఉద్యోగినతుల ఉదరపోషణార్థము శ్రద్ధవహించకున్న నేను మీపుత్రులకు ప్రభువుగా నుండతగను.

మూడ॥ ముస॥—మహారాజా, మావాళ్ళు యుద్ధానికెళ్ళినప్పుడు నన్నుమల్లి మీకప్పగించి "మే మేవైనా చింత వొద్దూ, మా రాజుగారే మీకు తలిదండ్రులు, వారే మిమ్మల్ని పోషిస్తారు" అని చెప్పారు.

నాల్గ॥ముస॥—మహారాజా, నా పిల్లల్ని మీ పాదాలకాడ పడేస్తున్నా-ఈడయ్యాక మీకొలువు చేస్తారు.

శివా—తండ్రిని పోలిన తనయుడు బంటుతనమునకు కుదురుకొను. దేశము ముమ్మాటికీ ధన్యము-కుర్రా, నీవు మా కొలువు చేసెదవా?

కుర—ప్రభువుగారు చెప్పడఁ వేఁ లోటు-పిరంగినో ట్లో దూర్తాను:

శివా—(వాని కౌగిలించి) భళిరే! నీవు వీరపుత్రుడ వే. నీవంటి లేతకబళము ఫిరంగివాత పడవలెనన్న తత్స్వార్థ్య ము నా నేనయే కాక నేను కూడా మడియవలయును. అమ్మ లారా, మీ రికపొండు. మీ స్వార్థత్యాగమును నా సైనికు లూ నేఁటనూ్నా మార్గదర్శకముగా నెంచుకొందుము.

శంభూ—మహారాజుగారికి స్త్రీలయెడ ఆదరము మిక్కుటము. (వారు పోవుదురు)

శివా—ఓహో, మామగారా, ఎప్పుడు విచ్చేసితిరి?

శంభూ—నీ వాస్త్రీల నోదార్చుచున్నప్పుడు.

శివా—ఓదార్చినంత మాత్రమున ప్రయోజన మేమి? శుష్కప్రియవాక్యములచే హృదయమందలి గాయములు మా నునా? అవి మానసములయందలి దుఃఖముల రేపి జాలి నభి వృద్ధి నొందించును. సజీవస్నేహమున కనలుచున్న చిత్తము లను నిర్జీవ తత్త్వోపదేశ బిందుధారలు చల్లార్చునా? ఆప్తుల వచనముల వినకున్న సుఖము శూన్యమని యెంచుచుండు హృదయములు అతిదీర్ఘములై వెగటుపుట్టించెడు పుక్కిటి పు రాణముల విని సంతసించునా? (మంచములమీదివారితో) మిత్రులారా, మీ గాయములు మానుచున్నవా? వీరు కాయ ములకు గాయము లలంకారములు; సంగ్రామదేవత సాహసి కులగు వీరులకు చేతి కడియములు, కాలి గొలుసులు, మెడ

లోని సరులు, చెరి యొకటో, చెరి రెండో బహుమానముగా నొసగుచుండును. గాయపుమచ్చలు ఒడలిపై నెంత దట్టముగా నుండిన సౌందర్య మంత హెచ్చును. గాయములచే సాలంకృతులగు ఇట్టి యోధులు శత్రుసేన అను తెరమరుగున నిల్చియున్న విజయలక్ష్మి పాణిగ్రహణ కుతూహలులై తమ శస్త్రములతో ఆ తెరను చీల్చి ఆమెచే విజయహారములను తమ కంఠమున వేయించుకొందురు. (వారి శరీరములు నిమిరి) మిత్రులారా, ఆ సుఖము లభించుటకై మీరీ దుఃఖము ననుభవించ వలసియున్నది.

వీరుడు—మహారాజా, మీ చెయ్యి సోకుటచే గాయములబాధ కొంతవరకూ ఉపశమించినది.

శివా---బాజ్జీ, నీ గాయములే నీ దేశభక్తిని స్వామిభక్తిని నిర్వివాదముగా నిరూపించుచున్నవి. బహిర్జీ, ఈ గాయము నీవు నన్ను శత్రువునుండి కాచునప్పుడు తగిలినది, కావున నినుగూర్చి నే నెక్కుడుశ్రద్ధ వహింపవలదా?

బహి—విపర్యస్తముగా సెలవిచ్చుచున్నారు ప్రభువువారు. అప్పుడు మీరా తురకను అంతమొందించుటచేతనే నేను బ్రతికితిని. లేకున్న నాకు మీ దర్శనలాభ మిప్పుడు చేకూరునా? మీరే నన్ను పునర్జీవితుని చేసితిరి-ప్రభూ, మీరు దైవసమానులు, మహారాజా!

శివా—ఈత డెవడు? మోత్యాముహాన్ వలెనున్నాడు. (తడుమును)

మోత్యా—ప్రభూ, ప్రాణాలు-నన్నిక్కడికి తెచ్చినప్పుడు నా కొళ్ళు తెలియదు-నన్ను రక్షించాల మీకు నాపార్శ్వ సోకింది, నాతల తీసేండి మారాజా!

శివా—నా దేశమును నా ప్రాణమునూ కాపాడుటకు నాదండ నుండి భుజమునకు భుజముచేర్చి శత్రువులతో హోరాహోరిని పోరునప్పుడు స్పర్శదోషము లేదుకాని నీవు గాయముల బాధచే మూల్గుచూ పడియున్నప్పుడు నిన్నంటిన స్పర్శదోషము సోకునా? లేదు, లేదు-మానవుడంతకఠోరహృదయుడూ కృతఘ్నుడును కాలేదు. మోత్యా మనమిరువురం ఒక దేవుని బిడ్డలము, నేను రాజభవనమున పుట్టి పెరిగితిని. నీవు కుటీరమున బుట్టి పెరిగితివి; ఇది కేవల దైవయోగము-కాని మానవధర్మశాస్త్రము మనలో గొప్పభేదమేర్పరచినది-నిన్నటి యుద్ధమున నీవు మనకిద్దరికి ప్రభుభృత్యసంబంధమును మీరి సౌదర్యమును నికటతరసంబంధమును స్థాపించితివి; నన్నంటబోకుమని ఇప్పుడు నిషేధించితివేని నేనొక హింస్రజంతువునని యెంచినవాడ వగుదువు.

మోత్యా—మావోళ్ళుతప్ప నన్నెవ్వరూ ముట్టుకోరు. మీరు దేవుళ్ళంటోరు గనక నావోళ్ళు నిముకుతున్నారు. మీ దాసుణ్ణి, అడ్డు సెప్పుతానా?

శివా—(ఇంకొకని చూచి) వీడు ఆబాజీ సేవకుడు సట్వాజీ-సట్వా నీ కింతదాక గాయము మానలే లేదు, నీవు వీరిలో జేరితి వెట్లు?

సట్వా—దేవరా, తమరు నేను గాయపడినోర్ని సూ స్తారని తెలిశి మిమ్మల్ని ముట్టుకొందావని నేనే గాయం చేసుకొన్నాను.

శివా—గాయమునకు నేను చికిత్సచేసిన చికిత్సకు నీవు గాయము చేసుకొంటివా?......మీరు మాకై పడిన శ్రమ బాపుటను మాచేతనైన సువిధముల చేకూర్చెదము. నేడు మాతుశ్రీ జిజాబాయిగారు తమచేతులతో మీాపథ్యపానీయములను తయారుచేసి కోడళ్ళచేత వడ్డింపజేయుదురు.

బాజ్జీ—మీాచేతి పరిచారమూ మాతుశ్రీగారి చేతి ప్రసాదమూ దొరికినట్లాయినా ఇలాంటిగాయాలు నూరైనా పొందగలము, మారాజా!

శివా—మా బంటులకు సహాయం దిట్టిగొరప మంటు మా భాగ్యము-మే మికి పోదుము. మీా కచిరకాలమున ఆరోగ్యప్రాప్తి యగుగాక!

—మూడవ రంగము—

(శివాజీ శంభూజీలు)

శివా—మామగారూ, జాతిని కులమున, బాంధవ్యమునను ఎట్టి సంబంధమూ లేని జను లెందరో స్వరాజ్యసంపాదనమున నాకు తోడ్పడుటయు, తమబోటి ఆప్తులు పరాఙ్ముఖులగుటయూ యోగ్యమని తమకు తోచెనా?

శంభూ—శివబా, నీ వించుక ఆలోచించితివేని నీకును వీరికి నెంతవైషమ్య మున్నదో మన కిద్దరికీ అంత వైషమ్య మున్నదని గ్రహించగలవు; మన సాధ్యములయందును సాధనములయందునూ ఎంతో వ్యత్యాసమున్నది.

శివా—స్వరాజ్యస్థాపనము మీకు రుచింపదా?

శంభూ—అది అందరికీ కావలసినదే కాని శక్యమగునో కాదో ఇంచుక ఆలోచించవలదా? నీ బల మెంత? నీ ప్రతిపక్షుల బల మెంత? అదీకాక ప్రతిపక్షు లొకరైన కొంత మేలు. ఒకదెస దక్షిణాపథమందలి బలాఢ్యులగు అదిల్‌షా కుతుబ్‌షాల తోడనూ, మరొకదెస అమితబలశాలియగు ఔరంగజేబుపాదుషా తోడనూ-రెండు ప్రచండసైన్యములతో నీవు పోరాడ నెంచితివి. ఒక్క మహమ్మదీయబంటునకు నీ మావళాలు నల్గురు చాలుదురా?

శివా—నా ఆదర్శ మసాధ్యమైనను దానిని సాధించుటలో నా కేమాత్రము యశము చిక్కకున్ననూ నిరుత్సాహుడ కాబోను-నీచాదర్శమును సాధించి యశము పొందుటకన్న ఉచ్చాదర్శమును సాధించుటకై యత్నించి విఫలుడ నగుట శ్రేయము. ఇంతకూ నాఆదర్శము దుస్సాధ్యమైననూ అసాధ్యము కాదని నా నమ్మకము. మహమ్మదీయ తురుష్క సైనికులకన్న మా మావళాలు కృశాంగులనుట తథ్యమే, కాని విలాసప్రియులగు విపక్షులకంటె మావాళ్ళు దార్ఢ్యమున సష్టానమున నెక్కువవారని మీ రెరుగరా! కృశించిన మా

దేహములు తురకలపై దాడివెడలునప్పు డంతగా పనికిరాకున్ననూ ముట్టడింపబడునప్పుడు చాలాసేపు ఓర్చియుండుటకునూ, శత్రువులనుండి తప్పించుకొనునప్పుడును, వెనుకకు తగ్గునప్పుడునూ, అవి అమూల్యములు కావా? మావారి వెంట కొండలెక్కుట దిగుటయు తురుష్కుల కెంత ప్రాణగొడ్డములు! శరీరదార్ఢ్యము, పుష్టి, దీర్ఘత్వమును మీకు పెద్దజేయుచున్నావు గాని నేను వాటికి మహత్వ మారోపించను; మానసిక పుష్టి, దార్ఢ్యములం కధికమహత్వ మున్నదని నా నమ్మకము-పురివిడిన బాహువులకన్న నిగిగల మానసమూ, విస్తీర్ణముగు వక్షముకన్న నిర్భీకమగు చిత్తమునూ నా కధికములు-శాత్రవుల శరీరములు మాశరీరములకంటె నాల్గురెట్లు పెద్దవైనను మా మానసములు వారి మనస్సులకంటె పదిరెట్లు ధైర్యస్థైర్యములు కలవి.

శంభూ—వారి శస్త్రాస్త్రవాహనసంపత్తి సామాన్యమనుకొంటివా? వాడియగు డెమాస్కస్ ఖడ్గములు, తేజోవంతములగు అరబ్బిగుఱ్ఱములు, తోడాతుపాకులు, మత్తమాతంగములు, పొడవుకత్తులూ, ఎత్తైనబల్లెములూ, ఉన్నతములగు నుష్ట్రములూ చక్రాకారముగా నగ్నినుమిసెడు ఫిరంగిగములూ-ఇవన్నియూ అజయ్యములు మొగలసైన్య మహాసముద్రము రసపుత్రసైన్య నదీప్రవాహముల మింగును, దక్షిణ మహమ్మదీయసేనాదావాగ్ని మహారాష్ట్రసేనాగ్ని శిఖల గ్రసియించును.

శివా—అయ్యా, ఆ సేనలు కలగూరగంప లనుమాట నొప్పరికింతు రేల. మాభటులకూ వారిభటులకూ సాటియే లేదు- మాతృదేశరక్షణార్థమును, స్వాతంత్ర్యనిర్వహణమునకు నూ మడియనున్న వారి యుత్సాహము, బాహుబలమును నమ్మి పరదేశముల నాక్రమింపదలచి విదేశీయుడును విధర్మియు నగు రాజు ననుమతిని విలాసార్థ మద్దెకువచ్చిన బంటుల కుండునా? మరియు దారపుత్రాదుల మానప్రాణముల కాపాడి మాతృభూమి నుద్ధరింపదలచి స్వకీయుల దీవనలను గొనుచూ ప్రాణముల త్యజింపవలెనని సిద్ధపడిన పోటుబంటుల యుత్సాహములో శతాంశమేని, అర్ధమానసము స్వదేశమందున నున్న దారాపుత్రాదులమీద, తక్కినది తాము అద్దెకుస్వీకరించిన అనవసరయుద్ధము మీద నిడుకొని, లక్షలకొద్ది ప్రజల తిట్లు తినుచూ ధనాశచే ప్రాణముల వీడనున్నవారి కుండునా! మనోదార్ఢ్యము నిర్భయహృదయమును కల్గియున్న మా మావళాలకు ప్రాపుగా పరమేశ్వరుడు ప్రసాదించిన సువిధములు మీరు పరికింపనే లేదు. ఈ సహ్యాద్రిసానువుల ఔన్నత్యము నవలోకింపుడు- వీటినెక్కి నెవరు ప్రతిఘటించి నిల్వగలరు ఈ కొండకనుమలలో వేలకొలది శత్రుసైన్యములు మాయ మగును. వీటి నాశ్రయించి పోరెడు మా పిడికెడు సైనికులమీద ఫరంగిబంటులు వేలకొలది ఫిరంగిగుండ్లు పేల్చిననూ, వాటి ప్రతిధ్వనిచే వారిచెవులు చిల్లులుపోవుట తప్ప వేరు ప్రయోజన మేమియుండును. మాసేన లీదుర్గద్వారములనుండి

అగ్నివృష్టి కల్పించెనా? పాదుషాసైన్యములు భస్మము కావా? కావున మా సహ్యాపర్వతము శత్రువుల కసహ్యమే కదా? శత్రురాశికి దుర్నిరీక్ష్యములు దుర్గమములునగు ఈపర్వతశిఖరములకు మాయందు పుత్రవాత్సల్యము కలదు. కావుననే మమ్మవి తమకొక్కిళ్లపై చిత్తమువచ్చినరీతి నాడించుచూ అన్యులనుండి ఉపద్రవము రానున్నతరి లోలోన నిముడ్చుచుండును. అప్పుడు రహస్యమార్గములయందు మేము సిగబంతి వాడక సంచరించుచుందుము.

శంభూ—ఈ రహస్యముల నెరిగిన మీవారు శత్రువులలో చేరకూడదా?

శివా—మావారి నందరినీ మాపక్షమున నుంచుటకు యత్నించుచున్నాను. అట్లు చేరనివారి నంత మొందింతును.

శంభూ—మహారాష్ట్రసరదారు లెందరు లేరు-వారి కన్న నీ యెక్కువ యేమి?

శివా—నామావశేషమైన నిజాంషావారిసత్వము నాకు చెందనున్నది. ప్రతాపము బాయుచున్న ఆతని ప్రభుత్వమును నిలువబెట్టవలయునని నిరపేక్షబుద్ధితో నాతండ్రిగారొనర్చిన భగీరథప్రయత్నము మీ రెరిగి యున్నదే. అందుకే కాదె బిజాపూరుసుల్తానుతో వారు పోరవలసి వచ్చెను. నిజాంషా మాత్రము సామాన్యుడా? విశ్వాసఘాతకుడు-మామగారిని మరదినీ చంపి గద్దెనెక్కినాడు. ఐనను వానికి చిక్కుమూడినప్పుడు మాతండ్రిగారు సాయపడిరి. ఎంతలంచమైన

నిచ్చి లోబరుచుకొననలయునని మొగలులు యత్నించిననూ వారికి లొంగలేదు, వారితర్జనభర్జనల పాటిసేయలేదు. నిజాంషావంశమువారికా రాజ్యము చిక్కుట అశక్యమైన పిదప భగ్నమై చెదిరిపోయిన పరిస్థితులలో స్వరాజ్యస్థాపనము సేయబూనిరి కాని బిజాపూరుసైన్యము మొగలులతో చేరినందున కృతకృత్యులు కాకపోయిరి. ఆ వ్రతము సాంతముచేయుట నాకు విధి. పవిత్రమైన నాకార్యమునకు ప్రతికూలురైన మహారాష్ట్రులు బలిమిచేనైన కపటముచేనైన బంధింపక మానను. దేశహితమునకు ప్రాణముల నర్పింప సమకట్టిన నేను నాహితము నవరోధించెడివారి ప్రాణముల గొనక మానుదునా?

శంభూ — అభినివేశులకు అంతరాయము అల్పములై తోచును. మొగల మహమ్మదీయుల మతభేదము వారునీతో పోరునప్పుడు అడ్డురాదు. మొగలసేనామహాసముద్ర మొకటే మహారాష్ట్రమును ముంచివేయగలదు; లేదా, దక్షిణమహమ్మదీయదావాగ్ని ఒకటే మహారాష్ట్రమును దగ్ధముచేయగలదు. ఈ రెండుసేనల బారినుండి తప్పించుకొని పోవ నీ మావళాలకు మార్గములేదు. వెనుక బిజాపూరు మొగలసేన లేకీభవించినప్పు డెట్టి ప్రమాదము వాటిల్లెనో స్వానుభవముచే నెరిగిన శాహాజీమహారాజును జూచియైన నాతనిపుత్రుడు బుద్ధి తెచ్చుకొనుట యోగ్యము.

శివా — ఆ ప్రమాదము నే నెరుగునది కాదు. కాని రాజనీతినిపుణులకు దానిని తప్పించుకొనుట అసాధ్యము

కాదనినా మతము. ఢిల్లీపాదుషా, బహామనీసుల్తానులునూ ఏకధర్మావలంబకు లైనను రాజ్యవిభాగమున వారికి స్పర్ధలు లేకపోలేదు. అది అదనుగా గొని వారిసైన్యముల నేకీభవింప నీయక వారిలోవారికి పోరుపెట్టుట యుక్తిపరులకు దుష్కరము కాదు. అట్లు జరిగినచో నా కాసైన్యముల సంకలనమును కాక తద్వ్యవకలనము నెదిరింపవలసి వచ్చును. మీరిప్పుడు వర్ణించినరీతిని పాదుషాసైన్యము మహాసముద్రమునూ, దక్షిణసైన్యము దావానలము నైనచో, మొగలసేన మమ్ము ముంచివేయకమున్నా, దక్షిణసేన దగ్ధముచేయకపూర్వమునూ ఆ సైన్యము లొండొంటిని తారసిల్లి అందులో నొకటి హాతమైన కావలయు, లేదా హుతమైన కావలయును; అట్టి యేర్పాటుల నే నాలోచించియున్నాను. శేషించిన సైన్యము పసిబట్టుటకు మా మావళాలు చాలుదురని మీ రెరిగియే యుందురు. పాదుషావారి పరికరసంపత్తిని మీరు వర్ణించుట వినినప్పుడు నాకు పరమానంద మాయెను, ఏలయన ఆసంపదంతయు మా వశము కానున్నది. అంతవరకూ వారు దానిని న్యాసమువలె కాపాడుచుందురు. త్రేతాయుగమున వానరసేనచే రాళ్ళతో సేతువుకట్టించి సముద్రము లంఘించినరీతి ప్రకృతమున మా సేనచే స్వరాజ్య స్థాపనము చేయించవలయునని ఈశ్వరసంకల్పమగునట్లు సూచనలు కానవచ్చుచున్నవి.

శంభూ—నీ యోచనలన్నియు కపటోపాయములపై నాధారపడియున్నవి. అర్ధరాత్రమున అమాంత మరులపై

బడుట, కలహములను పెంచుట, విశ్వాసఘాత మొనర్చుటకు తంత్రములు పన్నుట కన్న తురకలవలె సమరభూమిని హాహాకారిగా పోరుట నాబోటి పోటుబంటునకుచితము కాదా? ధర్మయుద్ధ మవశ్యకర్తవ్యము.

శివా — సూరాను గారూ, ఆ సేతుశీతాచలము తమప్రభుత్వ మనుచ్చుకొనిన తురక లిప్పుడు ధర్మయుద్ధప్రశంస చేయుట వింతకాదు. ఆదిని వీరభ్యసించిన విద్య కపటనీతి కాదా? నాప్రభుత్వమూ ఈశ్వరానుగ్రహముచే వారి ప్రభుత్వముతో సమమైనప్పుడు నేను కూడా ఇట్లే శ్రీరంగనీతులే చెప్పుచూ ధర్మోపన్యాసము లిచ్చెదను... ధర్మయుద్ధ మొనర్పవలెనన్న ఉభయపక్షములూ సరిసమానముగా నుండవలయును. ఇప్పుడిరువీరుల బలాబలములు మీ కెరుంగనివి కావు. సమరభూమిని సైనికులరక్తము వరదలై పారినను పాదుషావారి కెట్టిహానియూ కలుగనేరదు, వారి సాధనసంపద అమేయము. నా వీరులరక్తము నేనతిమితముగా వ్యయముచేయవలయును, వృథారక్తపాత ముండనేకూడదు. తురక లధికారసంపన్నులు, మే మధికారహీనులము; వారు కుబేరులు, మేము కుచేలులము; వా రస్త్రకలితులు, మేము నిరస్త్రిలము; వారిసైన్య మసంఖ్యాకము, మా సైన్యము గుప్పెడు; వారు బాహుబలము నాధారముగా నొనర్చుకొన్నారు, మేము బుద్ధిబలము నాధారపర్చుకొన్నాము. ప్రతివిషయమునను వారికీ మాకునూ వైషమ్య మున్నప్పుడు మేము రాజనీతి

వనుసరింపకధర్మము నాశ్రయింపవలెనని తురక లపేక్షించుట చూడ మల్లయుద్ధమున క్రిందబడినవాడు పైనున్నవాడు తన్నే మియూ చేయగూడదని అపేక్షించున ట్లున్నది. యుద్ధమున బాహుబలమూ బుద్ధిబలమునూ ముఖ్యసాధనములు; మాకు బాహుబలము తక్కువగుటచే మేము బుద్ధిబలము నుపయోగింతుము.

శంభూ—నీ కపటకృత్యములకు, విశ్వాసఘాతలకు, హత్యలకును దేవుడునీకెట్టి శిక్ష విధించునో ఇంచుక ఆలోచించితివా?

శివా—స్వదేశోద్ధారణమునకు స్వరాజ్యసంస్థాపనకును నాకావశ్యకములగు కుతంత్రములు, విశ్వాసఘాత, హత్యలను గురించి దైవము నా కెట్టి ఘోరశిక్ష విధించిననూ వలదనను; రౌరవాది నరకములలో నన్ను ద్రోయుట యుక్తమని ఆతడెంచిన నేనచట నుండుటకుసంసిద్ధుడనని నమ్ముడు.

శంభూ—శివబా, నా సందేహములన్నియు తీరినవి. నీమార్గమే శ్రేయమను నమ్మకము నాకు కలిగినది.

శివా—ఐనను మీమార్గ మిట్టిదని నాకు స్పష్టముగా లేదు.

శంభూ—మహారాష్ట్రులకందరకూ వంశపారంపర్యము సర్వసాధారణమైన మార్గమే నే నవలంబింతును. మీ తండ్రిగారివలె నీవూ బిజాపూరు వారి ఆశ్రయమున నుండి మీకులకీర్తిని వృద్ధిచేయవలయు,గొప్ప జాగీరులనందవలయు,

ఉత్తమ బిరుదముల నొందవలయు నని ఊహించియుం టిని గాని ఆయభిప్రాయ మిప్పుడు వ్యత్యస్తమయినది.

శివా—నాకు బిరుదములు కావలెనన్న బిజాపూరు సుల్తానువారి అనుగ్రహ మేల? వాటిని నేనే స్వీకరింపగలను- నా పేరునకు ముందువెనుకల బిరుదుల నేనే తగిలించుకొంటిని, మీరు వినలేదు కాబోలు.

శంభూ—చంద్రారావనియా లేక సూర్యారావనియా?

శివా—అట్టి ఉచ్ఛిష్టముల నేను కొందునా?

శంభూ—అట్లైన క్రొత్తబిరుదుల కల్పించితివి కాబోలు?

శివా—ఛత్రపతి శివాజీ మహారాజు.

శంభూ—నాయనా, నీ వాపదవి నొందగల్గినందుకు నా కమితానందము కల్గుచున్నది.

శివా—అట్లయిన మా కార్యనిర్వహణమున మీరు నాకు తోడ్పడెదరని నే నెంచవచ్చునా?

శంభూ—నేను తోడ్పడుట నిశ్చయమే కాని నా యందు నీకు నమ్మకము కల్గుటెట్లు?

శివా—మామగారూ, మీ పురాతనమతమును మీరు వీడనున్నప్పుడు మీయందు నా కపనమ్మక ముండుట కూడునా? నావాడని నేనెంచిన వానియందెల్ల నాకు సంపూర్ణవిశ్వాస ముండును. అందుకు సంచకరువుగా నేడే మిమ్ము మీ కూతుళ్ళకడకు గొంపోయెదను; మిమ్ము చూడవలయు

వని వారు కౌతూహలము వహించియున్నారు. నాపత్నిమును మీరు స్వీకరించిరని విని వారు మిగుల సంతసింతురు.

(పోవుదురు)

—నాల్గవ రంగము—

(శివాజీ, ఆబాజీ, శంభూజీలు)

శివా—కళ్యాణదుర్గముపై దండెత్తుటనుగూర్చి ఆలోచింపవలసి యున్నందున మిమ్ము కబురంపితిని. అందలి ద్రవ్యాగారమును హరించి యిప్పటికే వారిని నొప్పించినాను, కావున వారు కసిదీర్చుకొను కాలమునకై వేచియుండి తగు ప్రయత్నముల సల్పుచుందురు. ఆ సన్నాహము ముగియకుండగనే దుర్గమును మనము చేత జిక్కించుకొనవలయును.

ఆబా—ఆబాసాహెబుగారూ! నా దొక మనవి—

శివా—ఆబాజీ-మనలో మనవులు చేసుకొనునంత భేదభావ ముండగూడునా? ఏమి కోరదలచిరో కోరరాదా?

ఆబా—విన్నప మొనర్పదలచిన విషయ మించుక మహాత్వకలితము కాన దాని మీ రంగీకరింపరేమో అని చెప్ప వెరచుచున్నాను.

శివా—అదెట్టిది?

ఆబా—ఆ కోట ముట్టడించుటకు ప్రభువుగారు నా కాజ్ఞ నొసంగవలయునని వేడుచున్నాను.

శివా——ఆ కలహమును నే నారంభించితిని కావున నేనే దాని ముగించుట న్యాయము.

ఆబా——నామాట యాలింపుడు-ఆ దుర్గముతోటి సంబంధము మీకు నేటిది కాని నాకది వంశపరంపరాగతమని మీకు తెలిసియే యుండును. నాము త్తవ్వ శివపురము చేరక ముందు కళ్యాణదుర్గము చెంతనున్న మా అగ్రహారమున నుండెను. మాపూర్వుల నానుబేదారులు అజస్రము బాధలు పెట్టుచు తుదకు వారిని ఘోరముగా హతమొనర్చిరి. ఆవివర మంతయు మాము త్తవ్వ నాకు చెప్పుచుండుటచే బాల్యమున నే ప్రతీకారవాంఛ నాకు పొడమి, వయసుతోడ వృద్ధిపొందినది. తమయండ నుండి శత్రువుల రుధిరముతో పితృతర్పణ మొనర్చి ఋణవిముక్తుడను కావలయునని ప్రతిజ్ఞించుకొని యున్నాను. నాయాశలు ఫలించుటకు నేడు తగినతరుణము తటస్థించుటచే వారిక్రౌర్యమునకు వినియయముగా హింసకు ప్రతిహింస, హత్యకు ప్రతిహత్య, బలాత్కారమునకు బదులు బలాత్కారము-ఈతీరున లెక్క వారలకు సరిగా ఒప్పగించిన కదా నాజన్మము ధన్యమగును.

శివా——అబాజీ, మీరు పవిత్రమైన బ్రాహ్మణకులమున జన్మించితిరి. క్షమ, తితీక్ష, విరాగము మొదలగు గుణములు మీకు స్వాభావికములని మీకొకరుపదేశించవలయునా ? హత్య, అత్యాచారములును తురకలొనర్చునపుడు ఘోరములు నింద్యములందుము కదా, బ్రాహ్మణులు

వాటి నొనర్చునపు డవి సౌమ్యములు స్తుత్యము లగునా? మీ పూర్వపురుషుల బాధించిన తురకలు మానవత్వము పరిత్యజించి పశుత్వమును పరిగ్రహించిరి. మీరూ వారివలెనే ఆచరించిన ఆపశుత్వము మీకు మాత్రము సిద్ధింపదా? అట్టిచో మీరెవరి కపకారులగుదురు, వారికా, మీకా!— మరియు మీరెప్పు డెట్లు ప్రవర్తింప నెంచితిరో అట్టి ప్రవృత్తినే తురక లవలంబించినందులకు వారిని మీరు నిందించుట కూడునా? వారి పశువృత్తి క్షణికము, మీరు పాతకయ్యముల పెకలించి వారియెడ నత్యాచారము సేయబూనుట పశువృత్తిని మీరిన రాక్షసవృత్తి యగును. తాతచేసిన తప్పునకు మనుమని శిక్షింపనెంచుట దొంగను వీడి దారిబోవు సన్యాసిని ఉరిదీసినట్లుండును. ఇంతేకాక పురుషుల దురాచరణమునకు స్త్రీలపై కసిదీర్చుకొనుట రాక్షసవృత్తిని మీరిన దగుటచే దానికేమి పేరిడదగునో ఎరుంగజాలము. అట్టి ప్రవృత్తు లతిశయించెనా ఇక దేశమున శాంతి ప్రబలుటెట్లు?

ఆబా—ఘోరశిక్ష విధించినచో శత్రువు భీతిల్లి తిరుగ దురాచారపరుడు కానేరడని మీ రానతీయలేదా?

శివా—అది నిజమే. ఆనిబంధన మాశత్రువునందు వర్తించును, ఆశిక్షయు అపరాధము జరిగినవెంటనే విధింపబడవలయు. ఇందా రెండులక్షణములూ పట్టలేదు. విశ్వాసనీయశూరులగు మామూవళాల రక్తపాతము నాకసమ్మతమగురీతిని శత్రుపక్షరక్తస్రావము కూడ నాకసమ్మతమే. అం

దును ముఖ్యముగా అబలలయెడ అతి జాగరూకతతో మెలగ వలయు. పాపము వారెవ్వరికి నపకారము సేయువారు కారు, చేయనేరరు; ఆత్మరక్షణము వారి కసలే చేతగాదు. అట్టి అమాయికల కపచారము సేయబూనుట పౌరుషహీనత కాదా! అట్టి కృత్యము నాకు అసమ్మతము. నాకార్య సిద్ధికి నాపక్షము వారి ఆశీర్వాదబల మెట్లావశ్యకమో శత్రు స్త్రీలఆశీర్వాదబలిమి కూడ అట్లే ఆవశ్యకము.

శంభూ—శివబా, స్త్రీలయెడ నీకు సానుభూతి ఎక్కు దున్నట్లు తోచెడిని.

శివా—ఏల యుండగూడదు? మాతృశ్రీ జిజాబాయి తుకాబాయియు స్త్రీలుకారా? అట్టివారే నకన్యస్త్రీలు-వారియం దాదర ముండకూడదా?

శంభూ—(స్వ) నిజము నిలకడమీద గాని తెలి యదు.

శివా—ఆబాజీ, కళ్యాణదుర్గము నెడ మీ మనోభా వము లిరకను మాఅకుండినచో మి మ్మింటిగా నటబంపుట యుక్తమగునో కాదో ఆలోచింపవలసి యుండును.

ఆబా—మీ యుపదేశానంతరమునా ద్వేషాహంకార ముల నణచుకొనలేకున్న ఇంతకాలము మీతో సహవాసము చేసిన ప్రయోజనమేమి?

శంభూ—ఇంతయేల! నీ వనుమతించితివేని ఆబాజీతో కూడ నేనుండి వాని యుద్రేకము నడచుచుందును.

శివా—ఇది మేలు. అట్లే చేయుదుము. మిమ్ముచూడ గోరు మీకోడళ్ళు నిరువుర నొక్కచో కూర్చెద, మీరు నావెనువెంట మహాలునకు రండు. (శివాజీ పోవును)

శంభూ—ఆబాజీ-చిన్ననాటనుండియు మనమున రగులుచున్న ద్వేషాగ్నిని నివారించుట దుస్సాధ్యము. యుక్కువగల కోర్కెను మట్టిబెట్టుదురా?

ఆబా—సత్యమే-కాని ఆకోర్కె నిర్వహించుటకు పరిస్థితులు ప్రతికూలములు లయినచో ఏమి సేయనగును? పోనీ ఆతురకల సర్వారీతిని దండించు సుయోగము లభింపకున్నను వారికోట నాక్రమించుటవలన చేకూరు యశము మాత్రము సామాన్యమా?

శంభూ—ఆబాజీ! మీనిర్యాతనము నిర్వహించుటలో మాత్రము మీకు లోటురానేల?

ఆబా—ఆబాసాహేబు సౌశీల్యము అనువర్తనీయము.

శంభూ—ఆదేటిమాట? ఆతని శీల మింతదనుక పరిశుద్ధము కానచ్చును. కాని దానియందు కళంకబీజ ముండకపోదు. అది యంకురించుట కింతవఱకు అవకాశము చిక్కలేదు. ఇంతకూ అతనిప్రాయ మెంత? పరిజ్ఞాన మెంత? నారీలోకమున తనభార్య లిరువురే అని అభిప్రాయపడుచున్నాడు-వారికన్న వేయిరెట్లందకత్తియలు వేనవేలున్నారని యెరుగడు. వారి విలాసములయెడ నాతని కింకనూ విసుగు జనింపలేదు. వాని భార్యల యందము వాని యౌవనముచే నాగో

పింపబడినదే కాని నిసర్గనిష్పిత్తము కాదు. తారుణ్యప్రభావమున తరుణులందరూ దర్శనీయులై యుందురు. ఇదియునుగాక మనరాజుగారు మోటుమహారాష్ట్రము గాక ఇతరదేశము నకు పోనేలేదు. తురకల హర్మ్యములలోని అప్సరలబోలు అందకత్తెల సౌరు వారికంటబడనేలేదు. ఒక్కసారివారినివీక్షించి కామశరాహతులైరా చో వీరెట్లు చిందులుద్రొక్కుదురో మీరే చూడగలరు.

ఆబా—మహారాజుగారికి తమరాణులయం దమితప్రేమ కలదని మీరు వినలేదా?

శంభూ—ఇరువురు స్త్రీలయెడ మితిమోహమట ! ఆబాజీ! మిమ్ముజూడ నాకునవ్వువచ్చుచున్నది. పురుషులప్రేమ ఏకనిష్ఠమగు నంతవఱకే దాని నమ్మవచ్చును. అందు భాగహారిణు లమరినచో అటుపిమ్మట నాప్రేమ వెట్టికుక్కవలె చూచినవారినెల్ల కఱవజొచ్చును. కన్యలనియు నవోఢలనీ విచక్షణము దాని కుండదు

ఆబా—ఇతరులవిషయమున నిట్లు జరుగవచ్చును. కాని శివాజీయెడల నిది వర్తించునని నేను నమ్మను.

శంభూ—ఆతడును మానవుడే కదా? నేటి సంభాషణయందు స్త్రీప్రశంస వచ్చినప్పుడెల్ల ఆతడు మెత్తబడుచుండుట మీరు గాంచలేదా?

ఆబా—అట్లనెదరేల? వారి స్త్రీదాక్షిణ్యము ఇతర సద్గుణములవలె అపూర్వము.

శంభూ—స్త్రీదాక్షిణ్యమా? ఇట్టి స్త్రీదాక్షిణ్యమే స్త్రీలోలత్వమునకు బీజము.

ఆబా—ఊఱకుండుడు. మీపలుకు లెవరేని వినినచో కిట్టనిమాట లందురు.

శంభూ—ఏమిటీ లేనిపోని ఊహ! మీకు హితము చేయగోరియే ఇట్లనుచుంటిని. నే నీప్రమేయములో తలదూర్చుట మీ కుపకారము చేయుటకే కాని వేరు కాదు. ఇటు చూడుడు-ఏమి ఈ శివబాబుద్ధిమాంద్యము! శత్రువుల నిర్జించు నడ దౌర్జన్యము,జో రావరియు కూడదని సాధువులగుమీబోటి బ్రాహ్మణు లెంచుట సహజము కాని జిగీషువగు క్షత్రియున కది తగునా? సద్బ్రాహ్మణులగు మీరు దురాగతములచే దుష్టుల దండింపనెంచుటయు, క్షత్రియుడగు శివాజీ సాధుత్వము నవపాదించుటయు వ్యత్యస్తధర్మములు కావా? శత్రు రాజ్యములయందు నిరంకుశముగా చెలరేగనీయకున్న దేశముల జయింప నుత్సాహము కల్గునట్టులు? కొందఱు బంట్లు లూటి నపేక్షించి పోరాడుదురు, మరికొందఱు పదకర్తల నాశింతురు. బంగారు, రత్నములు మొదలగు ద్రవ్యముల కొందఱపేక్షింప బంగారు బొమ్మల నితరు లపేక్షింతురు. ఇందేదియూ వారికి లభింపనిచో వారు ప్రాణములచేత బట్టుకొన ఆయితపడుదురా?

ఆబా—లూటిలో దొరికిన ద్రవ్యాభరణముల తమ ముందిడవలయునని మహారాజుగారు శాసించియున్నారు.

శంభూ—చూచితిరా; కనకముపట్ల సైనికుల విశృంఖలవృత్తి నొప్పుకొనిరన్నమాటయే కదా? దీనిచే సైనికుల కెట్టినష్టము ఘటిల్లినను రాజునకు లాభముండును......కనకమునుగూర్చి చేసిన ఏర్పాటుకాంతలపట్ల కూర్చుట కాటంకమేమున్నది? అందలి సారస్య మాతనికి తెలియకపోవుటయే దీనికి హేతువు. శత్రుశిబిరమున జిక్కిన సౌందర్యవతులనెల్ల మహారాజు గారి ప్రమోదార్పణము చేయవలెనని శాసించుట ఎంతయు సమంజసము. ఇట్టి శాసనము పుట్టుటకుజగన్మోహినియగు కాంత వాసికెంట పడవలయు. అట్టి సౌకర్య మీదండయాత్రలో చేకూరిన నెంతయు శ్రేయమగును.

ఆబా—చేకురకేమి? కళ్యాణసుబేదారు కోడలట్టి రూపవతియే అని వింటిమి.

శంభూ—మరియు మేలే-వశకిలాయినతీగ కాలికి తగినట్లైనది. ఆకాంతను భద్రముగా తెచ్చి శివబాకు కన్పనుచ్చెదము.

ఆబా—అయ్యో బాబో! ఆబాసాహెబునాజ్ఞ నుల్లంఘింతునా? కలలోనైన నట్లు చేయజాలను.

శంభూ—ఇందాజ్ఞోల్లంఘన మేది? మీరామెను బలాత్కరింపరు కదా. అమూల్యమగు స్త్రీరత్నము నా బాబ్జీకి కానుకగా నిత్తురు. రిక్తహస్తములతో రాజును దర్శింపగూడదని శాస్త్రమున్నది కదా? కానుకలలోననేకవిధము లున్నవి. బ్రాహ్మణులు కొబ్బరిచిప్ప కధిపతులు కావున కొబ్బరికాయ

నర్పింతును. నాహాలుకారి ధనవంతుడు కావున రత్నాంబర ములనర్పించును. విజయశ్రీచే వరింపబడిన వీరుడు తన బాహు బలముచే గడించిన కాంతామణిని కానుకగా నొసంగుట యోగ్యము.

ఆబా—నాకృత్యముల సరిచేయుటకు మి మ్మాబా సాహెబు నాకు తోడుగ బంపుచున్నారు కావున నేను మీ మాటల పాటిచేసినచో అపరాధిని కాజాలను.

శంభూ—ఆచింత మీ కణుమాత్రమును వలదు. దానికి నేను పూచీపడెదను. మీరింక పొండు- నేను రాణుల చూడబోయెదను (అబాజీ పోవును)........ఏమి శివాజీ దుండగము! స్వరాజ్య సంపాదనమున తనకు సాయముచేయుని మహారాష్ట్ర వీరుల కంటకములవలె వీడు పెరికి పారవేయునా? మంచిది-ఛత్రపతీ! మహారాజా! నీవే నన్ను నిర్మూలింతువో, లేక నేనే నిన్ను నిర్మూలింతునో చూచెదవుగాక! నీయధి కారము నణగద్రొక్కక ఈ శంభూజీ యూరకుండువాడు కాడు. నీప్రశస్తి బాహుబలప్రతిష్ఠితము కాదు, కాపట్యమున కార్యమును సాధించుటయే పరమపురుషార్థమని నీ వెంచు చుంటివి. నీకు పరద్రవ్యపరాఙ్ముఖత్వము లేనేలేదు. పరులద్రవ్యము నపహరించుపట్ల నీ వెంతనీచము కేని ఒడిగట్టుటకు జంకవు. నీస్వహితపరాఙ్ముఖత్వమును స్త్రీదాక్షిణ్యమునూ చూచి ముగ్ధులై అనాగరకులగు మహారాష్ట్రులు నీకు లోబడుటచే వారిబలము నాధారము చేసుకొని నీ వాడుచున్నావు. నీ

భటులు తమ సర్వస్వమును నీకు ధారపోసి రణమందు ప్రాణములను కూడ నీయశోవహ్ని కాహుతి చేయుచున్నారు. శాత్రవుల స్త్రీలయెడ నీనిర్మలమైన ప్రవర్తనము చూచి నిన్నందరూ గౌరవింతురు. నీవు పరస్త్రీపరాఙ్ముఖుడవుకావని పదిమందీ ఎరిగినచో నీయశోదీపము సన్నగిల్లును. అంతదనుక నే నప్రమత్తుడనై యుండెద. నీవు ఉన్నతపదవినుండి నన్ను దిగలాగినచందాన నిన్ను నేను క్రిందకీడ్చెదను. నన్ను నీవు పదభ్రష్టుని చేసినందుకు మాఱుగ నిన్ను నేను నీతిభ్రష్టునిగ జేయకున్న నా యవమానాగ్ని చల్లారదు.........

(నిష్క్రమించును.)

—ఐదవ రంగము—

(ఇద్దఱు రాణులు, అమాత్యుడు—కాశియువాడ్ తురకవర్తకులు, ఇద్దరింగీషువర్తకులు కూర్చుండ శివాజీ ప్రవేశించును)

శివా—అమాత్యవర్యా, నేడు మీరు చాలసందడిలో నున్నారు-బట్టలబేరమున మునిగియున్నారు కాబోలు-మొన్న మాకు చిక్కిన ధనమునంతయు నిద్దరురాణులూ నేడే వ్రయపరుప నెంచలేదుకదా?

అమా—మహారాజుగారి అంతర్యము ననుసరించియే పతుబాయి గారు బేరమాడుచున్నారు.

శివా—అదెట్లు?

అమా—మన సైనికులలో గతించినవారిగూర్చియు గాయపడినవారిని గూర్చియు ఏర్పాటులు ప్రభువుగారే కావించియున్నారు. మొన్నటి యుద్ధమున అసమానశౌర్య సాహసముల నగపరచినవారిని బహూకరించుట మిగిలియున్నది కావున అందుకుతగిన ఏర్పాటులు చేయ మహారాణిగా రంగీకరించియున్నారు.

శివా—భళీ! ఈమె నాయర్ధాంగి యనదగును. ఏమేమి కొన్నారు?

సతీ—తలపాగాలు, రుమాళ్ళు, దుప్పట్లు, ఉత్తరీయములు నే నెంచుచుంటిని, సోయరా శాలువలూ, పీతాంబరములూ, చీరెలూ ఏర్చుచున్నది.

శివా—చిన్నరాణిగారు చూపిన పరాక్రమమేమి పారితోషికమునకు—?

సోయ—పురుషులు చూపు పరాక్రమము కేవలము వారి కృపాణములయందే ఆధారపడియుండునని లోకులందురు గాని వారిసతుల మంగళసూత్రమహత్వమే అందుకు ముఖ్యకారణమని నానమ్మకము.

శివా—సత్యమే-శత్రువు లీవిషయము నెరుంగరు కావున ముందు మీకంఠము లుత్తరింపక మామెడలు నరుకుచున్నారు...నీ మతమున మా డాలులు మమ్ము కాచుట లేదన్న మాటయే.

సోయ—సతుల మంగళసూత్రమహిమ సడలకున్న

మి మ్మన్యవిధముల గాచుట అనవసరము.

శివా—అటులనా ? మీ కుంకుమ యను డాలు న్నదని మాకెన్నడును తోచలేదు. మీరిరువురును నాపిత రుల ప్రసాదమని నేను గ్రహించియుంటిని. అది నేడు సార్థ కమయ్యె. పెద్దరాణిగారు మా అమ్మగారి ప్రసాదము కావున వారియందు లజ్జావినయాంశ మధికము; చిన్నరాణిగారు మా తండ్రిగారి ప్రసాదము కావున వారియందు తేజపాలు హెచ్చు...మీరుభయులు పెంచిన వస్త్రముల జూపుడు.

(శంభూజీ వచ్చును.)

దయచేయుడు మామగారూ, మీ కొమార్తెల వివేక తారతమ్యముల కనులార గాంచుడు. ఈ ముదుగువస్త్ర ములు మీ పెద్దకూతురికి నచ్చినవి, ఈసన్నని బట్టలు మీ చిన్నకూతురెంచినవి. (ఒక మడత విప్పి) ఈవస్త్రములు కులీ నురాలికి పనికిరావు. ఇట్టి వస్త్రములు నందలకొలది యిచ్చియు శ్రీకృష్ణుడు ద్రౌపదీమానసంరక్షణ మొనర్ప జాలడు. దీని ధరించిన విలాసవతి యొడలే కాక అంతరంగమును స్పష్టముగా గాంచనగును. ఇది గాలికన్న పలచనై పారదర్శక మగు చున్నది.

సోయ—ఇట్టి వస్త్రములను భర్తల దృష్టిసౌఖ్యము నకు భార్యలు ధరింపనగును.

శివా—సరిసరి. ఇది కంటె కగపడినకదా దృష్టిసౌఖ్య మబ్బుట! దీనిని ధరింపకయే ధరించితి ననవచ్చును-ఇట్టి

వస్త్రము మాకు కాపట్టదు. శెట్టిగారూ, దీనిని మూటలో కట్టుడు-మాకీ ముతక వస్త్రములే తగియున్నవి. మోటు మావళాల రాణిగారికి మోటు వస్త్రమే శోభాకరము. ఈ జిలుగు వస్త్రములు ఢిల్లీ బీజాపూరు సుల్తానుల జనానా వారికే తగియున్నవి. సుఖవాసులు, భోగపరులగు వారి చెంత నివి వత్సరములకొద్ది మనగలవు. కోమలగాత్రలు వారెంత వాడిననవి చిరుగునను భయము వారికుండదు. మామోటు శరీరముల రాపిడికవి నిలువజాలవు. వస్త్రములకూ వాక్యములకును వృత్తివైపరీత్య ముండును. కొద్దివారి వాక్యములు వారిభావముల వ్యక్తపరచుచుండ, వారి వస్త్రములు వారిశరీరములను మరుగుపరుచుచుండును; గొప్పవారి వాక్యములు వారి భావములను మరుగుపరుచుచుండ, వారి వస్త్రములు వారిశరీరముల వ్యక్తపరుచుచుండును.

సోయ—సఈబాయి నాకన్న ఈడుముదిరినది. కావున ఈముతక వస్త్రము లామెకే శోభాకరముగా నుండును.

శివా—వయసున పెద్దవారికి వివేకము హెచ్చగునా? పూర్వకర్మపరిపాకము వెంటవచ్చినచో వయసున బాలుడయ్యు బుద్ధిని వృద్ధుడగును, అది లేకున్నచో వయసున వృద్ధుడయ్యు బుద్ధిని బాలుడగును.

సోయ—సూక్ష్మ విషయములలో మహారాజుగారి కర్హమైన సలహా నిచ్చుటయం దీదాసి అసమర్థురాలైనను, వారు నిరుత్సాహమనస్కు లగునప్పుడు మనోరంజన మొనర్ప

కలు సాముద్ర్యమలవడిన దీనిజన్మము ధన్యతమ మనియే భావించును.

శివా—ప్రేయసీ, చిన్నబుచ్చుకొనుట కిందవకాశమే లేదు. నా సంసారనిర్వహణమునకు మీరుభయులూ ఉండ తగినవారే. అమాత్యవర్యా,...ఇతరవర్తకుల యొద్ద పుచ్చుకొనదగు వస్తువులున్న వాటిని తీయించుడు.

కా॥ వర్త—మహాప్రభూ! నావద్ద కొంత పాతసరుకు కలదు. మీవాగ్ధోరణిబట్టి చూడ నవి యిక్కడ చెల్లునని ఆశ వొడమున్నది. ఆనతిచ్చినచో వాటిని చూపెదను.

సోమ—పాతసరుకు మాకేల ?

సతి—కొన్నిసందర్భములందు కొత్తదానికన్న పాత సరుకే ప్రశస్తమగును. ఔషధముల సేవించునప్పుడు కొత్త కుప్పె కొత్త తేనె కన్న పాతకుప్పె పాత తేనె శ్రేష్ఠతరములు కావా ?

శివా—ప్రేయసీ, మేలైన మాటాడితివి. సువస్తువులకు కొత్త పాత అను భేద మనావశ్యకము. శారీరకవ్యాధుల పారద్రోలుటకు పాతదిను సెట్లుపయోగించునో అటులే మానసికవ్యాధుల పోగొట్టుటకు ప్రాచీనసాహిత్య ముపయోగించును. కాలుమహిమను పాత ఔషధములు సాగనివ్వనట్లు కాలమహిమను పాతగ్రంథములు సాగిపోయును.

కా॥ వ—(ఉత్తరీయమునుదీసి) దీనిని చిత్తగింపుడు. ఇది విజయనగర సంస్థానాధీశ్వరులు అనేకతరములు వాడు

కొనిరి. ఆరాజ్యము కూలిపోయినప్పుడు ఇతర ఆశ్రితులతో పాటు ఇదియు అన్యుల నాశ్రయించినది. నేను గొప్పవెల నిచ్చి దీని సంగ్రహించితిని. దీని నేత ఎంత ప్రశంసనీయమో గాంచుడు.

శివా—(దానిని చేత బూని) ఈవస్త్రము ప్రాచీన మనుటకు సందియము లేదు. దీని పలుచని నేతగుండా విజయనగరేతిహాసము నాకు స్పష్టముగా గోచరించుచున్నది కళలకు, విద్యలకును పుట్టిల్లు, దిగ్విజయశీలురగు రాజులకూ వేదవిద్యాపారంగతులగు మంత్రులకూ ఉనికిపట్టు, బాహుబలమునకూ బుద్ధిబలమునకును విలాసక్షేత్రము! కటకటా! అట్టి ప్రబలము, విస్తీర్ణము నగు సామ్రాజ్యవైభవమున మిగిలిన యున్న దీవస్త్ర మొకటియేనా,?... “కాలాయ తస్మైనమః” అమాత్యవర్యా! ఈవస్త్రము నొకచోట నుంచుము (ఇచ్చును)

కా॥ వ—ఈ రెండవ వస్త్రము మొదటిదానికన్న విలువ మీరునదని యెంచనగును. (చూపి) ఇది అహమ్మదునగరురాణి చాంద్‌బీబీ గారి “చంద్రకళ” అని పేరువడసిన చీర. దీని ధరించినప్పుడాయమ జలధరాచ్ఛాదితంబగు చంద్రు లీల గానవచ్చుచుండెనని చెప్పుకొందురు. ఆపట్టణపు లూటీలో నిది యొకసైనికునికి చిక్కెను. నేను దానిని కొని తెచ్చితిని.

శివా—ఏ రాజ్యము క్షీణదశ నొందుచున్నప్పుడు మాతండ్రిగారు తమ యావచ్ఛక్తియు దానిని నిలువబెట్టుటలో నుపయోగించిరో, అట్టి రాజ్యమును తనశౌర్యబలిమిని బుద్ధి

బలముచేతను కాపాడిన పుణ్యవతిని గౌరవింపనివా రుందురా ? సోయరా, నీ విం కవస్త్రముల కొనవలసియున్నది కావున దీని పుచ్చుకొనుము.

సోయ—తురకదానివస్త్రమునా ?

శివా—అయ్యో, వెఱ్ఱిదానా-మహాత్ములకు కుల ముతో నేమిపని ? గనులలో నుండి రత్నములు వెలువడ లేదా ? మిన్నన నవి మనకు లభించునా ? మహానుభావుల సహవాస ముచే నెట్టిఫల మబ్బునో అట్టిఫలమే వారివస్తువుల సహవా సముచే నబ్బును. అమాత్యా ! దీనినిగూడ మీదగ్గర నుంచుము.

కా-వ—మహాప్రభూ ! ఈ శిరోవేష్టనమును తిల కింపుడు. ఇది చిత్తూరుప్రభువులగు ప్రతాపసింహ మహారాణా వారిది.

శివా—అది మీ కెట్లు లభించెను ?

కా-వ—ఆమహాత్ముని కొకయిక్కట్టు వచ్చి వారు దీని నొకవర్తకునకు విక్రయించిరి. ఆవర్తకునకు దానిమహిమ తెలియకుండుటచే మాతండ్రి దానిని కొన్నాడు.

శివా—ఈవస్త్రము లిదివర కమ్ముడుబడక మీవద్ద నుండుటకు కతమేమి ?

కా-వర్త—ఇది అచ్చిరాదని చూచినవారెల్ల పెదవి విరిచి మోము త్రిప్పుచుండెడివారు దేవరా !

శివా—ఆహా ! లోకు లెంత అజ్ఞానులు ! రసపుత్ర

వీరకేసరియగు మహారాణా ప్రతాపసింహుని భవ్యశిరము నలంకరించినవస్త్రము, కలలోనైన పారతంత్ర్యవిచారమునకు చోటీయని శిరస్సు నాచ్ఛాదించిన వస్త్రము, శత్రువునకు లొంగియుండని వీరశిఖామణి వస్త్రము, శత్రువుల అడుగులకు మడుపులెత్తు వీరమ్మన్యుల కచ్చివచ్చునా? ఏ పురుషోత్తముని పేరు తలపువచ్చినంతనే పిఱికిపందల యుల్లమునం దైన వీరావేశము జనించి ఆచంద్రార్క మంతరించకుండునో అట్టి మహాత్ముని వస్త్ర మచ్చిగాదా? నే నీశిరోవేష్టనమును పూజ్యభావముతో నాచెంత నుంచుకొందును. సంకటములకు నేను లోనగునప్పుడు ఈవస్త్రము నామానసమున నుత్సాహచైతన్య ముదయింప జేయును... సెట్టిగారూ - మీ మాటలు సత్యమని యెంచి ఈవస్త్రముల నేను కొనుచున్నాను. అమాత్యవర్యా-వీరికి వీటివెల నిచ్చివేయుడు. వీ రెవరు, వీరి వర్ణము, నగ్నశిరస్సులును జూడ ఐరోపీయులవలె నున్నారు.

అమా—వీరి నాంగ్లేయులందురు.

శివా—వీరి దేశాభిమానము తీవ్రమైనది. వీరు మంచిశూరులు, చతురులగు నావికులు, మద్యపానము వీరి కాచారము. ద్రవ్యలోభము వీరికి మెండు; ద్రవ్యమే వీరికి దైవము- వీరి స్త్రీదాక్షిణ్యము కూడ ప్రశంసనీయము. వీరిస్త్రీలు పురుషులతో సరి సమానముగా వ్యవహింతురు. వారికి స్వాతంత్ర్యము మెండు.

స. ఈ—పురుషులందరితో స్త్రీలు కలిసిమెలిసి వర్తిం

చుట సిగ్గులేమి కాదా ?

శివా—అట్లన బాడదు. వ్యక్తులనీతిని తత్తత్సమాజ ములందు రూఢిచెందిన నీతి నియమముల బట్టి నిర్ణయించుట యుక్తము. తురకలకన్న మా స్త్రీలకు స్వాతంత్ర్య మెక్కు డగుటచే వారు మనవారిని స్వైరిణులనుట ఎట్లుతగదో అట్లే మనమకూడ ఆంగ్లేయస్త్రీలపై నిందారోపణ మొనర్చుట ఉచితము కాదు.

ఆం-వ—దేవరవారు సెలవిచ్చినది సత్యము.

శివా—మాయాడవారికి తురకలయందువలె ఘోషా లేదు. మీవారివలె పూర్ణస్వాతంత్ర్యమును లేదు. ఇది మధ్యమార్గము. మీరందరికి పోవచ్చును.

(ఆంగ్లేయులు శివాజీతప్ప అందరుపోవుదురు.)

మీరు వర్తకము చేయుటకే వచ్చినారా, లేక వీలు చిక్కినచో దేశమునుకూడ స్వాధీనపర్చుకొనవలెనను ఊహ కలిగియున్నవారా ?

ఆం-వ—మహారాజుగారి కిట్టి సందేహ మేల పొడ మినది.

శివా—మరేమియు లేదు. వేడిపాలు ప్రమాదమున పెదవులకు తాకి నోరు కాలెనా, చల్లనిమజ్జిగయు నూదుకొని త్రాగజూతురు. తురకలు ధర్మస్థాపనము చేయు మిషచే ప్రవేశించి కాలక్రమమున మాదేశముల జయించినారు. ఆ మిష యిప్పుడు పాతగిల్లినది, వర్తకము క్రొత్తపుంత.

ఆం-వ—ఒకానొకప్పుడు విజయము ఓడిపోయినవారి మూలముననే సిద్ధించుచుండును.

శివా—అది నిజమే. ఏదీ, మీ సరుకు చూపుడు.

ఆం-వ—ఈ సరుకు హిందూస్థానము లోనిదే.

శివా—మా దేశపుసరుకు మా వర్తకులయొద్దనే కొందుము. సరుకు వ్యర్థముగా మీకు లాభము రానీయనేల? మీ దేశపు సరుకున్న చూపుడు. (వారు గుండుసూదులూ, సబ్బుబిళ్లలూ, మేకులు మొదలగునవి చూపుదురు.) ఇట్టి వస్తువులను మావారుకూడ తయారు చేయుదురు. ఇవి వాటికన్న పూతమెరుగున మిన్నలే, కాని మావస్తువులవలె మనజాలవు. నూతనవస్తువున్న చూపుడు. ఆగొట్టమేమి?

ఆం-వ—ఇది దూరదర్శనీ యంత్రము. దీనితో చూడ దూరపువస్తువులు దగ్గఱనున్నట్లగపడును.

శివా—ఇది వింతవస్తువే. (చూచి) బాపురే! పూనా చుట్టుప్రక్కలనున్న గుట్ట లోకదాని నొకటి ఒరయు నట్లున్నవి. ద్రోణాద్రిని హనుమంతు డొకచోటునుండి వేఱొక చోటునకు మార్చినరీతి ఈయంత్రము గుట్టల స్థలాంతరమును చేర్చుచున్నది. ఇం దొకలోప మున్నది. ఈసామర్థ్య మొక కంటికే అలవడును కాని రెండింటికి చేకూరదు. దూరమున నున్న వస్తువులను స్పష్టముగా కనబడుచు ఈయంత్రమువలె భవిష్యత్తునందలి ఘటనాసంచయమును వర్తమానమున జరుగునట్లు అగపరచెడి యంత్రమును మీవారు కనిపెట్టిరా?

అం-వ—అట్టి యంత్రమును మేమెఱుగము గాని యంత్రిసాహాయ్యము లేకయే కాఁగలదానిని తెలుపఁగలవారు కలరు.

శివా—కొలఁదికాలమున జరుగఁగల సంగతులను అనుమానముచేతనే చెప్పవచ్చును, కాని సుదూరభవిష్యత్తు నట్లు చెప్పఁగలరని నాకు తోఁచదు.

అం-వ—మీభావిని గూర్చి నే నొకవిషయము చెప్పెద వింటిరా?

శివా—ఏమిటది?

అం-వ—మీరు త్వరలోనే ఉన్నతపదవి నొందఁగలరు. ఈదేశమునకు ప్రభువులు కాఁగలరు.

శివా—ఈయంశము మీ రెట్లు చెప్పఁగల్గితిరి.

అం-వ—మీప్రవర్తనను బట్టి నే నూహించితిని.

శివా—నే నొంటిగా అంతపదవిని బొందుటెట్లు?

అం-వ—మీ రెంత ప్రజ్ఞావంతులో మీసేవకులుకూడ అంత ప్రజ్ఞావంతులు కాఁగలరు.

శివా—సమాజశూరులు, విశ్వాసులు, నగు సైనికులూ సమకూడుట నాయదృష్టమే కాని నాకు సహాయబలిమి లేకపోవుట గొప్పలోపము. మీరు నాపరివారమున చేరుదురా? అచిరకాలమున నేను జింజీరాకోటపై దండెత్తనున్నాను, అప్పుడు మీరక్కఱకువత్తురు.

అం॥వ—తమ రన్యదేశీయుల చేర్చుకొందురా?

శివా—నాకు నమ్మకముతో కొలువొనర్చినచో నా కభ్యంతరము లేదు. బిజాపూరుసుల్తాను కొలువుచేసి విసుగుజెందిన పఠానుసైనికుల నా కొలువున నిల్పితిని.

ఆం॥వ—అట్లయిన నొకషరతుపై మీకొల్వున కొప్పుకొందుము.

శివా—అదెద్ది?

ఆం॥వ—ఆంగ్లేయులతో తప్ప ఇతరులతో మేము పోరుదుము. ఆంగ్లేయులతో మీకు పోరుపొసగినా మేము వారితో చేరక తప్పదు. ఇట్లంటినని మీరు కలుగకుడు.

శివా—మీరు దేశభక్తులగుట గని నాకేల కోపము రావలయును? నిష్కళంకమైన మీ దేశభక్తికి నేను కడు సంతసించితిని. పాదుషావారిని రోగవిముక్తులజేసి అందుకు మారుగ మీ దేశముకొరకు వర్తకపు సన్నదడిగిన వైద్యుడు మీవాడే కదా!

ఆం॥వ—అందు విశేష మేమున్నది? ప్రతిఆంగ్లేయుడును స్వలాభముకన్న స్వదేశలాభమునే ఎక్కుడుగా నెంచును. పాదుషా వారివలెనే మీరుకూడ అట్టి సనదు దయచేయవలయునని ప్రార్థించుచున్నాను.

శివా—మీ దేశభక్తిని మెచ్చుకొంటిని కావున మీ కట్టిసనదు నీయజాలను. మీ దేశభక్తికిని మా దేశహితమునకునూ పరస్పరవిరోధము కలదు. మీ త్రాసొక దేశమున కుదురుకొనెనా, దానివెంట మీ ఖడ్గము కూడ జొరబడును.

వర్తకమును మిషచే మీరు నిరాటంకముగా మాదేశమున సంచరించుచు ప్రతిదానిలోను తలదూర్చి మాదేశశాంతి కెసరుపెట్టుదురు. ఈదేశపాకాశమున మీతులారాశి ఉదయిం చినవెంటనే మీవృశ్చికరాశి ఉదయించి తీరును. మీరు నా భావిదశనుగూర్చి చెప్పినట్లే నేనుకూడ మీభవిష్యత్తునించుక చెప్పెద. మావారు మీవిషయమున అప్రమత్తులై వ్యవహ రించిరా, రెండు మూడు శతాబ్దములలో మాదేశమునంతయు మీరు నశపరచుకొందురు. మీ కుంపలి గౌరవముచేతనే మిమ్ము నాచెంత జేరనిచ్చుటలేదు.......రండు నేను మీరు మాకతిథులు: మిమ్ము యథావిధి సత్కరించుట మావిధి...

(పోవుదురు)

—ఆరవ రంగము —

శివాజీ రాణులు—శంభూజీ మోహిలే.

శంభూ—నికట సహవాసములేక దృఢపరిచయము కాజాలదు. శివబా విషయముననే లేనిపోని అసత్యములు, నిందలూ వినివిని నామనస్సు కలుషితమై యుండెను. ప్రత్య క్షముగా నేను పరికించు సరికి అంతయు వ్యతిరేకముగా కాన బడుచున్నది-ఏమి యౌదార్యము! ఏమి నిష్కలంకప్రవర్త నము!

సఈ—వారి రుచులెంత మనోజ్ఞములు! సన్నని చుల

కని వస్తువులు వారికిగిట్టవు, ముతకబట్టలు బరువైనవి వారికి ప్రీతిదాయకములు.

సోయ—ఎగతాళి చేయుటలో మహారాజుగా రతి నిపుణులు.

శంభూ—సుకుమారవస్తువులన్నియు వాని కప్రియములని మీరెంచకుడు. ఆతడు మర్మజ్ఞుడు గుణజ్ఞుడు.

సఈ—గుణజ్ఞులైనను స్వదేశవస్తువులందు వారి కనురాగము మెండు. ఆంగ్లేయులు వారిదేశములోని వింతవస్తువులెన్ని చూపినను ఒకదానినైన అంటినారా?

శంభూ—ఈ విభజన అచేతనవస్తువుల యెడనే-సచేతనముల గాంచిన ఆతనిచిత్తము చలింపకుండునా?

సఈ—అది నిజమే-మొన్న పఠానులను నేడాంగ్లేయులను తమసైన్యమున జేర్చుకొనిరి.

శంభూ—అన్యజాతీయ పురుషులయెడ ఆదర ముండవచ్చును. స్త్రీలయెడ వారికిగల ఆదరముతీరు వేఱు.

సోయ—భర్తగారియెడ ఈవిషయమున ఎట్టిఅనుమానము నుండరాదు. చాంద్‌బీబీయెడ ఎంతయో గౌరవముండకుండిన ఆమెచీరెను నన్ను ధరింపుమని పట్టుబట్టుదురా?

శంభూ—అందు వింతేమి? అపరిచితమైన వస్తువును గురించి మానవుల కొకవిధమగు జిజ్ఞాస, ఔత్సుక్యము నుండుట సహజమే. అందును యవనస్త్రీలు ఘోషాలో నుందురు. వారినిగూర్చి అధికజిజ్ఞాస పొడమినచో వింతయేమి?

సఖ—ఆంగ్లేయవనితలకు ఘోషా యుండదు కదా! వారు పురుషులతోఁగూడి ఆటలాడుదు రనువిషయమున మహారాజుగారు వారిపక్షము బూనినది చూడ నాకు వింతపొడమినది.

శంభూ—పోసిందు మగవారిచర్యల నింత సూక్ష్మముగా నాడవారు పరీక్షింపగూడదు. పురుషు లొకానొకప్పు డత్యంత సాహసకృత్యము లొనర్తురు. వారెంత ఉత్సాహపరవశు లైనను పనిచేయునప్పుడు వారి కలసట జనింపక మానదు. అట్టివేళల వారి మానసముల రంజింపజేయుట కొకప్రియురాలి సాన్నిధ్య మావశ్యక మగును.

పోయు—సేవజేయుటకు ఇగువురు భార్యలు చాలరా?

శంభూ—భార్యల వడినివేసుకొని పురుషు లన్నిచోటులకును పోవుదురా? శివబామాతోడ కళ్యాణదుర్గమునకు వచ్చె ననుకొనుడు. అప్పుడు మీరు వారివెంట రారుకదా? అప్పుడు జిజ్ఞాసచే-కేవల కౌతూహలమే-సుబేదారు రాణివాసము చూడవలెనని అతనికి బుద్ధిపొడము ననుకొనుడు. ఇది వట్టియూహాయే సుడీ—శివబాశీలము చాల నిర్మలము. లోకులు వలుగాకులై వానిగూర్చి ఏమోమో వెర్రిఅపవాదలు కల్పించుచుందురు.

సఖ—అవెట్టివి?

శంభూ—కుత్సితులు అపదూరుల కల్పింపబూనినచో వారినో ల్లెవరు మూయగలరు? అపవాదలకు తలా తోకా

ఉండునా ? నిశీథమున శత్రువులపై బడుట మిష చేసుకొని దురాచారముల నెన్నియో యొనర్చునట! ఈమాటయందు పస యుండునా ?

సఈ—ఇది శుద్ధాబద్ధము. శత్రువులపై అమాంతము పడునప్పుడు వెంటనే వారు శిబిరమునకు వచ్చి సైనికుల బ పుదురు, ఇది నాకన్నులతో చూచితిని

శంభూ—అవునా ? ఆతడు శత్రువులపై బడుటకే గనో, ఇంకే పనిమీద పోవునో ఎవ రెరుగుదురు అని లోకులు కూయుదురు. లోకులమాటలనే నేను అప్పచెప్పుచున్నాను సుడీ-శివబా సచ్ఛీలుడనియే నానమ్మకము.

సఈ—వెంటనున్న సైనికుల కన్నులలో మన్నుజల్లి రహస్యముగా వారొంటరిగా వ్యవహరింతురా ? ఇది నేను నమ్మను.

శంభూ—కుటిలుల కుకల్పనలకు అంతముండునా ? చీకటిలో సైనికు లందరూ లూటీలో చిక్కుకొని యుందురు. ఎవ రెచ్చట నేమిచేయుచున్నారో చూచే దిక్కుండదని వా రందురు... శివబా కలియుగశుకుడని నా అభిప్రాయము. నా మాట లోకుల కొకనిదర్శనమా ? ఆవగింజంత అవకాశమును కొండంత దోషముగా వారు కాపింతురు. శివబా స్వైరవిహారమునకు వారు చెప్పు హేతువు మీరు వినలేరు కాబోలు. అది మీకు తెలుపుట కభ్యంతరము లేదు, అందు తథ్యము లేనేలేదు, ఒకవేళ ఉన్ననూ మీరు ప్రాజ్ఞులు కావున దాని

సంతగా పాటిసేయరు.

సోవా—కారణమేమి ?

శంభూ—దాని కాధార మెద్దియైన నున్న అవశ్యము చెప్పెదను. ముందు నాప్రశ్న కుత్తరమిండు. సఈబాయి ! నీవివాహము శహాజీ మహారాజుగారి సమ్మతిపై జరిగినదా ?

సఈ—లేదు, జీజీబాయిగారి సమ్మతి నైనది.

శంభూ—ఆఁఆఁ. సోయరాబాయీ నీవివాహము నేనన్నట్లు జరిగిన దేనా ?

సోయ—ఔను. నాపెళ్ళి కాకమునుపు «మీరూ మేమూ లేనప్పు డైనది ఏటిపెళ్లి ?" అని పాదుషా మామ గారితో నన్నారట. అక్కా కోపగించుకొనకుము.

సఈ—నిజము చెప్పితివి, దానికి కోపమేల ?

శంభూ—ముందుమాటను మీరు విన్నచో ఒండొరు లతో కలహింపక ఉభయులూ ఏకీభవించి శాంతలై కార్య మునకు కడంగుదురు. మొదటివివాహము పాదుషా శహాజీల సమ్మతమున కానందున వారు దాని నంగీకరించలేకనియు, పైపెచ్చు తనసమ్మతితో నొక వివాహమేని కానందున శివబా తనకిష్టమైన మూడవభార్యను చూచుకొనవలచినాడని జనశ్రుతి కలదు. వారు తమ కుయుక్తులకు ఎట్టికారణము గూర్చిరో విశదమైనదా ? నోటికి వచ్చినట్లెల్ల వాగుదురు. వారినోటికి తలుపా ద్వారబంధమా ?

సోయ—వలచివలచి తురకదానిని కట్టుకొనరు కదా'

శంభూ—అది కలలోనిమాటకూడ కాదు. తల్లిగా రొకవివాహము చేసిరి, తండ్రిగా రొకటి చేసిరి. ఇప్పుడు లోకులు మూడవది చేయనున్నారట! శివబా తురకదాని వలచుటేమి? దాని నగ్నిసాక్షిగావివాహము చేసుకొనుటేమి!

సోయ—పెండ్లియాడకున్న వేశ్యగా నుంచుకొమ్మందురు కాబోలు!

శంభూ—దానికి లోటులేదు. ఇప్పుడు కళ్యాణదండయాత్ర కన్యకొఱకే శివబా తలపెట్టినాడని వదంతి-ఎక్కడకు బోయిన నివియే గుసగుసలు. శాత్రవస్త్రీలను సైనికులెవరును హింసచేయకూడదని మహారాజు శాసించినప్పటినుండియు "రాణివాసమును వారే స్వాధీనము చేసుకొందురు కాబోల"ని వాగుచున్నారు. ఇట్టి అపనింద వారు రాజుగారిపై వేసినందుకు వారికి తగినశాస్తి కావలయును.

సోయ—ఆ చచ్చినవారి నాలుక లూడిపడును. వారి అపనిందల నక్కరసేయువా రెవ్వరు? ఎద్దుకేమి తెలుసు నటుకుల రుచి? మామీద మహారాజుగారి కెట్టి యాదర మున్నదో ఈకుంక లేమెరుంగుదురు? వారు మామాట నెప్పుడేని జవదాటుదురా?

సఈ—ప్రాణనాథుకు శోయరాబాఈ రూపము నెంతవలచిరో నే నెరుగుదును.

సోయ—సఈ బాయి సౌజన్యము వారి కెంతసంతోషదాయకమో నేనెరుగుదును.

శంభూ——బలే-సాపత్న్యులయ్యు మీ రింత కలుపుగోరుతనమువహించియుండుట నాకు అనంతమగు సంతసము కూర్చుచున్నది. మీపల్కులే నిజమైనచో ఎట్టిచింతయు అనవసరము. ఆతనియం దట్టినమ్మకమే మీకులేకున్న కళ్యాణదుర్గమును స్వాధీనము చేసుకొనిన తోడనే శివబా అటపోవునప్పుడు ఆతనివెంట బోవుటకు మీరు హఠముచేయకుందురా?

ఇద్దఱు——అమ్మయ్యో! కళ్యాణదుర్గమునకు మహారాజుగా రేగనున్నారా?

శంభూ——బహుశా పోవుదురు. ఈ దండయాత్ర సామాన్యమైనది కాదు. ఇందు జయము నొందినచో విశాలమైన ప్రదేశము మనకు లోబడును. కావున అందుకు వలయు నేర్పాటులు కావించుట, సైనికుల బహూకరించుట మొదలగు పనులు మహారాజుగారు స్వయముగా చేయవలసి యున్నది. అంతకన్న నావశ్యకమగు కార్యము నెరవేర్పవలసి యున్నది. సైనికులు——స్త్రీల నెట్టి బాధలపాలు చేయగూడదను కఠిన శాసనమున్నది, అది సరిగా నిర్వహింపబడినదో లేదో వారు విచారణ సేయవలయు. అం దావశ్యకమయినచో ఏకాంతమున అంతఃపుర స్త్రీల వాఙ్మూలము లను పుచ్చుకొనవలయును.

సఈ——నిజముగా నేనా?

శంభూ——అంతవరకును రావచ్చును. శివబా న్యాయప్రియుడు కదా? అంతఃపురస్త్రీలను స్వయముగా విచారణ సేయకున్న నిజము తెలియదు, అది తెలిసినగాని అతని మన

న్సమాధానము కాజాలదు. అందుకు ఎన్నిరాత్రులు మేలుకొని యుండవలయునో?

సోమ—రాత్రులు మేల్కొననేల?

శంభూ—పగటి విచారణలతో పని తీఱకున్న రేలు కూడ విచారణసేయవలదా? అదియునుగాక రహస్యమునకు రాత్రియే అనువు.

సతీ—అటులైన మేమవశ్యము వారివెంట నుందుము.

శంభూ—మీరు వెంటనుంట వృథ. అందు కాతడు సమ్మతించునో లేదో?

సతీ—ఆ వాఙ్మూలముల మేము వినిన ప్రమాదమేమి?

శంభూ—అవి మీరు వినదగిన వనుకొంటిరా? న్యాయాధికారి భార్య కాని గౌరవనీయయగు ఇతర స్త్రీగాని చెంతనున్నప్పుడు కులీనలగు కాంతలు ఉన్నదున్నట్లు వెలిబుచ్చుదురా? శివబా ప్రవర్తనము నెడ మీ కనుమానముదయించినచో మిమ్ముల నుండనిచ్చుట యోగ్యమగును. అట్లొనర్చుటకు తగినంత కారణముండవలయు. వారికి మీ యెడ నసమానాదర మున్నప్పుడు మీ అనుమానమున కనువు లేదే?

సతీ—ప్రాణనాథునిశీల మతిస్వచ్ఛమని లోకుల కన్నులముందర తార్కాణించి చూపి వారినోళ్ళు మూయవచ్చును.

శంభూ—అట్టి అభిప్రాయమే మీకున్నచో అభ్యం

తరమే యుండదు. శివభాను పరీక్షించుటకవకాశము కల్గినా, దానిని ముందుగా మీకెరింగించి నాశక్తికొలది సాయము చేయుటకు నాకును వీలుపడును.

సోమ—అట్లైన అత్యుత్తమము.

శంభూ—మీరీవిషయమును మహారాజున కించుకేని తెలియనీయకూడదు. మీజాడ కని ఆతడు మెలకువతో మెలంగును. అట్టియెడ నాతని వర్తనము కృత్రిమమగును. అప్పుడు పరీక్షలో నాతడు కడతేరినను అదియొక గొప్పకాదు.

సత్య—నిజమే.

శంభూ—మీరుభయులును నాకొరకై శివభానునకు నచ్చజెప్పి తిరుగ నాకుద్యోగము నిప్పించితిరని నాకు తెలిసినప్పటినుండియు మీ అప్పెట్లుతీర్తునను ఔత్సుక్యముండెను, కాని ఇంతవేగ మట్టిఅవకాశము చిక్కునని కలనైన నేదలపలేదు. చిక్కినదానిని చేవిడుదునా? ఇక నాకు సెలవు ......(పోవుదురు).

శివశీలము

రెండవ అంకము

—• మొదటి రంగము •—

(ముల్లానా అహమ్మదు, మహమ్మదు)

అహ.—కాఫరగు శివాజీ అదిల్‌షామీద నెన్నియో అపరాధములు సల్పినను అతని తండ్రియగు శాహాజీ మోమోటముచే సుల్తానువారు వాని మన్నించుచున్నారు, కావున అంతకంతకూ వానికి పొగ రెక్కువగుచున్నది. మొన్న మనము బిజాపూరునకు గొనిపోవుచున్న ధనమును దోచుకొనుటయే కాక మనపైకి దండెత్తి సన్నాహములు చేయుచున్నాడని వినవచ్చెడిని. మన కవమానమొనర్చుటయన్న సుల్తానువారి కొనర్చుటే అని యెరుగడు. ఒక్కమారా సింహాము కన్ను లెఱ్ఱచేసిన ఈ కొండయెలుక నామావశేషము కాదా ?... కుమారా, మనసైన్యము సిద్ధముగానున్నదా ?

మహ.—జనకా, నే నిప్పుడే చూచి వచ్చితిని. మొన్నటి లూటీచేత ఇంచుక నిరుత్సాహము కలిగినను మొత్త-

మునుమున ఏర్పాటులు సరిగా నున్నవి-క్రొత్త ఉమేదువారులు అనుదినమూ చేరుచునే యున్నారు, అచ్చటచ్చట కాపుగడల నుంచి, ముఖ్యమైన మార్గములయందు ఫిరంగుల సజ్జిత మొనర్చి, నలుదిక్కుల వేగులబెట్టి, మరాటసైనికుల పోకడల గుర్తించి మనవారు వర్తించునట్టుల జతనపరచి వచ్చితిని.

అహ.—నీవు జాగరూకుడవై యుంటివి కాని, మరాటాల పోరితము తీఱు వేఱు. వారు కొండమ లేడులవలె పరుగెత్తుదురు; భీమానదిలో మొగము కడిగి, గోదావరిలో స్నానమాడి తాపీనదియొడ్డున భుజింతురు. ఎట్టి దుర్గమపర్వతముల నైన రెప్పవేయునంతలో నెక్కుదురు. కొండల లోని రహస్యమార్గము లన్నియు వారికి సుపరిచితములు. అదలించుటలో వా రద్వితీయులు-ఇట్టి సాహసులు, యుక్తిశాలురైన శత్రువులతోడి పోరు నా వార్ధకమున ఘటిల్లెకదా అని చింతించుచున్నాను. ఐనను మనశౌర్యమూ, ధైర్యమూ మొక్కవోకుండునట్లు కార్యముల నిర్వహింతుమని నాకు విశ్వాసము కలదు. నీవు సహజశాంతిపరుడవు, అమాయికుడవు- ఈజత్తుల మారులతోడి యుద్ధమున నెగ్గగలవో లేవో అను శంక నన్ను బాధించుచున్నది.

మహ.—నేను నిసర్గశాంతస్వభావుడనగుట కలహమున కన్న కలయికయందు నాకు ప్రీతి ఎక్కువ—కాని వీరపుత్రుడ గాన యుద్ధప్రసంగమువచ్చినపుడు వెనుదీయువాడను కాను.

అహ.—నాయనా, సంధి యన్నమాట తలపునకు

రానీయకు-మరాఠాలకు పేరాస మెండగుటచే ఈప్రాంతమంతయు నొక్కసారి గుటకవేయవలయునని వారి యుద్దేశము. కలుపుగోరుతనమును వారు కలనైన నెఱుంగరు. ఒకసారి సంధి కొడంబడినను అచిరకాలమున దాని నతిక్రమింతురు-వారిని బోలు విశ్వాసఘాతకులు, పోకిరులు నిక లేరు-వారితో సంధి పొసగనీయక సమరమునసే సర్వమును చక్కజేయ వలయును.

(సేవకుడు వచ్చును)

సేవ—మహాప్రభూ! హసీనా బీబీగారి ఘట్టింటినుండి ఒకబంటు జాబుతీసుకొని వచ్చినాడు-ఏమి సెలవు?

అహ—వాని నిటకంపుము. (గుల్ జార్ ఖా ప్రవేశించి వంగి సలాముచేసి అహమ్మదుచేతి కుత్తరమీయుగా నాతడు దానిని చదివి) మావియ్యంకుల ఆశ్రితులా మీరు! లూటీవర్తమాన మెఱిగి వారు మిమ్ముల సహాయమంపినారు కావున మీరు సైనికశిక్ష చక్కగా అబ్బియుండవలయును.

గుల్—దేవరా, నే నది చెప్పుకో దగునా? కొలది కాలమున మీ కది గోచరించును. నేనింతవట్టుకు మనవి చేసుకొనగలను. మల్లయుద్ధము, గరిడీ, కట్టితిప్పుట, ధనుర్విద్య గుఱి మొదలగువాటియం దారితేరితిని.

అహ—సంతోషము. మీవయసు కొంచెము ముదిరి నట్లున్నది. విద్యాభ్యాసము నించుక ఆలస్యముగా చేసినట్లు తోచెడిని.

గుల్—అందు కొకకారణము కలదు. కొంతకాలము కులవృత్తిలో నుంటిని.

అహ—అదేది ?

గుల్—అదియు శస్త్రములకు సంబంధించినదే. అందును మెడపై కత్తివేయవలయు. ఉన్నతస్థలమున నున్నవానిని సరికి నేల బడవేయవలసి వచ్చును. అప్పుడప్పుడు శరీరముల మర్దించి నరముల మెత్తజేయవలయును. ఆవృత్తికిని సైనికవృత్తికిని కొంతభేద మున్నది. దానిలో రక్తము కంటికగపడిన చాతుర్య మనిపించదు, ఇందగపడినా చాతుర్య మనిపించును.

అహ—ఓహో ! క్షౌరమా ?

గుల్—నాకది ఉపరికి సాధ్యమే కాలేదు. నేను చిమ్మజేసిన రక్తబిందువుల జూచి, సేనలో ప్రవేశించిన నేర్పరియగు బంటునౌకని కొందరు సూచనసేయ నావాడనక వారును మావారును ఏకగ్రీవముగ దాని నామోదించిరి. మఱునాడే సమరవిద్యాశాలలో చేరి మొదటినుండియూ వాడిగల పనిముట్లను మచ్చికచేసిన వాడనగుటచే అచిరకాలమున ప్రావీణ్యము నార్జించితిని.

అహ—వయఃప్రారంభవత్సరములు వృథా అయినట్లే.

గుల్—లేదు, దేవా ! అట్లుకాదు. ఆవృత్తిలోని మనుష్యుల కాలోచన ములవడును ; చేయి యొకరితలమీద

తిరుగుచుండ బుద్రలో బుద్ధి పెరుగుచుండును. అందుచనే నూతులస్థు లుపాయశాలురని పేరువడసిరి. బహుభాషణము మాకు ముఖ్యలక్షణము- నాకు ఖడ్గచాతుర్యమూ వాక్చాతుర్యమూ, అలవడినవి.

అహ—ఆలయములో ఆలోచనవలన ప్రయోజన మేమి?

గుల్—ఏమి? యుద్ధము సేయునప్పుడు సాధారణముగా సైనికులు ముందువెనుకల నాలోచింపరు. అవిచారమే భూషణమని వారి యూహ; అందుచేతనే పరాజితు లగుదురు- నేనుమాత్రము తేపతేపకు నాలోచించియే అడుగిడుటకు సిద్ధారణ చేసుకొంటిని, కావున నాకు జయము చేకూరుచుండును. యోధుని సాహసము యోగి తత్త్వజ్ఞానము నాలో సమరియున్నవి.

అహ—ఈ శక్తిద్వయమును బీజాపూరునసే సార్థకము చేసుకొనక ఇటకు వచ్చుటకు హేతువేమి?

గుల్—శివాజీ యను పేరుగల వాడొకడు బాహుబలమున నొకసుల్తానై విజృంభించుచున్నాడట- ఆతనితోడి ఆలమున కొంత పేరు వడయవలెనని యెంచి యిట వచ్చితిని. బిజాపురమున నాపురోవృద్ధి కనుకూలపరిస్థితు లంతగా లేవు. శివాజీ వారిపై కత్తినెత్తుటకు ముందు వాని గర్వమును ఖర్వముచేసి, ఆతనియల్లకల్లోల నంత మొందించవలెనని నాయూహ. శివాజీవలెనే నాభాగ్యచక్రమును బాహుబలము నాధారము చేసి యుంచితిని.

అహ — మానవశాల పరాక్రమము మీకు పరిచితమా?

గుల్ — ఇటనే వచ్చుచుండ వారిని స్వయముగా గాంచితిని. వారి శరీరములు కృశించియున్నవి. నా మెడలో నాల్గవపాలైన వారిమెడ యుండదు. ఇక వక్షము మణికట్టుల మాట చెప్పనక్కఱయే లేదు. మానవశాలను మణికట్లబలము చేతనే జయింపనెంచితి.

అహ — వారు యుద్ధముల నారితేఱినవారు, నీకు యుద్ధానుభవమే లేదాయె.

గుల్ — క్షమింపవలయు. వారు వయసున చిన్నవారు, అట్టివా రారితేఱిరనిన నేను నమ్మను. వారిలో నెవ్వరికీ మీసమే లేదు, గడ్డము లేదు, నావంటివాని వాలు గడ్డమును చూచి భయభ్రాంతులగుదురని నా నమ్మకము-

అహ — మీకు మా హసీనా బీబీతో పరిచయమున్నదా?

గుల్ — శైశవమున నామె నాడించితిని-ఆమె నన్ను మఱచియుండు నీపాటి, నేను మాత్రము మఱువలేదు.

అహ — సరే-నాయనా ముహమ్మద్, ప్రకృతమున నీతని బీబీమహాలును కాచుటయం దుపయోగింతము. ఇక నేను విశ్రమింప నేగెదను, నీవును నేగవచ్చును.

ముహ — నే నొకసారి యూరంతయు చూచివచ్చెద. మీరు స్వస్థచిత్తులై యుండుడు. (గుల్ జారుతో) మీవెంట నొకమనుష్యు నిచ్చెదను, వాడు మిమ్ముల బీబీగారి మహాలు

చేస్తాను. అచటివారు మిమ్ము లోనికి గొంపోయెదరు. నేను వచ్చువరకు మీరు బీబీగారిని చూడవలదు. ఎవ డక్కడ (ఒక సేవకుడు రాగా వానిచెవిలో ఏమో చెప్పును. అతడు గుల్జారును తీసుకొని పోవును) నేను హసీనాతో నాటలాడుటకు వీలులేదు. ఒకప్రక్క రణసన్నాహము, ఇంకొకప్రక్క రహస్సల్లాపములా? ఒకవంక వీరరసమూ, రెండవవంక శృంగారమూ, ఒకదెస కంఠమున కుఠారారోపణము, ఇంకొకదెస కంఠమున హారారోపణము, ఒకచక్కి శరశయ్య, నింకొకచక్కి పుష్పశయ్య! ఆహా ఈ సంసారము ద్వంద్వమిశ్రితము. సుఖదుఃఖములు, ఒకదాని నొకటి అంటి యుండును. వాటి ననుభవించుటకు మానవు డెప్పుడును సిద్ధముగా నుండవలయు. ఇందలి పరిణతి పరమాత్మ చేతిలో నున్నది—

—• రెండవ రంగము •—

గుల్జార్—అమీనా

గుల్—అమీనా, నా మణికట్లు బలముచేతనే దక్షిణాపథమున నొక రాజ్యమును స్థాపించుకొనవలయునని నా యుద్దేశము. శివాజీత్రు శ్వడగించి పూనాలో రాజధాని నేర్పరచుకొని అతని మేడనే నా రాజభవనముగా నుపయోగించుకొనెద. మావళాల మట్టిలో గలిపి మావారి నటజేస్తాను. శివాజీ నాచరణములపై వ్రాలి ప్రాణభిక్ష యాచించునేని

అతనికి జీవదాన మొసగి నా ముఖ్యపరిచారకునిగా నొనర్చె దను. రణరంగమున నేను క్రూరుడనై నను సహజముగా నుదారుడను.

అమీ—శివాజీ చపలుడని మీరే సచించితిరి కదా అట్టివాడు మీకు పరిచారకుడుగా నుండగూడునా?

గుల్—అతనిని తగినపనిలోనే నియమింతును. ముం దు రాజోవు ఉన్నతపదవికి తగినట్లు హాలక్కా నొకదానిని జాగ్రత్త చేసినాను. దాని నాళము నూరుమూరల పొడవు, మేడమీద చివరఅంతస్థుననున్న నా నోటిలో దానికొన యుండ క్రిందియంతస్థున నున్న నాభార్యలు వంతులచొప్పున నిప్పు నించుచుందురు.

అమీ—భార్య లెంతమంది యుందురో?

గుల్—ఆలెక్క నియమించుట నీ పని.

అమీ—అదేమి?

గుల్—బాగుబాగు-ఈ విషయము నాపట్టపురాణి గాక ఇతరు లెవ్వరు నెరవేర్పగలరు? నా చిన్ననాటిసఖి గాక ఇతరులెవరు నాకు పట్టపురాణి కాగలరు.?

అమీ—మీరు నాకాగొప్పపదవి నందచేయుదురన్న సంతసమే కాని ఇందు నాసలహా మీరు పుచ్చుకో నక్కర లేదా!

గుల్—ఏమి-ఇది నీ కిష్టము లేదా?

అమీ—సవతులు లెక్కలేకయుండ వత్సరమున

శోకపారిత్యైన భర్తృసందర్శనము లేని పట్టమహిషిపదవి పడతులకు ప్రశంసనీయము కాదు.

గుల్—నీ వెంత వెఱ్ఱిదానవు! పట్టపురాణితో ప్రతి దినమును పరామర్శించక రాజకార్యముల నిర్వహించు టెట్టులు?

అమీ—రాగలపదవి యెట్టిదో కాని ప్రకృతమున చీపురుకట్ట అలుకుగుడ్డ పట్టుకొనుటచే చేతులు చిల్లులుపడు చున్నవి.

గుల్—నాకు ప్రభుత్వ మబ్బినా, అలుకుగుడ్డచే నీ చేతి కలకువ రానిత్తునా? నీమాట కులక రానిత్తునా? అది కురాన్ సూత్రమువలె అనల్లంఘ్యమని శాసింతును.

అమీ—అటులైన నా కేచింతయు లేదు.

గుల్—మన మారగించుటకు వివిధపక్వాన్నముల జాబితా తయారుచేయవలయును. ఎన్నిరకముల మద్యము లెచ్చటెచ్చటనుండి తెప్పించవలయునో, దాని కెంతద్రవ్యము కావలయునో ఇప్పుడే నిర్ణయించుకొందము—ఈ వెన్క గందర గోళ మగును. ప్రతిఅంశమును ముందే ఆలోచించుకొని యుండుట మంచిది. అట్లు చేయక నే నేకార్యమునకును కడంగను.

అమీ—మీవంటి దూరదృష్టి, గాఢాలోచన గల వారిని నేను చూడలేదు.

గుల్—దీనికే నీవు నివ్వెఱపడుచుంటివి. నా కోర్కె

సమాచారము వినిన ఏమనుకుందువో? నేను చచ్చుటే కోడవు, నాగోరీ ఎట్లు నిర్మించుమనది, ఎంత విలువ యుంచుమనది తాపీపనివారి నెటనుండి రప్పించుమనది, రాళ్ళుచెక్కువా రెట్టివారో మొదలగు ప్రతివిషయమూ సక్రమముగా నిశ్చయించి యుంచితిని. ఎందుకొఱకూ వెతకకొన నక్కఱలేదు. సర్వము శోధించి సిద్ధాంతపరచి యుంచితిని.

అమీ—దూరపుసంగతుల గూర్చి ఏర్పఱచుటలో మీదూరదృష్టి గొప్పదే, గాని మీగాలిమేడకు గట్టిపునాది కలదో లేదో ఊహించితిరా? మరాఠాలను జయించుటయే కదా మీకల్పనములకు మూలాధారము?

గుల్—అ దెంత సేపు. మహారాష్ట్రుల జయించుట నా కొక లెక్కయా? వారు నాకంట పడిన చాలు. ఇంతకూ దేవు డిచ్చిన ఆయువు అంతమైనగాని వారు నాపైకి రారు; వచ్చినవెంటనే చచ్చుట తప్పదు—ఆవెక్క పూనాలో పూటు కొనుట నిశ్చయము. పిమ్మట భోగరాగాదులు-అన్నియు సరిగా నున్నవి. వారు వచ్చుటయే తడవు. ఇంక కొన్నిదినము లోపికబట్టి ఆ విన్క వారిని నేనే వెదకబోయెదను.

అమీ—ఎచటికో పోనక్కరలేదు. కొలదికాలమున నే కళ్యాణదుర్గముపై వారు దండువిడియ నున్నారని పుకారు కలదు.

గుల్—నే నిచట నున్నానని తెలిసియే వా రీదండయాత్ర తలపెట్టి యుందురు- నన్నోకని జయించినచో నంద

తిసి జయించవచ్చునని వారి యూహ. కత్తికఠారి, పిస్తోలు తాకు బల్లెము మొదలగువాటిని నేను సిద్ధముచేసుకోవలెను. ఏది యెప్పుడు, ఎవరిమీద, ఎట్లు ప్రయోగించవలెనో ముందే నిర్ణయింపవలెను. ఇంకవు రొకసారి నన్ను తలపడిరేని రెండు చేతులతో పోరవలయు- నా యుద్ధచాతుర్యము నీవు వినియుంటివే కాని, కని యుండలేదు. ఈసారి చూడ వచ్చును.

అమీ—చేతినేర్పు కాలినేర్పు రెండును గాంచవచ్చును. నేను బీబీగారి చెంతకు బోవలయు- ఇల్లు వెడలివచ్చి ఎంతయో సేపయ్యె.

గుల్—బీబీగారితో నా విషయమేమియు చెప్పవలదు సుమా. (పోవుదురు)

—• మూడవ రంగము •—

అంతఃపురమున హసీనా-

హసీ—(అద్దము చూచి దిద్దుకొనుచు) ఎంత పాటు పడినను ఈ కుటిలకుంతలము నాకు లొంగకున్నది ఎంత పైకి దువ్వినను తిరుగ క్రిందికే వాలుచున్నది. కుటిలుల గతి యిట్టిదే, తిన్నగా నుండజాలరు. కుంతలమా, నీకుటిల బుద్ధి మానవా? కుత్సితుడగు శివాజీపోలె నా లావణ్యనిధిని దోచుకొన దలచితివా? మావారిసొత్తు నీచేత జిక్కనుకాని

ఈసొత్తు నీకు స్వాధీనమగునది కాదు- (మరల) అం వెన్కకు మరలినది- ఏమిది శిరోజములకు మానవభాష తెలియును. కాబోలు, అవును. అలకలకూ భావకూ పుట్టిల్లు శిరమే. వా రొండొరుల నెరుంగుట వింతకాదు. అదియునుంగాక కుటిలులకు కూడ కొన్ని విషయముల నార్జవ మబ్బుచుండు ను...ఇక నీ కేశపాశముపై మల్లెపూ వమర్చెద. గగనమున చంద్రబింబమువలె నిది రాణించును. ఈజడకు చేసిన శృంగా ర మెవరికొఱకు? దాని యందము నాకన్నుల కగపడ దే? నాచెంపల వెనుకను నాచెవులు గోలునా: ఈయద్దము చూడకున్న నాచెవులు నాకగపడవు. ఇక బాహ్యలీ మాట చెప్పనక్కఱయే లేదు. పురుషుడు చెంతలేనప్పుడు స్త్రీలు సింగారించుకొనగూడ దనుట యుక్తియుక్తముగనే యున్న ది. ఈ యద్దము నపుంసకము కావున దీనికి కొన్ని పురుష లక్షణము లబ్బినవి. స్త్రీలసౌందర్యమును తన నిర్మలాంతరంగ మున ధరించును. ఇది చంచలము- ఒక వస్తువున తనదృష్టిని నిల్పక ప్రతివస్తువును చూచుచుండును. ముఖస్తుతి చేయుట దీని స్వభావము. సముఖమున నున్నవారియందే తనధ్యానమును లగ్నమగునట్లు చేయును, వారు మరలిన తోడనే వారిమాటయే మరచిపోవును. ఇది మగవారికి సహ జమే. నానాథుడు నేడు పెండలకడ వత్తునని నమ్మించి పోయెను. ఇటనుండి వెడలినతోడనే ఈ మాట మఱచెను. అంతఃపుర నిర్బంధము కలవారము కావున మాకు పతిచింత

దక్క వేఱు ప్రసంగమున కవకాశమే లేదు. అందుచే మా కది అత్యంత ప్రీతిదాయక మగును. పురుషులు స్వేచ్ఛా విహారులు, వారికి స్త్రీ రూపములు కానవచ్చును, పాత వంతలో మరచి పోవుదురు. (మహామ్మదు వచ్చును.)

మహా—ప్రేయసీ, ఏ మాలోచించు చుంటివి.

హాసీ—ఒక ప్రణయినీవల్లభ యుగళము లీల గాంచు చుంటిని.

మహా—ఇందు మనము తప్ప వేఱు యుగళ మున్నదా ?

హాసీ—లే కేమి ? మనకన్న శ్రేష్ఠతరమైన యుగళము కలదు.

మహా—శ్రేష్ఠతరమా ?

హాసీ—సందియ మేల ? మనము కండనెత్తురులు గల బొమ్మలము, ఇది జడసృష్టి; ఆయుగళము కేవల రూపాత్మకము-వారి శరీరములకు పరిమాణ తారతమ్యములు లేవు.

హాసి—నా కాయుగళము కాన్పించుట లేదే ? వారీయంతఃపురము నెట్లు చొరగల్గిరి ?

హాసీ—ఆయుగళమునకు క్రోధమాత్సర్యములు లేవు.

మహా—చిత్రముగా నున్నది. నాకిందేదియును కాన్పించుట లేదు. ఏదీ ఆయుగళము నొకసారి జూపుము.

మహా—ఈకిటికీ కెదురుగా నిల్చి చూచితి రేని వారు మీ కెదురగుదురు.

మహా—(ఎదుటనిల్చి) ఓహో-ఆ యుగళము మన యుగళమే.

హాసీ—కాదు కాదు, మీ మెడమీద మచ్చ యున్నది. అతని కది లేదే ?

మహా—అతడు తన మెడను నీవైపునకు త్రిప్పినచో అతని మెడమీది మచ్చ మనకు కనబడును.

హాసీ—మీ రిటకు రాకపూర్వము అతనివీపు నావైపునకే యుండెను. ఆ పురుషుడు నా చిత్తమున ప్రవేశించినాడు.

మహా—పరేకానీ నీకనులు గుంటలుగ పడినవి, నీ మోము వాడియున్నది, హేతు వేమి ?

హాసీ— అదేమో నే నెఱుగను.

మహా—మరాఠాలు మనపై దండెత్తుచున్నారని నీవు వెంగగొంటివా ?

హాసీ—వారి ఘోషయేల ! మీరు త్వరలో వత్తునని బాసచేసితిరి జ్ఞప్తి యున్నదా ?

మహా—లేకేమి ? అనివార్యములగు రాచకార్యము లుండుటచే రాలేకపోయితిని.

హాసీ—అవెవ్వి ?

మహా—మరాఠాలు నేడే వత్తురో రేపు వత్తురో అను నదంతి విని మనదుర్గమున మనభటులు అప్రమత్తులై యుండిరో లేదో చూచి, కొన్ని క్రొత్తయేర్పాటులను చేసి క్రొత్తవారిని కొందఱిని సేనలో చేర్పవలసివచ్చెను.

హాసీ—కొత్తనీరు వచ్చి పాతనీటిని కొనిపోయెను కాబోలు-ఇట నాగతి యెట్లున్న మీకేమి?......అయ్యో! నాకు మతి భ్రమించినట్లు ఎటు చూచినను అదురాత్ముడు శివాజీయే కనబడుచున్నాడు, నాకుంతలముల చూచుకొన్నను వాని కుటిలవృత్తియే జ్ఞప్తికి వచ్చుచున్నది.

మహా—బేలా, నీవు భ్రమచెంద నేల? వాడు మన కొనవ్రేలు కదల్పజాలడు-నీశరీరభాగములతో శివాజీని పోల్చకుము. ఆతని చూచినతోడనే నీవు జ్ఞప్తికి వచ్చుటచే నాతనిపై శస్త్రము వేయ నాచేయాడదు.

హాసీ—అట్లు కానేల? నాశరీరమును చూచినతోడనే శివాజీ జ్ఞప్తికివచ్చి క్షతములతో దానినింప రాదా? కాని వాని వలె నేను వెన్నిచ్చుదానగాను. నాశక్తికొలది నేనూ మాఱు సేయుదును.

మహా—భావిసంకటముల దలచి మనము ప్రేమాలాపము లాడుకొనుచుంటిమి, ఇవి తాత్కాలిక సుఖము నిచ్చుచున్నవి-కాని ప్రత్యక్షముగా సంకటము వాటిల్లునపుడు మాత్రము ఈసల్లాపములు యాదికివచ్చి ఆయవస్థను నిర్భర మొనర్చునేమో?

హాసీ—అప్పటి మాట లిప్పుడేల?

మహా—మాటలు మానినంతనే సంకటములు మానునా? రానున్న విపత్తులగూర్చి చక్కగా నాలోచించి ఏసందర్భమున నెట్లు వర్తింపవలయునో ముందే నిశ్చయించుకొనుట

మంచిది. ప్రేయసీ-మరాటులు విజయమొందిమనల నెడబాపు నెడ నీవెట్లు ప్రవర్తింతువు.

హాసీ—ఏయుక్తిచేతనేని వారికన్నుల దుమ్ముజల్లి మిమ్ము కలుసుకొందును.

మహా—మనసమాగమము అసంభవమైనచో—

హాసీ—అంతగతి పట్టునప్పు డాత్మహత్యయే శరణ్యము. అందు కేయుక్తియు నక్కరలేదు, ప్రయత్నమును చేయ నవసరముండదు.... చూచితిరా ఈకటారి, దీనినెల్లప్పుడును నాయొద్దనే ఉంచుకొనెద.

మహా—అది హరింపబడిన-?

హాసీ—నాథా, ప్రాణములు రక్షించుట కష్టసాధ్యమగునుగాని వాటిని త్యజించుట సులభము. ఉరిబెట్టుకొని ఉసురువిడెద.

మహా—శత్రువు లట్లుచేయనీకున్న?

హాసీ—వారంత క్రూరులా? శత్రుస్త్రీలు చత్తురన్న వారికి సంతసము కల్గునుకదా?

మహా—పురుషులు తాము ప్రాణముల త్యజింతురు. కాని స్త్రీల నట్లొనర్పనీయరు.

హాసీ—ఏల?

మహా—ఇంత చక్కనికాంత వారిచేత జిక్కినపుడు వారు వదలు కొందురా?

హాసీ—నాకన్నులు గుంటపడినవి, మోము వాడి

యున్నది అని మీరే ఇప్పు డంటిరిగా? ఈ మొండికట్టియ వారి కెట్లుపచరించును?

మహా—నీవెప్పుడును అంతఃపురమున నిర్బంధింప బడిన దానవు. ఆగర్భశ్రీమంతురాలవు కావుననే నీకు లోక జ్ఞానము సున్న-అందుచే నత్యంతము బెదరి పోవుదువు. అప్పుడు ముందువెన్కల నరయజాలవు.

హాసీ—మా దృఢమైన ప్రేమయే మాకు దారిచూపును. పతిని గాక అన్యుల పరికింపమి మాకు పతియే దైవము. మగవారితో కలిసిమెలిసి తిరుగుటచే మతిచలించు మరాఠా స్త్రీలము కాము.

మహా—ప్రేమ సర్వవ్యాపి, దానిపై నొక్క-జాతి వారికే హక్కు-కలదని తలపగూడదు- ఇది దాపుదృష్టి-విచ్చ లవిడిగా సంచరించు హిందూ భామలు తమపతులతో సహా గమన మొనర్తురని నీవు విన లేదా?

హాసీ—నిజమే- యావజ్జీవ వియోగాగ్నిచే దహింప బడుటకన్న ఒకసారియే గుక్కెడు ప్రాణమును వదలుట సుకరము.

మహా—యావజ్జీవమూ బ్రహ్మచర్యవ్రతము నల్పు వితంతువులును వారియందే కలరు.

హాసీ—నే నేమి యుత్తరమిచ్చినను మీకు నచ్చుట లేదు-ఇం కొకటి చెప్పెద-శత్రువుల బారిని పడినతోడనే వారిలో నీచులైన వరు నొకని నికా చేసుకొని కులము, శీలము,

మతమును గోత్రత్రోసి పునర్జన్మమున పూర్ణసంతోషము ననుభవింతును. ఇక తృప్తియైనదా?

మహా—ప్రేయసీ నీవు చపలవు కావున నీపనులు చంచలములు-ప్రసంగమున నగపడు చాంచల్యము కార్యఘటితి యందు కానరా నియుకుము.

హాసీ—నాథా, స్త్రీచిత్తము దుర్జ్ఞేయము, మాహృదయములు ఆకాశము సముద్రమువలె గభీరములు స్థిరములు; తలమెంతపరిక్షుభితమైనను దాని అడుగు శాంతస్వరూపమున వెల్గుచుండును. మిన్నున మేఘము లెంత ఘోరపరిణామముల నొందుచున్ననూ నక్షత్రమండలము శాంతిని బాయునా? నా హృదయతలముపై ఫేనమును చూచి మీరు మోసపోయితిరి, దాని యంతరంగ మెంత నిశ్చలమో, ఎంత గభీరమో, గుర్తింప నేరరైతిరి.

మహా—సమయము తటస్థించునప్పుడు సర్వమూ విశదమగును.

హాసీ—అట్టి తరుణమూ రావలదు, తథ్యమూ తేలవలదు.

మహా—సరే—నీకు కోపము వచ్చినట్లున్నది - ప్రియమైన వార్త నొకదానిని తెల్పెదను. నీపుట్టింటివారు నీకొక కానుక నంపిరి- చెప్పుకొను మదెట్టిదో.

హాసీ—నగలో, నాణెములో, దివ్యాంబరములో—

మహా——కాదు-అది సజీవ పదార్థము.

హాసీ——అట్లైన చెలికత్తె కాబోలు.

మహా——కాదు.

హాసీ——అట్లైన దాని లక్షణములు వివరించిచెప్పిన పోల్చుకొన గలనేమో.

మహా——అట్లే కానిమ్ము- కుక్కవలె కాపుండును, కోడిపుంజువలె బడాయి కొట్టును- చిలుకవలె మాటలాడును, చింబోతువలె గడ్డముండును

హాసీ——(ఆలోచించి) తెలిసినది మామంగలి గుల్ జారు కాబోలు.

మహా——చక్కగా గుర్తించితివి. నా డిప్పు డాన్నత్తి మాని యుద్ధభటుడైనాడట!

హాసీ——గుల్‌జారు యోధుడయ్యేనా? జీలుగు చెట్టునకు చేవ కల్గినట్లున్నది. ఏడీ? రప్పించుము, చూతము.

మహా——అమీనా, గుల్జారు నిట రమ్మను. (ఆమెతో కూడ వాడు వచ్చును.)

హాసీ——ఏమి గుల్‌జార్, ఈవేషము నెప్పటినుండి వేయుచుంటివి? వర్మము శిరస్త్రాణము శస్త్రములునూ నీకు భారములై తోపలేదా? నీవంటి పేలుడుగాయా పిరికిపందయు నెచ్చటనైన నుండునా?

గుల్——నేను మీచిన్ననాటి తెరగుః ఇప్పుడు లేను. నా వ్యవహారమంతయు మారినది.

హాసీ—నీ మీసమూ గడ్డమును బట్టి అట్లే యెంచవలయును. రక్తము చిమ్మిన తోడనే గడగడ లాడేవాడవు.

గుల్—ఆలోపము అప్పటివృత్తితోనే తొలగిపోయినది. తలలనుండి నేను చిమ్మించిన రక్తప్రవాహములను చూచిచూచి నాకన్నులు గడుసుపారినవి. ప్రేలుడుతనము కూడ యుద్ధవిషయము లందేకాని వేఱొక చోటలేదు.

హాసీ—యుద్ధభూమిని రక్తపాతము గనుట కవకాశమింకను నీకు తటస్థింపలేదా?

గుల్—లేకేమి-ఒక పర్యాయము మంచి అవకాశమే చిక్కినది. నేను నామార్గమున బోవుచుండ నలువురు యోధులొకముహూర్తమున నాపై బడిరి. అందులో నిద్దరి నొక దెబ్బతో నేల గూల్చితిని. మిగిలినవారిలో నొకడు నాతలపై నొకపట్టి పెట్టుటకు యత్నించెను గాని నేనతిప్రజ్ఞతో ఆ వేటు తప్పించుకొని వాని ప్రక్కలో కత్తితో పొడువగా అది వానికడుపులో చొచ్చి కొన బయటికివచ్చెను. నాల్గనవానికి నాప్రతాపము చవిజూప నెంచితిని గాని ఇంతలో మెలకువ వచ్చెను.

హాసీ—ఈప్రతాప మంతా కలలోని మాటయా? మేల్కొనియుండి నీవు యుద్ధము చేయనే లేదా?

గుల్—అట్టి అవకాశము చిక్కనిదే! నేను బిజాపూరు నుండి వచ్చుచుండగా మార్గమధ్యమున మావళాలొకటిరెండు సారు లెదురైరి, కాని ఆ యడవి మనుష్యులను చూచిన

తోడనే నా గుఱ్ఱము బెదరి వారు కనుచాటగునవరకు ఆగినదే కాదు. అందుచే వారు ప్రాణములతో పోగల్గిరి. అట్లగుట మంచిదే-నాప్రథమయుద్ధము శివాజీతో ప్రారంభించెదను. ఆతడు నాచేతి క్కానా ఒడలిపై స్పృహతప్పునట్లు నెత్తిపై నొక పట్టు పెట్టితీరెద. ఒకవేళ అతడు శరణుజొచ్చినవానిని మన్నించి నాహుకూ,-నొకరుగా నియమింతును-అతడు చిక్కనవిస్కా అందరులోంగక తీరదు. యుద్ధాతుర్య మనుత్సాము నాకు హెచ్చుచున్నది.　　(కత్తిత్రిప్పును.)

హాసీ—ఆఁ ఆఁ. ఆగు మాగుము-శివాజీ అనుకొని మమ్ము కొట్టేవు!

గుల్—ఎంతకాలమని ఓపికపట్టుదును? నాకు విసుగు పుట్టుచున్నది. మరాఠీల రక్తము తాగవలెనని నాకత్తి నో రూరుచున్నది.

(తెరలో “హరహర మహాదేవ” అని కేకలు.)

మహ—అదే మరాఠాలు వచ్చినట్లున్నది. ప్రేయసీ, వారిని పారదోలి త్వరలో వచ్చెద. మనవారందఱు సిద్ధముగా నున్నారు, నీవు కలవరబడకు. జయము మనకు నిశ్చయము-నే నిదే యుద్ధమునకు పోయెదను.

హాసీ—అయ్యో దైవమా, అనుకొన్నంత పనీ జరిగినదే. ఇక నాగతి యేమి?

మహ—నిన్నితడు జాగరూకతతో కాచుచుండును.

గుల్‌జార్-నా కీమెను సురక్షితముగా నప్పగించు పూచీ నీది సుమా.

హాసీ——వీని పరాక్రమమునం నాకు నమ్మకము లేదు.

మహా——ప్రేయసీ-ఇప్పుడే వారిని చెదరగొట్టి నీచెంత జేరెద-అమీనా, నీ యజమానురాలి నొకక్షణమేని విడిచి యుండవలదు సుమా, ఏమరి యుండకుము.

అమీ——ప్రభూ-నీడ వస్తువును బాసి యుండుటెట్లు?

మహా——ప్రేయసీ-వీరిద్దరు నిన్ను కంటిని రెప్పలవలె గాచుచుందురు, కావున నీవు చింతదక్కి యుండుము-ఏదీ ప్రసన్నమగు దృష్టితో నన్నొకసారి చూడుము, పోలికలనుకు పోయెద. (ఆమె చూచును) సంతస మయ్యె, మీరు నిశ్చింతలై యుండుడు. (పోవును అమీనా గుల్‌జారు లంపకము పెట్టబోవుదురు).

హాసీ——ఏడ్పు వచ్చుచుండ దాని నదిమి స్మితవదన నైతిని? అయ్యో! ఆడజన్మ మాద్యంతము అసత్యవిడంబనము. ప్రియునిపై ప్రసన్నత యున్నయెడ అలక బూనుదుము. స్వార్థమును సాధించుపట్టుల అభిమాన ముట్టిపడునట్లు అభినయింతుము. పురుషుల కీబూటకముతో పనిలేదు. వారి మాటచేయియు నొకటే. లేని స్మితము, మేఘములేని వారిధారాపాతమును వారు తెచ్చిపెట్టుకొన నక్కరలేదు. ఆపద తటస్థించినతోడనే దాని తరింప వారుద్యుక్తులగుదురు. మేమో? వారు తిరిగివచ్చునప్పటికి వారియెదుట

నేరనము ప్రదర్శింపవలయునో అస్త్రముచూచి అభ్యసించు చుందుము.

(అమీనా వచ్చును.)

అమీనా—అల్ల కేమైన తగ్గెనా? ఇంతలో నా ప్రాణనాథుడు క్రమ్మర వచ్చునా?

అమీ—అదే ఎవరో వచ్చుచున్నట్లున్నది. చూచి వచ్చెదను (త్వరగావచ్చి) అమ్మా! మీరు లోనికి జనుడు, శత్రువులు వచ్చుచున్నారు, నేను వారిని పంపెదను (హసీనా తెరలోనికి పోవును.)

(ఆబాజీ శంభూజీలు వత్తురు).

శంభూ—ఇది రాణివాసము కాబోలు.

ఆబా—అటులే కానవచ్చుచున్నది.

గుల్—(వెనుకతగ్గి) వీరు మరాఠాలవలె నున్నారు, కాని మాపళాలు కారు. ఇందు శివాజీ ఎవరో? వీరు నాఖడ్గమువాత పడుటకు యోగ్యులా?...వీరివద్ద శస్త్రము లున్నవి కావున కనికారము చూపదగదు! వీరిని నాచెంత చేరనీయక బల్లెముతోనో పిస్తోలుతోనో ఎగరగొట్టుట శ్రేయము. ఏమి నామూర్ఖత! బల్లెమును మరచితిని...(కత్తి నెత్తబోయి) ఏమిది నాచేతులు వడకుచున్నవి! చేతులే కాదు. ఒడలంతయు కంపమొందుచున్నది. సంబరముచేత కాబోలు, మీ రెవరు? ఆగుడు-ఈకత్తితో మిమ్ము ముక్కలుముక్కలు చేసెదను, గురి చూడనిండు, (ఆబాజీ శంభూజీలు ముందుకు

వత్తురు) అరే! వీ రొకచోట నిలువరు. మరి గురిచూచు టెట్టులు? వీ రతిచంచలురు-తక్షణమే వీరిని నరికివైచెదను. దూరముననున్న గురి ఆనును. దగ్గరపడినచో గురి చూచు టెట్లు? ఒకడున్నచో నొకకన్ను మూసి గురిచూడవలయు- ఇద్దరున్నారు కావున రెండుకన్నులూ మూసి చూచిన గురి సరిపోవును. రెండుకనులు మూసినచో నొక్కడైన కనబడరే! ఇప్పు డేమిచేయవలయు? ఇది నాకెవ్వరూ చెప్పలేదు.

ఆబా — వీడెవడో పగటివేషగానివలె నున్నాడు.

శంభూ — తురకల అంతఃపురములలో కొజ్జాలని యుందురు. వీ డట్టి నపుంసకుడేమో!

ఆబా — శస్త్రమును ధరించి సందడి చేయుచున్నాడు. ఓరీ పండా-నీ యజమానురా లెచ్చట నున్నది?

గుల్ — నా పేరు గుల్‌జార్ఖాం. నా యజమానురాలు (గదివైపు చూచి) ఎచటనున్నదో నేనెరుగను.

శంభూ — సరే-నీవు చెప్ప నక్కరలేదు, కాని గోల చేయకు, అట్లు చేసితివా చూడు దీనిని. (పట్టాకత్తి చూపును)

గుల్ — లేదు లేదు-మాటాడితే ఒట్టు.

శంభూ — అట్లుకాదు-నీకు పని కల్పించెదను-నీకాలి వేళ్ళు పట్టుకొని మేము వచ్చుదాక ఇట నిలువుము. మాటాడితివేని (కత్తిచూపుచు-అమీనా వచ్చును.)

ఆబా — ఇదే సుబేదారుకోడలు కాబోలు, లావణ్య సంపన్నురాలే- ఆబాసాహె బమితానంద భరితులగుదురు.

శంభూ — బాగుబాగు - మంచి బుద్ధిశాలులే. ఇది చక్కనిదేకాని జగన్మోహిని కాజాలదు- సుబేదారుగారి కోడలనుటకు దీనిమోమునై కులీనలక్షణ మొకటైన లేదు- ఇది ఆమెదాసి కావచ్చును. ఏమిరా కొజ్జా, నా మాట నిజమేనా? (వాడు తలయూచును) నా మాటయందు మీకు ప్రత్యయము కుదిరినదా?

ఆబా — నిజమే- ఈప్రశంస నాకేమీ తెలియదు.

శంభూ — నీ యజమానురాలు ఎక్కడ నున్నది?

అమీ — మీరు త్రోవతప్పితిరి. ఇది మహాలు కాదు. పరిచారిక లుండు తావు.

ఆబా — శంభూజీ! ఇక నిట మన మాలసింప నేల? వేరొకచోట వెతకుదము.

శంభూ — మీ రెంత అమాయికులు! ఈతొత్తు మాటను విశ్వసింతురా? ఏమే గయ్యాళీ, ఇది మహాలు కాదేమి? ఈశృంగారమంతయు సేవకుల కొఱకా? ఈ పందిరిపట్టెమంచము నీకొరకమర్చినదా? నీగడసుమాటలు నా యెదుట కట్టిపెట్టు- అబాజీ, లోని కేగుదము రండు.

అమీ — అయ్యా, బీబీగా రిచట లేరు- నమ్ముడు నామాట- అల్లా సాక్షి!

శంభూ — పోనీ- ఈ మహాలందము చూచెదము, నీవు కూడ మావెంట వచ్చి నీయజమానురాలిని చూపుము. ఆ తెర తీయుము. (తెరతీయ హసీనా మంచముపై నుండును,

అయినా ఆమె చెంతకేగును.)

హాసీ—మీరెవరు, రాణివాసము జొచ్చుటకు హేతువేమి?

ఆబా—మిమ్ము గాంచుటకే మా రాక. మీరు మా ఖైదీలు.

హాసీ—సరే. నే ననుకొనిన ట్లయినది. మాకు ఘోషాపద్ధతి యున్నదని మీ రెరుగరా? దానిని మన్నింపక మీ రిట్లు అంతఃపురమును చొరవచ్చునా?

ఆబా—అమ్మా - దేశము శాంతిసుఖము ననుభవించునపుడు సంప్రదాయము లన్నియు సాగును, యుద్ధసమయమున వాటి నుల్లఘింపక తీరదు. కాని మీ అభిజాత్యమున కనుగుణముగా అన్ని ఏర్పాటులు చేయబడును. అచిరకాలమున మిమ్మిటనుండి అన్యస్థలమునకు గొంపోదుము, కావున మీ రందుకు సిద్ధముగా నుండవలయును.

హాసీ—నే నిటనుండి కదలను. యుద్ధానంతరమున నన్నిట కలుసుకొందునని నా భర్త బాస జేసి యున్నారు.

ఆబా—గతమును మీ భర్తను మీరు మరువవలయును. యుద్ధము ముగిసి ఈదుర్గము మాకు స్వాధీనమయి చాల సేపైనది.

హాసీ—నన్ను మోసగింప మీ రిది కల్పించియుందురు, కాని నేను మోసపోవుదాననుగాను. నన్ను చేజిక్కించుకొని నానాథుని శరణాగతునిగ చేయవలెనని మీ యూహ.

నే మన్నియెడల నభేద్య మగునట్లు ఏర్పాటులు చేసియుండ యుద్ధ మింతత్వరలో ముగిసియుననుట అసంగతము.

ఆబా—మరాఠీ సైనికుల హుటాహుటి నడకల మీరెరుంగరు; మీసైనికులు హుక్కాలను వీడి శస్త్రములు నందుకొనునంతలో వారినందరిని యమపురికి పంపితిమి.

హాసీ—నానాథు డెచట నున్నాడు?

ఆబా—మీసైనికు లున్నచోటనే—

హాసీ—హా! దైవమా, ఇంత చేసితివా! (మూర్ఛిల్లును)

శంభూ—అయ్యా, మీరు ప్రజ్ఞావంతులే కాని స్త్రీలతో నెట్లు మసలుకోవలెనో మీకు తెలియదు. వీరు పుష్పముల నంటివారు, అట్టివారిపై అగ్నికణములు వేసితిరి. ఆహా! ఏమి సౌందర్యము. ఈమె సుఖమునకై ఎట్టి రమణీయ వస్తుచయము సమర్చియున్నారు! అవన్నియు నీమె లావణ్యమునుజూచి వెలవెల బారున ట్లున్నవి. ఈధూపసామగ్రి యీమెయుచ్ఛ్వాసనిశ్వాసగంధమున మాపరినది. ఈచామరము లీమె శిరోజముల మార్దవమునకు పోడపునకును భ్రమించి నిశ్చేష్టితము లైనవి. ఈ స్ఫటికకాంతికన్న నీమె శరీరకాంతి శుభ్రతరముగా నున్నది. ఈపుష్పహారము లీమె బాహువులకన్న కఠినతరములగుట గవాక్షములగుండా పారిపోవ నుద్యమించుచున్నవి. నవనీతకోమలమగు నీమె తనూలత హంసతూలికాతల్పముకన్న మృదుతరమైన దనవచ్చును.

మండలేశ్వరులమధ్య సార్వభౌమునివలె చుక్కలలో చంద్రుని వలెను ఈ వస్తుచయముమధ్య నీమె సౌందర్యము విలసిల్లుచున్నది.... ఈమె నేకాంతమున శివబా చూచెనా మోహవాగురుల చిక్కకపోడు. పరాక్రమమున్నచోట విషయాసక్తి ఉండితీరును. యుద్ధరంగమున అగ్నిహోత్రులగు వీరులను జయింపనుత్సహించు జిగీషయే విలాసమందిరమున హతాయత్తులగు నారులను వశపరచుకొన నుత్సహించును. శివబా నపుంసకుడు కాకుండెనేని ఈమెను మోహించి తీరును. ఇట్లు అపురూపసుందరియగు రమణిని పొందగోరని వాడు రణరంగమున జయమునొంద నర్హుడుకాడు. ఇట్లు సౌందర్యశ్రీ బాహులతలు కంఠమున దాల్చనెంచని వీరుడు విజయశ్రీహారమును దాల్చుటకు పాత్రుడు కాడు. శివబా విధించిన ఆజ్ఞను సరకు సేయక ఈమెను నాయంతఃపురమును చేర్చియుందును, కాని ప్రకృతమున ఈమెను సాధ్యముగా జేయక సాధనముగా నుపయోగించుటయే శ్రేయము. అట్లొనర్చుటచే నాకు కలుగనున్న లాభమెక్కుడు. రత్నవర్తకుడంగడిలోని రత్నమును ఒరులకుగాన్ప భద్రపరుచురీతి నీమెకెట్టి ఆపాయమును ఘటింపనీయక తగిన తరుణము వచ్చునరకు కాపాడుచుండెదను...ఆబాజీ! అట్లు తెల్లపోయి చూచెదవేల? ఈమె శివబాకు స్పర్శక్షమమగు రత్నమగును గాని మనబోంట్ల కంటరాని అగ్నిశిఖసుమీ!

ఆబా—శంభూజీ! నీవు చేయు ప్రసంగము విని విన్న

బడుచున్నాను. ఇవేటి మాటలు! ఈమె అబాసాహేబునకు దాసి కావున మనకు తల్లివలె పరమపూజ్యురాలు.

శంభూ—నేనన్నదదియే. ఈమెనొక పల్లకినెక్కించి ఏకాంతమగుచోటికి గొంపోవుదము, రేపు శివబా ఈమేడలో దిగును, అప్పుడు మనయాటలు సాగిరావు.

ఆబా—అట్లేచేయుదము కాని ఈప్రక్రియకు ఉత్తరవాదులుమీరే.

శంభూ—అదేమి? మీరు దిగులు పడుచుంటిరా?

ఆబా—ఈమె సాధారణస్త్రీయు ఆబాసాహెబు సామాన్య పురుషుడునైనచో నేను నిర్భీకుడనై యుండును; ఈమె అసామాన్య సౌందర్యవతి, ఆతడలౌకికాంతర్నిగ్రహము కలవాడు; వీరి అన్యోన్యసందర్శన మెట్లుపరిణమించునో భావింపలేక భ్రాంతుడ నగుచున్నాను.

శంభూ—పరిణమించుట కేమున్నది? సౌందర్యవతిని సందర్శించిన సరసునిరీతి శివబా ఈమెవలలో చిక్కును, ఒకసారి నీతిభ్రష్టుడయ్యెనా తనచేతిక్రింది అధికారులు తబ్బిబ్బుగ జూతురు, ప్రకృతమున నాతడున్నతాదర్శాకాశమున నుండుటచే పృథ్వియందలి సామాన్యుల చిత్తవికారము, విపరీతచర్యలును వానికగోచరములైనవి; ఈ యప్సర వాని నవనీతలమునకు దిగలాగును. అప్పుడు జనసామాన్యాచరణ మాతని కవగత మగును, కావున రణరంగమున సమరకేళి యథావిధిగా జయప్రదముగా సల్పిన వీరుల మనోభావముల

నాచరణరూపమున పరిణమింపజేయు వారిని గొంతవరకు నిచ్ఛానువిడిగా విహరింపనిచ్చుట యోగ్యమని వానిమనసునకు తట్టును; ఈసుబేదారుపై మీకున్నకసి మీరు తీర్చుకొన వచ్చును.

ఆబా—అట్టి తరుణము లభింపవలయుననియే కదా ఇట్టి యుపద్రవము గొనితెచ్చికొంటిని! ఇందు కృతకృత్యుడ నైతినా మేలే, లేకున్న మెడ కురి తప్పదు.

శంభూ—లాభము గొప్పదైనచో యోగ్యము కూడ గొప్పది కావలయును. ఇది లేకున్న దానివలన సమకూరు లాభ మంత హర్షదాయకము కానేరదు. ఇక నీమెను స్థలాంతరమును చేర్ప నుద్యమించి రేపు పెండలకడ యోగక్షేమముల నారయ బొంకు- ఇనుము తప్తమై యున్నప్పుడే దానిని సమ్మెటలతో సాగగొట్టి మనముకోరినరీతిని దాని కాకారము నియమింప వచ్చును, అట్లే హతాశాతప్తయగు నీమె మానసమును మీ కనుకూలమగు తీరున మార్చుట కిదే తరుణము. అవకాశ మెంతయో లేదు- రేపు శివబా వచ్చినప్పటినుండియు మీ రాతనిచెంత నుండవలయును.

ఆబా—ఈపని నిర్వహించుటకు మీరు యోగ్యతరులని నా అభిప్రాయము.

శంభూ—ఎంతమాట! మీ రుపక్రమించి చూడుడు, విఫలమనోరథు లైనచో నేను తప్పక సాయపడెదను. ఇప్పటి మట్టుకు నన్ను తెరమరుగుననే నిల్వనిండు. రేపంతయు నాకు

తీరుబడి కావున చతురుపాయముల నామె మనస్సు తిప్పెదను- పోవుదము రండు...(బయటికి వచ్చి) ఏమిరా? నియమితస్థలము వీడి నీవెందును పోలేదు కద?

గుల్—సమయము నాది కాకుండా పోయినది దేవరా!

శంభూ—నీవంటి మృత్రప్రాయునకు నంగియుంచుట ఆవశ్యమా అబ్బియుండవలయు. వర్మశస్త్రముల భారము లేకపోయిన నీ వింత యలసియుండవు, కావున ఇకముందు నీవు వాటిని ధరింపకు. ఇంకను కాలి వేళ్ళను విడువవేల? ఇదిగో నేను చెప్పునది జాగ్రత్తగా వినుము. నీయజమానురాలికొరకు పల్లకి వచ్చును. ఆమె వెంట నీవును ఆతోత్తు కూడ రావలెను. ఇట్లు జరుగకున్న ఈఖడ్గమును జూచితివా! జాగ్రత్త!

గుల్—అమ్మయ్యో! చచ్చితిని! (నేల పడును, ఆబాజీ శంభూజీలు పోవుదురు).

అమీ—అమ్మగారికి స్పృహ వచ్చినట్లున్నది. ఇట నుండి బయటికి పోవుటకు వీలుండునేమో చూచెదను. గుల్ జార్ ఖాం! (పోయి చూచి) వా రీతని చంపిపోలేదు కదా?

గుల్—వారిక్కడ లేరు-నేను గనినది కల కాబోలు.

అమీనా! ఎట్టి కల గంటివే! జాగ్రత్స్వప్నావస్థలయందలి వ్యవహారములకు పరస్పరవిరోధ ముండునందురు, అది నిజమే సుమా. ఇద్దరు మరాఠావీరులు నన్ను హతవీర్యునిచేసి నా చేత నాకాళ్ళు పట్టించినట్లు కలగంటిని.

అమీ.—మీపాదములే కదా! ఇంకొకరివి కావే! ఒకరికి మీకు మొక్క లేదుకదా?

గుల్.—కలలోనైన అంత నైచ్యమున కొడిగట్టుదు ననుకొందువా? నామాటయందు నీకు నమ్మకము లేదా?

అమీ.—నమ్మకము లేకేమి! మీకు కన్నకల నేనూ కన్నాను. ఆ మహాత్మునిపై మొట్టమొదట కొంతఆర్భాటము చూపి పిమ్మట వారు దిగులుగొల్పగా మీరు మెత్తబడిరి. అనంతరము వారియాజ్ఞచే కాలివేళ్ళను పట్టుకొని నిల్చియుండిరి; నోటితో చెప్పలేక సంజ్ఞచేసి అమ్మగారు లోపలనున్నారని చెప్పితిరి. మనస్వప్నము లచ్చముగా ఒకదాని నొకటి పోలియున్నవా?

గుల్.—ఇదంతయు జాగ్రదవస్థయందే జరిగినదనియా నీ అభిప్రాయము? ఈశస్త్రములన్నియూ నాయొద్ద నుండగనే?

అమీ.—శస్త్రములను గోడకు తగుల్చుటయందును మీచేతి కిచ్చుటయందును భేద మావంతయు లేదు. మీ హస్తలాఘవము నిదివరకే ప్రదర్శించితిరి, ఇక పదలాఘవము చూపుతరి వచ్చెను. ఇటనుండి మనము తరలవలయు. ఈ వేషమంతయు వీడి ఒకకత్తి మాత్రము చేతనుంచి బయలుదేరవలయు. అది మీ కుపయోగపడకున్న పరులకైన నుపయోగించును.

గుల్.—అయ్యో! నా కెంత యధఃపతనము వాటిల్లెను!

అమీ—ఒకప్పు డౌన్నత్య మబ్బియుండినకదా నే డధఃపతనము వాటిల్లడము!

గుల్—ఇదంతయు స్వప్నమైనచో ఎంత బాగుగ నుండును.

అమీ—కోరికల కేమి? త్వరగా నాయత్తపడుము. అమ్మగారిని నేను కొనివచ్చెదను.

గుల్—ఇక్కడ జరిగినదంతయు ఆమెతో చెప్పెదవు సుమా!

అమీ—మీ ప్రవర్తనయే దానిని ప్రత్యక్షీకరించును. (పోవును).

గుల్—పాఠశాలలోని శిక్షకూ ప్రపంచమందలి వ్యవహారమునకును ఇంచుకేని సంబంధము లేదు. నేను యుద్ధశాస్త్రమున నిపుణుడనై గురవులచేత నెంతయో శ్లాఘింపబడి, ఏ సైనికపాఠశాలయందునూ శిక్షనొందని మరాఠాలను చూచినతోడనే భ్రమాస్పదితిని. హస్తలాఘవ మంతయూ కాలిప్రేళ్ళను బట్టుకొనుటకువచరించెను. మంగలి కత్తితో తీయగలిగినంత రక్తమైనా, పట్టాకత్తితో తీయలేనైతిని. "హరహర మహాదేవ" అను కేక వినబడినతోడనే అంతస్స్వారశూన్యుడనై మృతప్రాయుడనైతినా?

(అమీనాచేయి పట్టుకొని హసీనా వచ్చును.)

హసీ—అమీనా, అడుగు ముందుపడకున్నది. నానా థుడు రణరంగమున శయనించెనని వినినప్పటినుండియు నా

కీళ్ళన్నియునూ జారినవి.

అమీ—అమ్మా! మరాటులు పెనుజిత్తులమారులు, వారి మాటల విశ్వసించి మీరు దిగులువడకుడు. ఈ నడి రేయిని గాఢాంధకారమున ఈ మూర్ఖులు మన ప్రభువుగారి జాడ కనిపెట్టిరా? అసంభవము. యజమానిగారు సురక్షిత ముగా నున్నారు. వలనుగాని ఏచోటనో దాగియుందురు, అచిరకాలమున మనల చూడవత్తురు, నామాట నిజము.

హాసీ—నీమాటలు నాకు ప్రాణము పోసినవి. నీవు చెప్పినచొప్పున నానాధునితో పునస్సమాగమము కల్గినచో నాకన్న ధన్యురా లుండబోదు. అంత అదృష్టము నాకు కలుగునా? పోనీ, నాకంట బడకున్ననూ ఎందేని సజీవులై యుండిన చాలును.

అమీ—అమ్మా! త్వరగా ముందునడువుము.

హాసీ—గుల్ జార్-ఇందాక నిన్ను పరిహసించినందుకు నేనే చింతిలుచున్నాను. ననిటనుండి సురక్షితముగా తప్పించితివేని శాశ్వత ఋణస్థురాల నగుదును. త్వరగా అడుగు వేయుము.

గుల్—ఎంత చిమ్మచీకటిగా నున్నదో కంటిరా! ముం దడుగు పడు టెట్లు?

అమీ—మగవాడవు, నీవే చీకటికి భయపడుచుంటివా? నడువు.

గుల్—భయమనికాదు-విచ్చుకత్తితో చీకటిలో

నడువ అది ఎవరికైన తగిలినచో నిష్కారణహత్య జరుగును గదా అని సందేహించుచున్నాను.

అమీ—ఈ గబిబి యొనదిమొదలు మీ కితరుల ప్రాణములను గూర్చినచింత ఎక్కు వయినట్లున్నది.

గుల్—ప్రాణము లెంతతీపియో ఇప్పుడు తెలిసినది. ఇదిగో ముందడుగు వేసితిని.

(సట్వాజి ఎదురగును)

సట్వా—ఆగుడు-ఇటనుండి ఎవరునూ బయటికి పోగూడదు.

గుల్—మేము వెళ్లితీరుదుము- మమ్మాటంకపరచు వా రెవరు! (వెనుకకు తగ్గును.)

సట్వా—ఏమి నీపొగరు! చూడు నాదెబ్బగుచి (కత్తెత్తును)

గుల్—(కత్తిపారవైచి) నిరస్త్రునిపై కత్తినెత్తు దువా? ఇదియా మీ మరాఠాల పౌరుషము? భళిరే మగ వాడవే—

సట్వా—ఇడుగో నేనూ కత్తిని పారవైచెద. మల్ల యుద్ధము చేయుదము రమ్ము.

గుల్—ఇందాకటినుండి నానడుము నొప్పిగానున్నది కనిపెట్టి మల్లయుద్ధమునకు పిలిచెదవా? పౌరుషహీనుడా! నాశరీరమే స్వస్థమైనచో నీబింకము చూచియుందును;

సట్వా—పోనీ, మేలైనదలే. ఇదిగో పల్లకి వచ్చినది,

నీతో మాటలాడుటకు నాకు తీరుబడిలేదు. అమ్మగారూ, ఈపల్లకిలో కూర్చుండుడు. మీరుభయులూ పల్లకితో నడు వుడు. నేను మీ వెంట నుండెదను—(పోవుదురు)

—• నాల్గవ రంగము •—

ఆబాజీసోన్ దేవు—సట్వాజీ

ఆబా—కోటలోని ఏర్పాటులన్నియు చక్కబరచి నే చిన్నదానిని కలుసుకొనుటకు వచ్చితిని గాని నాహృదయము తల్లడిల్లుచున్నది. ఆచిన్నది దుఃఖముచే దురపిల్లుచుండును. శంభూజీ చెప్పినట్లు నేనిప్పుడామెతో ప్రసంగింపనెంచుట గోరుచుట్టుపై రోకటిపోటువలె నుండును కదా? తొలుత నామాట నామె అంగీకరింపదు, యూధమే. అట్టియెడ నామెను కఠినోక్తులాడుటకు నాకు నోరెట్లు వచ్చును? దీనురాలైన అబలను పరుషవాక్యము లాడి నొప్పించుట క్షత్రధర్మము కాక మనుష్యధర్మముకూడ కాదు అను ఆబా జీమాట అసత్యముకాదు. సరే-వచ్చితిని కావున ఆవేళకు తోచినట్లామెతో ప్రసంగించి వచ్చెదను. అవకాశ మాసన్నమగునప్పుడు అదియే ధైర్యముగొల్పును. సట్వాజీ, బీబీ గారు రాత్రియంతయు దుఃఖముతోడనే గడిపిరా?

సట్వా—సందడి ఏమియు లేనందున నిద్రపట్టినదియే నాయనా.

ఆబా— ఈమె శరీరము కుసుమముకన్న మృదువైనను హృదయము వజ్రముకన్న కఠోరమని యెంచవలయును. సరే- ఈమె స్థితి నా కనుకూలించునేమో? ఆ షాజహానెట్లున్నాడు?

సట్వా— ఇంతవఱకూ నిద్రించి యిప్పుడే మేల్కొన్నాడు. నిద్రలో "మరాఠాలను కట్టూకొట్టూ" అని ఒకటే పలవరింత!

ఆబా— వాని సుఖస్వప్నమునకు మనము భంగము కల్గింపనేల? తురకలు మాకు పగలు లొంగియున్నచో మేము వారి స్వప్నములలో నెన్నిసారులైన చావసిద్ధముగానున్నాము

సట్వా— ఇదే వచ్చుచున్నాడు.

ఆబా— ఖొజ్జాబహాదూర్ గారూ, కొంచెమైన భంగములేక నిద్రపట్టినదా?

గుల్— మీదయవలన గాఢనిద్ర లభించెను. ప్రభువువారు నన్ను నిశ్శాస్త్రిని చేసి నాభారము తగ్గించితిరి. అందుననే నిద్రపట్టినది.

ఆబా— జాగ్రదవస్థయందు మేము తీయించిన అస్త్రములనన్నిటిని విడాక స్వప్నమున ధరించు మమ్ము గద్దించుచుండెడివారట?

గుల్— కిట్టనివా రెవరో నాపై నీనింద మోపియుండవచ్చును. ఎఱుకలేమిచే అట్లనియుంటినేమో— క్షమింపుడు

అబా—వెరువకు. స్వప్నములో రాజద్రోహమొన ర్చుటకు మీకు సంపూర్ణస్వాతంత్ర్య మున్నది-మీ యజమా నురాలు మేల్కొన్నదా?

గుల్—వా రింతకుముందే లేచి స్నానమాడి సిద్ధ ముగా నున్నారు.

ఆబా—అట్లయిన మేను వచ్చియున్నానుని వారి కెరిగింపుము-తగిన సమయమునకే వచ్చితిని-కార్యము కాయ అగునో లేక పండగునో?

(పోవును)

—•అయిదవ రంగము•—

(హసీనా, అమీనా, గుల్జార్)

హసీ—గుల్జార్, నేను సిద్ధముగా నున్నానని వారికి తెల్పుము. (గుల్॥ పోవును) అమీనా, ఆ మరాఠా సర్దా రింత పెందలకడ ఏయుద్దేశముతో వచ్చియుండును? నాకోర్కె సిద్ధించుట కీశ్వరుగా డాయన నిటకు బంపియుండునా?

అమీ—అమ్మా, తినబోవుచూ రుచి యడుగనేల? వారే వచ్చియున్నారు కదా, అంతయు విదితమగును.(ఆబాజీ వచ్చును)

హసీ—దయచేయుడు సర్దారుగారూ-నేను తమ కొరకు నిరీక్షించుచున్నాను. ఇతరులయెడ ఘోషా అవలం

బింతును, కాని నిన్న మిమ్ము చూచినప్పటినుండీ మిమ్ము విశ్వసింపవచ్చునని నాకు తోచినది.

ఆబా—మీరు నాకు మాతృతుల్యులు; నిరభ్యంతరముగ నన్ను విశ్వసింపుడు; ఎందుకు నేను యోగ్యుడనని మీకే విశదము కాగలదు.

హాసీ—నా ప్రాణనాథు డెట నున్నాడో తెల్పుడు.

ఆబా—వారు స్వస్థులుగ యున్నారు, ఎట నున్నారో మాత్రము చెప్పజాలను.

హాసీ—తల్లిదండ్రుల నెడబాపుట తగునా?

ఆబా—అట్లు చేయ తగునా?

హాసీ—మమ్ము కలుపుట కిట్లు జాగుసేయు నేల?

ఆబా—వారిని మీ రీలోకమున గాంచజాలరు.

హాసీ—పరలోకమున నైనా నుమ్ము మీరు కలుపనెంచినది? సరే, మా అవశిష్టము లేదు. ఒక్కసారియే మమ్మిద్దర జంపి పరలోకమున కంపుడు, మమ్ము కలిపిన చాలును. మమ్మెడబాపుటచే మీకుగల లాభమేమి?

ఆబా—లాభమే లేకున్న దంపతుల నెడబాపుదురా?

హాసీ—ఎట్టి లాభము? కళ్యాణప్రాంతము మీకు చిక్కినది, మందుగుండుకొట్లు, ద్రవ్యాగారములూ, వస్త్రాభరణములు మొదలగునవి మీ వశమైనవి. ఇందలి నిధినిక్షేపములూ రహస్యమార్గములును మీకు తెల్పెదము.

ఆబా—మీ రిప్పుడు చెప్పినవాటితో మాకు ప్రయోజనము లేదు.

హసీ—ఇక మీకు కావలసిన దేమి? ఇక ముందెన్నడేని మావారు పోరగలరని మీకు సంశయము కలదా? అటులెన్నడును తలంపకుడు. వారు శాంతిపరులు, సంతుష్టస్వాంతులు; నా ప్రాణనాథునకు నా మహాలే సర్వప్రపంచము, మా ప్రణయకలహములే వారి యుద్ధములు, మా సంధానములే వారి యభిసంధి-ఇందసత్యమన్నది లేదు. కావలయు నన్న ఇటుపిమ్మట రాచకార్యములలో నెట్టిజోక్యమూ కలుగ జేసుకొనననని వారిచే మీకు పత్ర మిప్పించెదను. మాకు రాజ్య మక్కరలేదు, వైభవముతో పనిలేదు, ద్రవ్యము దాసీజనమును వలదు. మమ్మిద్దర స్వేచ్ఛగా నుండనిచ్చిన చాలును-ఏ యరణ్యముననో కుటీరమును కట్టుకొని కలియో గంజియో తాగుచూ కాలక్షేపము చేయుదుము. అదే మాకు రాజభోగ మనిపించును.

ఆబా—బీబీగారూ, మహమ్మదీయులు హిందువులను జయించునపుడు వారు మీ రిప్పుడు చెప్పినవాటినే అపేక్షించిరా? తిరిగీ రాజకార్యములలో జోక్యము కలుగజేసుకొనమను ఆశ్వాసనము వారికి తృప్తిగొల్పెనా? రాజ్యముల వీడి అడవులకు బోవుదుమని వేడుకొనిన మావారిని మీవారూరక విడిచిరా? లేదు-వారి ఆసురవాసన కట్టి వ్యవహారము పోనగలేదు. ఒకచేత ఖడ్గము వేరొకచేత కురాన్ ధరించి

బలాత్కారముగా మావారి ననేకుల భ్రష్టధర్ముల గావింపగ వారి కన్నులు చల్లనాయెనా, కడుపులు నిండెనా?

హాసీ——సరే-మీరున్నూ మమ్ము బలాత్కరించి హిందూమతమును స్వీకరింపచేయదలచినచో మేమందుకూ సిద్ధపడి యున్నాము-నాభర్త ఉదారస్వభావులు కావున వారి కన్నిమతములందును సమానగౌరవము కలదు. నాకు నా పతియే దైవము, వారి ధర్మమే, నా ధర్మము. మీ వస్త్రాభరణముల ధరించవలెనన్న నాకు ముచ్చట, మీ కుంకుమ బొట్టుయెడ నా కమితాదరము. దానికొరకేని నేను హిందువు నయ్యెదను.

ఆబా——తురకల దుష్కృత్యములు జెబితే ఇంకను ముగియలేదు. మా దేవతావిగ్రహముల పగులగొట్టిరి, దేవాలయముల మట్టిలో కల్పి, ఆయాచోటుల మసీదులను గట్టిరి. మతమును మాపుదుమను మిష పెట్టి మాకళలను ధ్వంసము చేసిరి, మా గ్రంథములను తగులబెట్టిరి. మా ఇళ్ళను పరశురామప్రీతిచేసిరి, మమ్ముల తగనిబాధల పాలు చేసిరి, మా ముఖములయందు వాతలువేసిరి. చెవులకు బూడిద తోపరాలు కట్టి మిరపకాయల పొగ వేసిరి, కాలుచున్న పెనములపై మమ్ము దొర్లించిరి, బ్రతికియుండ మా చర్మములు నొలిపించిరి! మరియు——

హాసీ——ఇక చాలును. అయ్యో! నే విననేరను.

ఆబా——వినుటకు కూడ ఘోరములగు బాధల

మావా రెట్ల నుభవించిరో ఇంచుక యోచింపుడు. దీని కేమి, మరికొన్ని వేడుకల వినుడు. మాకుటుంబములలోని స్త్రీపురుషుల నడిబజారున గానిసలగా నమ్మిరి. నాలుగుగోడలమధ్య ఏ పోరును లేక గౌరవముతో బ్రతుకుచుండు కుటుంబముల చెడగొట్టి పురుషుల యెదుట వారిస్త్రీల బలవంతముగా నవమానించిరి.

హాసీ—మీరు వీటిని వేడుక లందురా ?

ఆబా—అట్టి దౌర్జన్యతత్పరుల కవి వేడుకలు కాకుండునా ?

హాసీ—ఇంచుకేని హృదయము కలవారును మానుష స్వభావులు నైనవా రిట్టి ఆగడముల మెచ్చుకొనరు. ఇట్టి చర్యల నేనుతెమును ప్రశంసింపను.

ఆబా—నే నీఅకార్యముల నింత వివరముగా వర్ణించుటకు తగినంత కారణమున్నది. ఇట్టి దుర్ఘటముల పాల నా గ్రామస్థులు, నా మిత్రులు, బంధువులు, నా పూర్వపురుషులును పడిరి. ఆబాధలన్నియును నామనమున ములుకులవలె నాటిపగదీర్చుకొమ్మని నన్నెడతెగక ప్రేరేపించుచున్నవి. అట్టిచో నా కీసమయమున చిత్తశాంతి అలవడు టెట్లు ?

హాసీ—అయ్యో ! ఈకథ వినినతోడనే నా మాంసమంతయు నీరై నా కన్నులగుండా ప్రవహింప నున్నది. చెప్పునపుడు మీరును నా వినునప్పుడు నేనును సమాన దుఃఖుల మగుట ఒకరి నొక రోదార్చుకొందము.

ఆబా—అట్లు కానేరదు. అట్టి దౌర్జన్యములకు కారకులు మీ మామగారి పూర్వపురుషులే.

హసీ—వారి దౌర్జన్యములకు తగినట్లు మీరు మా యెడ దౌర్జన్యము చేయ తలబెట్టితిరా. పూజనీయులగు మా మామగారికి మిరపకాయలపొగ వేయుదురా? నాపతిని కాలినపెనముపై కాలిడుమందురా? నేను బ్రదికియుండ నా చర్మము నొలిచెదరా?

ఆబా—చర్మమొలుచునంతనే మానవానికి బదులెట్లగును?

హసీ—మొదట మాతృకల్పనని మన్నించి నన్ను మీ రవమానింతురా?

ఆబా—అట్లుకాదు. నాకు పితృకల్పుడగు నొకవ్యక్తికి కానుకగా నొసంగెదను.

హసీ—నేను మాతృకల్పను కావున నాపతి మీకు పితృతుల్యులు, వారికే నన్ను కానుకగా నొసంగుడు. వలదనను-న నొక్కకపట్టెలో బెట్టి మిఠాయి అనిచెప్పి నాప్రాణేశ్వరుని ముందు నన్ను జేర్పుడు.

ఆబా—నా కిజగతిని పితృతుల్యులొక్కరే గలరు-మహాప్రతాపశాలులగు ఛత్రపతి శివాజీ మహారాజుగారు.

హసీ—వారికా మీరు నన్ను కానుకగా నొసంగ దలచినారు?

ఆబా——మీరు సంతోసముతో ననుమతించిన అట్లే చేయుదును.

హాసీ——నాపతి జీవించియుండ నేను శివాజీకి స్వాధీన నగుదునా ? ఇదియా మీకు నచ్చిన వేడుక ? నాపతిని వీడి నేను శివాజీకి దాసి నగుటయా? అట్లే చేయగల్గిన నో శివాజీ ప్రతాపశాలి యనవచ్చును... సర్దారుగారూ, మీయుద్ధకౌశలము నేనెరుంగను గాని మీవాక్చాతుర్యమును బట్టిచూడ మీరు పెద్దామకపదవికి తగియున్నారనుట నిశ్చయము.

ఆబా——ఏమంటివి !

హాసీ——మీరు స న్నిమిచేయుదు నంటిరి! కానుకగా నిచ్చుటకు మీరూ, పుచ్చుకొనుటకు మీరాజుగారూ, సిద్ధపడుదురే కాని నా సంగతి చించుక ఆలోచించితిరా? పురుషులు మాత్రమే నీతిమంతు లనియూ మీయూహ ! స్త్రీలు నీతిదూరులని యెంచితిరా?“అంగడిలో బెల్లము గుళ్ళో లింగానికి నైవేద్యము”న్నట్లు పరస్త్రీని యజమానికి కానుకగా నొసగునంత ఉజ్వలస్వామిభక్తి మీకుండ, నాప్రాణేశ్వరుని మదిలో నెంచి ఘాలాత్మనేని గొప్పగా నెన్నకుండునంత పతిభక్తి నా కుండకూడదా ? నేను విజాతీయ వనితనని అట్లు భావించుచుంటిరా? పోనీ మీ జాతిలోని స్త్రీ అట్లు చేయుటకు సమ్మతించునా? మీవా రట్లుచేయకున్న మేము మాత్ర మట్లంగీకరింతుమని మీ రెట్లూహింప గల్గితిరి? గొప్పకులములో పుట్టి గొప్ప సేనల గొట్టి గొప్పపదవుల మెట్టిన మీ

బోంట్ల కిట్టి స్వల్పవిషయము ఎరుకపడకుండునా?

ఆబా—నా మాటవిని సంతాపభరమున మీ రొడలు మరచినందున మీకిట్లు తట్టుచున్నదేమో గాని సావకాశముగా మీ రాలోచించినచో దీనివల్ల మీకు కలుగనున్న మేలు స్ఫురింపకపోదు.

హసీ—రానున్న మేలుమాట అటుంచి పోనున్న మానము, కులశీలములకు కలుగనున్న కళంకము, తన్మూలమున సంభవింపనున్న అధఃపతనమును ఇంచుక భావించితిరా? నీతి-అవినీతియు అవస్థాభేదమున మారునా? అయ్యో, దైవమా! ఎంత లజ్జాకరమైన అవస్థ ఘటిల్ల జేసితివి! ఈమాటలు వినుచున్న నాగుండె బద్దలుకాదేమి? (అమీనాపై తల పెట్టి నిర్ఘాతపడి సోలును) నాకు మరణము రాదేమి? హా! దైవమా! (మూర్ఛిల్లును).

ఆబా—ఇక నిట నుండరాదు. నిరాశాహతురాలై ఈమె ఆత్మహత్య చేసుకొనునేమో? దానిగూర్చి తగిన ఏర్పాటు లొనర్పవలయును. (పోవును).

—ఆరవ రంగము—

ఆబాజీ, గుల్‌జార్.

ఆబా—ఓరీ, నీ యజమానురాలిని శివాజీమహారాజు గారికి కానుకగా నర్పింపవలయునని నా కుద్దేశ మున్నది. నీ వేమందువు?

గుల్—ఈయాలోచన నా కంతబాగుగా నున్నట్లు తోచదు.

ఆబా—ఏల ?

గుల్—ఆలోచించుట కవకాశము వలదా ?

ఆబా—కష్టసమయమున గాని ఆలోచనాశక్తికి తీవ్రత ఘటిల్లదు. నీ ప్రాణముమీదికి వచ్చినకాని నీబుద్ధికి చురుకు పుట్టదు. (కత్తిచూపి) నామాట కంగీకరింతువా? లేదా?

గుల్—అంగీకరించితిని- బాబ్జీ-అంగీకరించితిని.

ఆబా—అది యోగ్యమైన పని యందువా?

గుల్—మీరు కత్తిచూపునపుడే దానియోగ్యత నాకు తట్టినది.

ఆబా—నీ బుద్ధిసూక్ష్మతకు సంతసించితిని.

గుల్—ఇదంతయు మీ కత్తిప్రభావము.

ఆబా—ఇందు న్యూనత కలదా ?

గుల్—అబ్బే! న్యూన తేదీ ? మాయజమానిగారు నాతో "నీ యజమానురాలిని సురక్షితముగా నా కొప్పగింప వలెను సుమా" అని నాతో చెప్పిపోయిరి. మీకోర్కె నెర వేరినచో ఆమె క్షేమమునకు భంగము వాటిల్లదు. నాకు కావలసిన దంతే.

ఆబా—రవ్వంతయు లోప ముండదు. కాని నే నీమాట ఆమెతో చెప్పినతోడనే పొరవిడిచిన నల్లతాచువలె నామె నాపై కెగిరి బుసగొట్టినది. ఆ కోపముచేతనూ పతి

వియోగసంతాపముచేతనూ ఆమె ఆత్మహత్య చేసుకొనునేమో అని అనుమానము కలుగుచున్నది. ఆమె అటులొనర్చినా నీ యజమానికి నీ వుత్తరవాదివి కాగలవు. ఆత డొకవేళ నిన్ను మన్నించినను మేము మాత్రము నీచర్మ మొలిచి తీయుదుము.

గుల్—ఆమె ఆత్మహత్య చేసుకొనినచో ఆమె శరీరమునకు బదులు నా శరీరమును మీ రాజుగారి కర్పించుదు.

ఆబా—చిల్లిగవ్వ చేయని నీశరీరము మాకేల ? ఆమె మృతిచెందినచో నీకు మృతి తప్పదు. తెలిసినదా ! (కత్తి చూపును).

గుల్ — తెలిసినది- తెలిసినది. నన్నేమి చేయుమందురు ?

ఆబా— తెలిసినదంటివే ? మూర్ఖురా!... ఇటువిను-పైనుండి తాడుగాని విషముగాని లోనికి పోగూడదు. ఆమె దగ్గర వజ్రాభరణము లేమియూ లేవు. శస్త్రమున్నచో నీవు దానిని సంగ్రహింపవలయును, తెలిసినదా ?

గుల్—ఏ రీతిని ?

ఆబా—నీ చెంత శస్త్రము లేదుకావున పారాలో నుండుటకు వీలులేదను మిష పెట్టి దానిని పుచ్చుకొనుము. ఈకత్తిని జ్ఞప్తి నుంచుకొనుము. ఆమెచచ్చినా నీకును చావు మూడును.

శివశీలము

మూడవ అంకము

— మొదటి రంగము —

(శివాజీమహారాజు, అహమ్మద్, ఆబాజీ, బాలకృష్ణపంత్)

అహ — శివాజీరావ్రూ, నేను మీచేతిలో చిక్కితిని, నన్నేమిచేయుటకునూ మీకు స్వాతంత్ర్యమున్నది-మీకు నాపై కృపవహించుటకు హేతువెద్దియు కానరాదు. పరాజితులయిన హిందువులపై మీవారెన్నడూ దయదలచుట లేదు. వయోవృద్ధుడనగు నన్ను మీరు కరుణింతురని నే నపేక్షించుట లేదు. ఎంతో కాలము బ్రతుకువాడను కాను గావున నన్ను చంపకున్న హర్షమూ, చంపిన విషాదమూ చెందబోను. నాజీవితశేషము గౌరవదాయకమయినచో దానికి హాని ఘటించునప్పుడు దుఃఖించుట సహజము; పదభ్రష్టుడనై చెట్టంతకొడుకునూ కోడలినీ కడుపునబెట్టుకొని మొండికట్టెవలె నేను జీవించుటవలన ప్రయోజనమేమి? కావున నాభావిగతికి నేను దుఃఖమొందను. తొలుత సుఖో

దకముతో స్నానముచేయ నారంభించినప్పుడు మానవునకు నిర్మలోదకము లభించును, ఆయుర్దాయమను పాత్ర రిత్తవను చున్నకొద్ది పల్వలోదకము ప్రాప్తించి తుద కాపాత్ర అడు గున చేరియున్న బురదయే దక్కును.

శివా—మీకు తుదికోరిక యేమియు లేదా?

అహ—ఎన్నడును మిత్రుండైనను నేనెద్దియు యాచింప లేదు; అట్టియెడ క్షుద్రమనస్కుడనై శత్రువును యాచించుట నాకు ప్రాణగోడ్డము కాదా?

శివా—సరే- నేనెట్టిశిక్ష విధించినను దానికి మీరు సిద్ధముగా నుండుటచే నాశిక్ష మీకు నిష్ఠురము కాదు. ఆబాజీ, వీరిచేతినుండి మీరు లాగుకొనిన శస్త్రము నిటు తెండు. [ఆబాజీ దానిని తెచ్చును.]

అహ—ఆహా! యావజ్జీవము నాచేతి నలంకరించి యున్న నాప్రియమైన ఖడ్గమే నాకంఠమును ఖండింపనున్నది కాబోలు! నా నుదుటివ్రాత యిట్లున్నదా? శివాజీరావు! నాకత్తితో నాకుత్తుక నుత్తరించుట నాకెంత అప్రియమైనను నేను దానికి సిద్ధపడియే యున్నాను. వయసుమీరినవాడ నగుట శూరుని ప్రజ్ఞ నాయందు క్షీణించినను వీరున కుండ దగిన నిస్పృహ నాయందు నశించుట లేదు.

శివా—ఉదారులు సాహసులు నగు తమబోటి శత్రువు శిరచ్ఛేదనము చేయించితినేని నేను మానవుడగానని మహీతలమునకెల్ల విశదమగును. అయ్యా, ఈఖడ్గము తమ

హస్తమందున్న శోభిల్లునుగాని, కంఠముపై నుంచుట శోభస్కరము కాదు, కావున పూజ్యభావమున అత్యంతాదరముతో దీనిని మీకు కానుకగా నిచ్చుచున్నాను, దానిని మా మీఁద ప్రయోగించుటకు మీకవకాశము చిక్కినప్పుడు నిరభ్యంతరముగా మీకు వ్యవహరింప వచ్చును. ఇంతేకాక మీమర్గమూ మీస్వాతంత్ర్యమును మీ కొసంగితిని-మీరు యథేచ్ఛగా సుఖింపుఁడు.

అహ—ఏమి మీ దయాహిల్లోలము! నేను మే ల్కొని యున్నానా? లేక కల గనుచున్నానా? నాకు గర్భ శత్రువులగు మీరు నా కుపకారులైతిరా? శివాజీరావూ, మీరు నాకు పుత్రకల్పులని భావించి మీకు సమస్త కళ్యాణ ప్రాప్తి యగుగాక అని ఆశీర్వదించుచున్నాను.

ఆబా—తథాస్తు.

శివా—కళ్యాణదుర్గము నాకు స్వాధీనమగుట అంత గొప్పవిషయము కాదు. నాపక్షమున మీరే దాని కధిపతులుగా నున్న నాకు సకలకళ్యాణములూ చేకూరినట్లే. మీబోటి సామంతులే రాజునకై నను కళ్యాణసంధాయకులే. ఉదారవీరుల తోడి పరిచయ మబ్బుటయే గొప్ప అదృష్టము. అధము డగు మిత్రునికన్న ఉత్తముడగు శత్రువు మేలు.

అహ—సందియమేమి? మహారాజా, నీయౌదార్యము అసామాన్యము. కళ్యాణదుర్గమునకు నన్నధికారిగా నియమించుట తత్పరమావధియే. కాని నే నాపదవిని స్వీకరింప

జాలనందుకు చింతించుచున్నాను. నేను మీకొలువు చేసితినేని అదిల్‌శాహా యెడ ద్రోహినగుదును. ఒకస్వామియెడ ద్రోహ మొనర్చిన వాడు ఇంకొక స్వామియెడ ద్రోహ మొనర్పడా?

శివా—మీ రిట్లందురని నే నెరుగుదును. మీ కిష్ట మున్నప్పుడు మీరు బిజాపూరు దయచేయవచ్చును. పల్లకి సిద్ధముగా నున్నది. మీ సొత్తంతయు గొనిపోవుటకు వాహనము లాయత్తమున నున్నవి. అమాత్యవర్యా, వీరికి అమూల్యవస్త్రాభరణము లిచ్చి పంపుము.

అహ—యుద్ధమున చెరలోపడిన నేను బీజాపురమున కిక రాజవైభవమున బోవుదునా? శివాజీరావూ, మీ బాహుబలమునను సౌజన్యసంపద తోడను విజయశ్రీని వరించుటకు మీరే సమర్థులు, ఇందు సందియము లేదు. క్షుద్రుని జయించుటకన్న మహాత్మునిచే జయింపబడుట శ్రేయము.. నే నిప్పుడే బీజాపూరునకు పోయియుందును, కాని నాకొడుకూ కోడలూ ఏమయిరో తెలియువరకును నాచిత్తమునకు శాంతి చేకూరదు. కావున కొలది దినములు నన్ను మీయొద్ద నుంచ వేడుచున్నాను.

శివా—అట్లే కానిండు. మాయిల్లు మీయిల్లుగ భావించి మేమే మీ కతిథుల మన్నట్లు మసలుడు.—ఆబాజీ, వీరి కొడుకుజాడయు కోడలిజాడయు నేటి సాయంత్రమునకు తీయగల్గు చారుల నియోగింపుము, జాగుసేయవలదు.

(పోవుదురు)

———

—• రెండవ రంగము •—

గుల్జార్ ఖాం.

గుల్—నాశత్రుభారము నన్ను వదిలి పోయినందున కొంతసేపు సంతోసము కలిగెను, కాని అప్పటినుండియు ఏమో తోచకున్నది. నాకళ్ళు సడలినట్లున్నవి. హుక్కా పీల్చుచు హాయిగా నుండమన్న నిన్నరాత్రి లూటీలో దాని నెవడో దోచుకొనిపోవుటచే అది నాకంట పడలేదు. ఇంక నది దొరుకునా?......

ఎవరో మరాఠాసర్దారు లిటే వచ్చుచున్నారు. వీరి స్నేహము సంపాదించితినా, నా హుక్కా నాకు దొరకవచ్చును...వారేద్దియో ముచ్చటించుచున్నట్లున్నారు—నే నిక్కడనే పొంచియుండి తర్వాతను కనిపెట్టి వారిని జేరి హుక్కా ప్రసంగము చేసెదను (తెరప్రక్కకు తొలగును)

(ఆబాజీ శంభూజీలు వత్తురు).

శంభూ—మీ రేమో అపకతవక చేసి వ్యవహారము ఆరుమూడనిపింతురని నా కాదినే స్ఫురించెను. దాని భర్త బ్రతికియున్నాడని సూచించుటయే గొప్ప పొరపాటు. ఆసంగతి నెరిగిన అభిజాత అన్య నభిలషించునా? అనురాగమో అభిమానమో దానిని వెనుకకు లాగదా?

ఆబా—ప్రమాదమే సంభవించెను. మొదటనే మీరు నాకు దీనిని సూచించిన బాగుగ నుండియుండును.

శంభూ—పరోపదేశపాండిత్యము పూర్ణఫలదాయక మగునా? ఇంత యేల? మొదటే ఈపని నేను పూనియుండ వలసినది.

ఆబా—ఇప్పు డేమిమించిపోయినది? మీరు ఇప్పుడైన నిర్వహింపగలరు.

శంభూ—కార్య మింకను మించలేదు. జరిగినదంతయు కొంతవరకు మేలే-ఇప్పటి అనుభవమునుబట్టి ముందు మీరు జాగరూకులై యుందురు; కాని ఇంతలో నామె ఆత్మహత్య చేసుకొనదు కదా?

ఆబా—లేదు లేదు-ఆవిషయమును తగినపర్పాటు చేసి యుంచితిని. అయినా వీని నడుగుదము. ఓరీ కొజ్జా, మీదేవి సురక్షితముగా నున్నదా?

గుల్—నేనిప్పుడే వారిచెంతనుండి వచ్చుచున్నాను. దుఃఖావేశులై అతికష్టముతో మాటలాడుచున్నారు.

ఆబా—నీకు నియమించినపని నెట్లు నిర్వహించితివి?

గుల్—మీరు చెప్పినప్రకారము కఠారి నామెచేతినుండి సంగ్రహించితిని. ఒకసారి దానినిమ్మని ఆమె అడిగెను గాని, ఎచ్చటనో యుంచితినని చెప్పి నాచెంతనే దాచిపెట్టితిని.

శంభూ—భళిర! ఆరితేరిన పోకిరివే. దాని నిటు తెమ్ము (అతడిచ్చును) ఆబాజీ! నిశ్చింతులై మీరు పొండు, నేను కార్యము నిర్వహించుకొని వచ్చెదను. (అతడు పోవును)

గుల్—మహాప్రభూ! నా దొక మనవి.

శంభూ—ఇప్పుడు నాకు తీరుబడి లేదు. నీయజమానురాలిని గాంచిన పిదప వినెదను.

గుల్—దేవరవారి చిత్తము.

శంభూ—నే నామెను చూడవచ్చితినని చెప్పుము. (గుల్ జార్ పోవును) శివాజీ తన అకలంకకీర్తి కపాత్రుడని నిదర్శనము చూపినంతమాత్రమున నేను తృప్తి నొందజాలను. వాని నంతమొందింపవలయు, నాకోర్కె ఫలించవలయును.

గుల్—అమ్మగా రించుక చిరచిరలాడుచున్నై దీని కలుసుకొనుటకు ఒకరి యనుమతి అనవసర మనిరి.

శంభూ—సరే-నీ విక పొమ్ము. (వాడు పోవును) ఈ నల్లతాచు నన్నొకకాటున కాలుని వీటికి పంపవలెనని తలచుచున్నది కాని నేను దానికితగిన మాంత్రికుడనే, బుజ్జగించియో భీతిగొల్పియో దానిపొగరణచి బుట్టలో పెట్టకమానను... బీబీగారూ, బీబీగారూ! (తెర ఎత్తబడును)

హాసీ—బీబీగారు నిన్నటిదినమే మృతినొందిరి. మీ యెదుట నున్నది బందిఖానాలోనున్న స్త్రీ.

శంభూ—మీతో మిత్రభావమున ముచ్చటింప వచ్చితిని. నన్నించుక విశ్వసింపవలయు.

హాసీ—మరాఠాలకూ మైత్రికీ చాలదూరము. ఆ మాట నెరుగుదురేమో కాని దానిభావము మాత్రము వారి కపరిచితము. వారు విశ్వాసఘాతుకులని ప్రపంచమందెల్ల పేరు పడినారు. ఆవిషయము నా కనుభవసిద్ధము కాలేదు.

శంభూ—వారందరు నొకతీరువారనియా మీ యూహా?

హాసీ—అందరూ ఒకలాగున నుండకపోవచ్చును. కాని ఆబద్ధస్నేహితు లొకతీరున నుంట సహజము-మీమిత్రు లొకరు ప్రొద్దుట ఇక్కడికి దయచేసి మాతుశ్రీ) అని నన్ను సోదరపిలిచి నన్ను వారివలలో పడినదానిగా భావించి మీ శివాజీకి నన్ను భోగినిగా చేయుదునని సిగ్గుమాలిన ప్రసంగము చేసిపోయిరి.

శంభూ—"యథా రాజా తథా ప్రజాః" ప్రభువును బట్టి సేవకులు—

హాసీ—అటులైనా? మీరు శివాజీసేవకులు కారు కాబోలు?

శంభూ—మనసార వాని సేవకుడ గాను, కార్యాంతరమున సేవకపదవి స్వీకరింపవలసి వచ్చెను.

హాసీ—ఎట్టి కార్యము?

శంభూ—మహారాజును మట్టిచేయుటయే.

హాసీ—మీ కాత డేమికీ డొనర్చెను?

శంభూ—నన్ను పలునష్టములు పాలుచేసెను. నేనతని సవతి మేనమామను. సుపేప్రాంతమున సుబేదారుగా నన్నాతనితండ్రి నియమించెను. నేను వసూలుచేసిన పైకమూ నాస్వాధీనమునన్న గుఱ్ఱపుదళమును, బలవంతముగా లాగుకొని ఏవో లేనిపోని నిందలు నాపై బెట్టి నన్ను పూనాకు

రావలెనని ఆజ్ఞాపించినాడు. నేను దానిని తృణీకరించుట న్యాయమే కదా? నిన్నట మావళాలతో వచ్చి నన్ను బంధించి నాసర్వస్వముకూ కరగతము చేసుకొన్నాడు.

హాసీ—ఈమాత్రపు పొరపాటునకు మీ మేనల్లునే నాశనము చేయబూనితిరా?

శంభూ—మొదట నాపత్నే మే అంతపనిచేయుటకు చాలును. దానిపై నిది రెండవహేతువు-మాకు ప్రాణము కన్న మానము శ్రేష్ఠమాట హత్యచేసినను మానహాని తొలగింప జూతుము. అంతకన్న నెక్కుడు ద్వేషకారణ మింకొకటి కలదు. ఆత్మరక్షణార్థ మాతని శిక్షింపకతీఱదు. "స్వరాజ్యస్థాపనమునకు పరాఙ్ముఖులైన వారి నెల్ల వధింపబూనితి"నని నన్ను ఆతడు బెదరించినాడు. మనసుకు రాని కొలువును బలవంతముగా నానెత్తిని చుట్టినాడు. ఇంత దూరమున న్నాత డవమానించియుండ, ఆతడు పూనిన పిచ్చిపనిలో నేనతనికి సాయము చేయుట కలలోని వార్త. వీలైనంతవరకూ అడ్డు వేయుచుందును. ఆత డదిగుర్తించి నన్ను చంప గమకించుటకు పూర్వమే ఆతని ప్రాణముల నేను హరింతును.

హాసీ—అట్లు చేయబూనుట ద్రోహము కాదా?

శంభూ—నన్నాతడు చంపకపూర్వ మాతని నేను చంపబూనుట దోసము; ఆతడు నన్ను చంపిన పిమ్మట నేనతని జంపుట అసంభవము; కావున ఆతనికి చావే ఘటింపదు- బీబీగారూ, మీవంటి వకీలు శివాజీకి లభించుట ఆతని

భాగ్యము, నా దౌర్భాగ్యము- పోనీ, నే నాతని స్వయముగా చంపక ఇతరులచే చంపించిన మీ కభ్యంతర ముండదు కదా!

హాసీ—హత్య చేయఁబూనుట అమానుషము, దానిని రాక్షసకర్మ అనదగును. కావున మీ రెవరిచే వానిని చంపింప గడంగుచున్నారో వా రాపని చేయుటకు తగినంత కారణ ముండినచో నట్టి అభ్యంతరము నుండబోదు.

శంభూ—ప్రియతముఁడైన ఆప్తబంధువును చంపుట కన్న బలవత్తరమగు హేతువు వేరొకటి యుండునా? మీవలె దీనురాలగు నొకసతీమణిభర్తను శివాజీ చంపించినచో ఆమె యాతని చంపుట సకారణము కాదా?

హాసీ—సద్గురుగారూ, అట్టి ఘోరమైన కల్పన దృష్టాంతము కొఱకైనను నాపై నారోపింపకుడు.

శంభూ—అట్లు కాదు తల్లి, దనుజులు వధకరగునప్పుడు వినగూడని అవస్థలకు గూడ మనము సిద్ధపడి యుండవలయు. మీ రిప్పుడు స్వాతంత్ర్యహీనులు, మీ భర్తగారు బందిగ్రాహులైయున్నారు, శివాజీ మీపై పాపదృష్టిపరచుటచేత మీపతిని తొలగించిన గాని తనపాడుపని సాగనేరదని ఆత డెఱుగును. ఇట్లు పరిస్థితులన్నియు మీకు ప్రతికూలముగా నున్నప్పుడు మీరావిషయమున ఉపేక్షవహించుట పాడిగాదు. వ్యవధియుండగనే ఉత్తరగతుల నాలోచించుకొనినచో విపత్తి సంభవించునపుడు మీకు ముందువెన్కల

నరయు నక్కర యుండదు. మీవిషయమున భావించుటకేని అయోగ్యమగు నాపని నాపాపి ఈవఱకే నిర్వహించెనేమో!

హాసీ—మీమాటలు వినుచున్న నా కొక భీకరమైన సందేహము పొడముచున్నది. ఏదో అశుభవార్త మీకు తెలిసియున్నను నాయొద్ద దానిని మరుగుపరుచుచున్నారు.

శంభూ—నిన్నటిదినము తమపతి మృతిజెందెనేమో అను సంశయము కల్గినంతమాత్రముననే మీరు మూర్ఛిల్లిరని వినినప్పటినుండియు భయావహమైన వార్తను మీకు తెల్పుటకు తెగించలేకున్నాను.

హాసీ—మీ రెట్టివార్త తెల్పిననూ దానిని వినుటకు నేను గుండె దిట్టపరుచుకొని యున్నాను. ఆమోరకులు నాప్రాణనాథుని పలుబాముల పాలుజేసి ప్రాణములు హరించిరా? కన్ను లూడ పెరికిరా? ఏనుగకాలునకు గట్టి ఈడ్పించిరా? అబ్బా! ఇట్టి దారుణవచనములు నానోటనుండి వెలువడుటకు నాగుండె ఎంత గట్టిది కావలయునో ఇంచుక భావించి మీరు చెప్పదలచిన దెద్దియో చెప్పుడు.

శంభూ—మీమాటలచే నా కార్యము చాలవరకు చులకనైనది. అత్యాదరము పాపమునే శంకించుచుండును. భయభ్రాంతులై మీరొనర్చిన కల్పనలు క్రూరులగు పగవారికి తోచలేదు. మీనాథుని హింసించుటవలన వారి కెట్టిలాభమునూ కలుగబోదు. ప్రాణాపహరణముననే వారికి సర్వమూ నెరవేరెను. రేయంతయు జాగారము సల్పుటచే శ్రాంతములై

కనులు మూతపడుచుండగనే—

హాసీ—నిదురలోనే !

శంభూ—గొంతు నులిమి—

హాసీ—చంపిరా ? అయ్యో ! ఈమాట వినుటకే కాబోలు నేను బ్రతికియుంటిని. నాథా ! జాగ్రదవస్థలోని సంకటములనెల్ల మరచి స్వప్నమున నాతో ముచ్చటించుచుండ ఆపాపులు మీస్వప్నమునగా జీవము నొకసారియే అంతమొందించిరా ? మీ అనంతరమున నే నొకక్షణమేని ప్రాణముల భరించియుండనని ఎన్నియో సారులు నమ్మించి నేనొనర్చిన బాస నమ్మయ్యె కదా ? మీ రీజగమును వీడి పోయినను నా కిక్కెడ్డదియో నీచకార్యము పడిపోయినట్లు బ్రతికియుంటిని, ఇదేమిసుఖమో నాకు స్ఫురించుట లేదు. మీ వెనువెంట నేనుకూడ వత్తునను ఆసతో నన్ను ప్రతీక్షించుచున్నారా ? నేను అనురాగ విడంబన మొనర్చుచుంటినే కాని క్రియ సున్న అగుచున్నది. ప్రాణప్రియా, స్వర్గప్రవాసముకన్న నాక్రోడము నుంటయే శ్రేయస్సని మీ రెంచుచున్నా నాదండనున్నప్పు డచ్చరలు కూడ పశ్చిమగణ్యాలని తలచుచుండిరి. నేను మీ చెంత లేనుకదా స్వర్గమున మీకెట్లు తోచుచున్నదో? సరససల్లాపముల మీ మనసు రంజిల్లచేయువా రెవరు ?

శంభూ—మీభర్త సజీవులై యుండ మిమ్మెవ్వరూ అపేక్షింపజాలరని మీరు నామిత్రునితో నుడివిరట.

హాసీ—అందుచే ఆచండాలులు నానాథుని వధించిరా? ఒకరి ననసేల? నా నోటనుండి ఆమాట రాకున్నచో నామనోనాథుని కీగతి వాటిల్లకుండునుకదా? అయ్యో! ప్రాణప్రియా, మీప్రాణముల నేనే హరించితిని. స్వప్నప్రపంచమున మీరు నాతో సయ్యాటలాడుచుండ మీ కంఠమును నేనే నులిమివేచితిని. మీరు నాపై వర్షించిన ప్రేమవృష్టికి మారు మీ రక్తవృష్టిని ఘటిల్లజేసి నాకృతఘ్నతను తార్కాణించితిని. ఘాతకురాల నగునాకు మరణమే తగిన శిక్ష. మిమ్ము నోటితో చంపుకొన్నందుకు నన్ను చేతులతో చంపుకొనుట యుక్తము.

శంభూ—మీరు భ్రమపడుచున్నారు. ఇందు మీ నేరమేమి? పతిభక్తిని నిలుపబెట్టుకొనుట సతులకు సహజము- అట్టివారు ప్రశంసనీయులు, వారి శత్రువులు నింద్యులు. మీ శత్రువునెడ ప్రతిహింస తలపెట్టకమున్ను మీ రాత్మహత్యకు కడంగుట భావ్యముకాదు.

హాసీ—అవును—శత్రువును ఖండించుటయే నాకు ప్రథమకర్తవ్యము-సరే-తెలుతి శివాజీప్రాణముల హరించి పిదప ఆశస్త్రముతోనే నాకుత్తుకను ఉత్తరించుకొందును. పతిని జంపుకొన్న పలుగాకి పగవాని జంప శంకించునా?

శంభూ—చెప్పుట సులభమేకాని శస్త్రములేక ఆకార్యము సాధించుట అసంభవము.

హాసీ—హత్య చేయుమని నన్ను ప్రోత్సహించుచు వెంటనే పిరికిమందు పట్టుచున్నారే?

శంభూ—కార్యసిద్ధికి కలుగబోవు విఘ్నముల ముందే తెలుపకున్న మీ ప్రయత్నము సాగి నేర్చునా?

హాసీ—ఔను. దుఃఖావేశమున నుండుటచే నాచిత్తము, స్వాధీనమున లేదు. అందుచే నేమేమియో పలుకుచుందును, క్షమింపుడు.

శంభూ—మీరు ప్రాణహాని తప్పక చేసుకొందురను భీతిచేతనే ఆ బాదుషా మీ కఠారిని కూడ మీయొద్ద లేకుండు నట్లు చక్క జేసెను. ఆతనికన్ను మూసి దీని నేగొనివచ్చితి. ఇక మీరు కార్యము నిర్వహింపవచ్చును. (దాని నిచ్చును)

హాసీ—మిమ్మిప్పుడు విశ్వసింప గల్గితిని, కాని ఆచండాలుడు నాకు చిక్కుటెట్లు?

శంభూ—అందుకు తగిన ఏర్పాటు చేసి వచ్చితిని. నేడు దర్బారు ముగిసినంతనే ఆతని మహాలులో మీ కాతడొంటిగ దొరకును.

హాసీ—కంటబడినతోడనే కఠారితో వానిని కాలునింటికి పంపుట కాటంకముండదు కదా?

శంభూ—కాదు, కాదు. అట్లు చేయబూనుట ప్రమాదజనకము. మీ రొండొరుల తారసిలునపుడు జరుగవలసిన చర్యలో మీ రెంతజాగరూకతతో మెలంగినను అది కొద్దియే అగును.

హాసీ—అటులనా?

శంభూ—ఆతడు సామాన్యుడనుకొంటిరా! మహా

రాష్ట్రములలో మిక్కిలి పేరువడసిన జోదు, ఊహాలకు పుట్టిల్లు. మీ చేష్టలనుబట్టి మీ యుద్దేశమును కనిపెట్టినచో మీ యత్నమును విఫలము చేయగలఁడు. అనుచరు లెందరో అహర్నిశము వానినంటి యుందురు.

హాసీ—నే నెట్లు వర్తింపవలయునో ఉపదేశింపుఁడు.

శంభూ—మొట్టమొదటి అంశ మెద్దియన, మీరు సుబేదారుగారి కోడలని వానికి తెలియనీయకూడదు.

హాసీ—బాగుబాగు-ఈ గ్రంథమంతయు రచించిన వాని కీసంగతి తెలియకుండునా? అట్టియెడ నేను దాచుట వలన ప్రయోజనమేమి?

శంభూ—ప్రయోజన మున్నది- సుబేదారుకొడుకు విగతజీవుఁడై యుండ ఆతనిభార్య అరమర లేకయే తనకడ కే తెంచుట చూడ శివాజీకి సంశయము జనించును. ఆత డతి చతురుఁడు, అనన్యసామాన్యలోకజ్ఞానసంపన్నుఁడు. వేరొకస్త్రీ తన్ను వరించి సన్నిధినిచేరెనని ఆతనికి తోచునట్లు మీరు వ్యవహరింపవలయును.

హాసీ—ఆహా! విధివిలసితము అనూహ్యము.

శంభూ—వాని కట్లు తోచవలయునన్న మీ చేష్టల యెడగాని పలుకులందుగాని కాఠిన్యము కానరాకూడదు; ముఖ మున మందస్మితము నటింపవలయు, ప్రవర్తనయందు ప్రేమా దరముఁను, సంకోచము, గాంభీర్యము లాలనయు కుదురుపడి యుండఁగానుండవలయును.

హాసీ—అయ్యో! నా ప్రేమనిధి, నా ప్రాణేశుని చిత్తరంజనమునకై సృజింపబడిన నా శృంగారచేష్టలు ఆతని గర్భశత్రువునెడ కపటబుద్ధితో కన్పఱుపవలసివచ్చె గదా! కాని వైరనిర్యాతనమున కత్యవసరమగుటచే నేను వాటిని విడంబించిక తీఱదు.

శంభూ—ఇంకొకటి-ఆతఁ డమితభాషి-మీ రాతని వలచితిరని దృఢవిశ్వాసము కుదురువఱకు మీతో నాతడు ప్రేమాలాపమొనర్పఁడు, మీ కెంత జేగురుటెట్లు? మీ కార్యము సిద్ధించుటెట్లు? అతని చేరదీయుటకు ఎన్ని యుక్తులను ప్రత్యుక్తు లనుపన్నవలసియుండును. ఆతని చూచినతోడనే సాత్త్వికలక్షణములు మీ కలవడెనో లేదో స్వప్నచే పరీక్షింపవచ్చునని కూడ మీరు కోరఁదగినదే.

హాసీ—వలదు, వలదు-ప్రతిహింసాపరాకాష్ఠను పరిత్యజింతును కాని తత్పూర్వత్రిక ఆపాపిని నా దేహము నంటనీయను.

శంభూ—ఇంతమాత్రము నే నెఱుగనా? మాటవరుస కట్లంటిని కాని వానిచేయి మీగాత్రమును సోకునంతలో మీకఠారి వానిహృదయమును చీల్చివేయునని నే నెఱుగుదును. స్త్రీలు వగవద్దికల విషయమున పురుషుల ఉపదేశ మనావశ్యకము. వారి స్వాభావిక చాతుర్యమే వారి కన్నిటిని నేర్పగలదు.

హాసీ—సరే. చెప్పదగిన దింకేమైన నున్నదా?

శంభూ—సహజసుకుమారమగు మీ తనువును పుష్ప

హారములుచేసైన గాసిలజేయుచుండు. వాటిమూలమున సాజ
మగు వన్నెగూడ మాటుపడుచున్నది.

హాసీ—మీాసలహాకు తగిన ఫలము మనకు చేకూరును
గాక! (పోవును)

శంభూ—ఓరీ కంచుకీ, నేటి సాయంకాలము నీయజ
మానురాలితో గూడ 'శివాజీమహారాజు మేడ కరుగుట
కాయత్తుడవు గమ్ము.

గుల్—అట్లే యుండెద కాని నిన్న లూటీలో మీా
సైనికులు, నాహాలుక్కాను గొనిపోయిరి. నా ఆదాయమంతటి
నిచ్చి కొన్నాను. దానిని నాకు తిరుగ నిప్పించి పుణ్యము
కట్టుకొనుడు.

శంభూ—దానికొక చిన్నయుక్తి కలదు- సైనికులు
సంగ్రహించిన లూటినంతటిని నేటిసాయంకాలము మహారాజు
నెదుట పెట్టెదరు. అందు స్త్రీలసొత్తంతయు వారికి మగుడ
నిచ్చుట ఆచారము-నీహాలుక్కా నీకు లభింపవలెనన్న నీవు
మోమున మేలిముసుగు వేసుకొని చేత కంకణములు దాల్చి
దర్బారునకు వచ్చి హాలుక్కా నీసొత్తని చెప్పి దానిని గొని
పొమ్ము. స్త్రీలయెడ మహారాజంత విచక్షణ గన్నరుపడు.

గుల్—మగవాడను, చేతులకు గాజులెట్లు తొడి
గించుకొందు నయ్యా! బాహుబలముచేతనే పురోవృద్ధి గాం
చవలెనని యెంచుచున్నానే.

శంభూ—అంతమాత్రమున నేమియు చెడదు-నీవు

హుకాక్కను బాహుబలముచేతనే కదా ఆర్జింపబోవుచున్నావు.

గుల్—ఔనౌను-విధి తప్పివచ్చినప్పుడేమి సేయ నగును? (పోవుదురు)

—• మూడవ రంగము •—

(స ఈ బాజి సోయరాబాజి)

సోయ—సుబేదారు కుమారుడూ కోడలూ యుద్ధపు సందడిలో కానరాకపోయిరి-ఇంతవరకూ వారిజాడ తెలియ కుండుట ఆశ్చర్యమే. పాప మా ముసలి సుబేదారు వారి వియోగముచే నిద్రాహారముల మానుకొన్నాడు.

స ఈ—మనచారులు వారిజాడ తీయకమానరు.

సోయ—మహారాజుగారి కాదంపతుల జాడ తెలియ దనియా మీ యూహ? నే నట్లు తలపను.

స ఈ—ఈ విషయము వింతగనే యున్నది. దేశమం దంతటను వలవేసినట్లు చారుల నియోగించియున్నారు. ఈ పాటి వారి ఆచోకీ తేలవలపేన దే.

సోయ—మహారాజు గారీవిషయము నెరిగియుండియు దాని కప్పిపుచ్చుటకు హేతు వేమైయుండును? ఇదిగో బాబు గారు వచ్చుచున్నారు, వీరి నడుగుదము. (శంభూజీ వచ్చును)

శంభూ—మీరు వచ్చినది మొదలు మీతో రహ స్యముగా మాటలాడవలయునని యత్నించుచుంటిని కాని

దాని కేద్దియో విఘ్నము కలుగుచునే యున్నది-సుబేదారు కుటుంబము జాడ కనుగొమ్మని శివబా నన్నే నియోగించి నాడు-ఆ టక్కరి ఉయ్యాలలో పిల్లడినుంచి ఊరెల్ల వెతకించుచున్నాడని నాకు తోచుచున్నది-వారి నెచ్చటనో రహస్యముగా వేత్త్యరబంధించి యుండునని లోకులు చెప్పుకొనుచున్నారు. వారిమాట నమ్ముటకు వీలుండునట్లు తోచదు. ఆ సుబేదారుకోడలు అసమానసుందరి కావున ప్రజలు శంకాన్వితులై పలువిధముల పల్కుచున్నారు.

సోయ—ఆమె అంత చక్కనిదగుట నిజమా?

శంభూ—మిమ్మిద్దరను మినహాయించినఅట్టిఅందకత్తె వేఱొకతె లేదందురు.

సఖూ—ఈ ముఖప్రీతి వచనముల కేమి! మీపల్కులు సోయరా విషయమున చెల్లునే కాని నన్నందు జేర్చుటకు వీలులేదు.

సోయ—అట్లుకాదు. సఖూబాయి వంటి సద్గుణవతి యగు చాన నెందును గానము-మీ రట్టిసౌందర్యమును గూర్చి వక్కాణించి యుందురని తోపదు. నా మాటకేమి? పతి ప్రీతియే ముఖ్యమని నాయూహ-అదియుండునాతియేఅందకత్తె. నాయం దెన్నిలోపము లున్నను నానాథుడు వాటినెల్ల సవరించుకొనును.

శంభూ—సోయరాబాఈ, సౌందర్యవిషయమున నీకు గల ఆధిక్యము వృథకాదు. సౌందర్యమున అనేకభేదము

లున్నవి. హిందూసుందరుల సౌందర్యము వారి సాత్త్వికదృష్టియం దుండును. తురకసుందరుల అందము వారి రాజవిలాస దృష్టిలో నుండును. తురకల ప్రభుత్వచిహ్నం వారిస్త్రీల ముఖములందు గోచరించుచుండును. ఇదిగాక వారియందు స్వాభిమానలావణ్య మలరారుచుండును. దానిదెస వీరునిదృష్టి తప్పక పరుగెత్తుచుండును. అభిమాన మెచటనున్న-అనగా స్త్రీలయందుగాని పురుషులయందుగాని అది పొడచూపెనా-దానిని రూపుమాపువరకు వీరునకు చిత్తశాంతి యుండదు.

సోయ—మహారాజుగారిదృష్టి మహమ్మదీయవనితపై పడెననియా మీ అభిప్రాయము?

శంభూ—ఎంతమాట! ఇది నాఅభిప్రాయ మనుకొంటిరా? కుత్సితులగు ప్రజలమాట నే చెప్పుచుంటిని. వారి నాలుకలకు నరము లుండవు. శివబా తానువిడిసియున్న మేడలో ఆమెను దాచెననియు, అనుదినమూ వారు సల్లాపము లాడుచుండురనియూ పుకారు పుట్టినది-దీని కాధారము గంటిరా? ఆమేడ అతివిశాలము నందు పలునేలమాలెలు, రహస్యమార్గములూ కలవట! ప్రజల దుడుకుతనమునకు మేర యున్నదా?

నఈ—ప్రజలది తప్పుకాదు. మహారాజుగారి మనసును వారేమెరుగుదురు? ఎల్లప్పుడూ వారిచెంత నుందుముకాన వారిశౌచమూ సచ్ఛీలమును అరచేతిఅద్దమువలె మేము గనుచుందుము. ఇట్టి అవకాశమితరులకు కలుగకుంచేసి వా

గన్నిరైన నందురు.

శంభూ—సోమయరాబాఈ, ఆ కుటిలాత్ముల మాటలు నీమనసున గ్రుచ్చుకొన్నవా? ఇది యుక్తము కాదు. మీకును లోకులకును గలవాదమును నే నొకమాటతో నిరవశేష ముగ తీర్పగలను.

సోయ—ఎట్లు?

శంభూ—శివబా కల్మషచిత్తుడై నచో మిమ్మిద్దఱ వెంటగొని వచ్చునా?

సోయ—సరిసరి-ఇదియా మీతీర్పు! అట్లు గొని వచ్చుటకు వా రెన్ని ఆటంకముల బెట్టిరో మీ రెఱుగరు. ఎంతో పట్టుబట్టి వారి యాటల సాగనీయక మేము వెంటబడి తిమి. ఏమక్కా! నీవేమందువు?

సఈ—అది నిజమే కాని, వారు చెప్పిన కారణములు కూడ యుక్తమయినవే. ఇచ్చట శాంతి యింకనూ అలవడ లేదు, నలుదెసలా అల్లరులు రేగుచున్నవి. రస్తుసామగ్రి తగు రీతిని లేదు. అట్టియెడ ఆడవారు వెంటనున్న మగవారు నిరా టంకముగా వ్యవహరింప వీలుపడదని వారు నొక్కి చెప్పిరి.

సోయ—ముందువాటి కేమిగాని తుదిమాట సత్య మని ఒప్పుకొని తీరవలయును.

శంభూ—మీమాటలబట్టి లోకుల ఊహలు సత్యము లనియే తేలుచున్నది. కావున శివబా శుద్ధాంతరంగమును పరీక్షించుటకు ఇంక కాలయాపన మనవసరము. ఈ కోట

యందు జగదేకసుందరియగు ఒక తురకస్త్రీ శివబా సౌంద ర్యపరాక్రమముల కని విని ఆతని మోహించి తన సర్వస్వము నాతని కర్పణము చేయ నిశ్చయించుకొనినట్లు నే నిప్పుడే విన్నాను. తక్షణమే మీానంగతి జ్ఞప్తికివచ్చి ఆమెను శివబా యెదుట పెట్టనా వద్దా అని మీాతో నాలోచింప ఇటు వచ్చితిని.

సఈ—పతిని సతు లిట్లు పరీక్షింపబూనుట పాపము కాదా?

సోయ—అది కాదు. నిర్మలాకాశ్మీరమువంటి పతిచారిత్రమును నిదర్శనముగా జూపి ప్రజల పాపచింతలను మాపుమాపుట పతివ్రతల విధి కాదా?

సఈ—సరే-మీా రాలోచించి యోగ్యములనితోచిన పనులు చేయుడు. మీా మాట కడ్డుచెప్పునంతటి దాననా?

సోయ—బాబుగారూ, మీా రొనర్ప నెంచిన కార్య మవశ్యమూ తీర్చుడు.

శంభూ—అట్లే చేసెదను కాని దానికి నే నణుమా త్రమూ ఉత్తరవాదిని కానుసుడీ.

సోయ—మీా కాభయము వద్దు. మహారాజుగా రందు కలిగినచో వారిని సమాధానపరచు భారము మాది. ఇందు మన ఉద్దేశము నిష్కల్మషముగా నుండ వారిభయము మీా కేల యుండవలెను? (అందరూ నిష్క్రమింతురు)

—నాల్గవ రంగము—

(ఒకగదిలో మహమ్మదు పచారుచేయుచుండును.)

మహ—సుఖ మింతక్షణభంగురమైనను దూరదృష్టి లేని నాబోటి మానవులు ఎంతెంత విపుల మనోరాజ్యముల కల్పించుకొనుచుందురు! వైభవమును ప్రేమయు మాసుఖసంతతి కాధారములు. ఇందులో నొకటైన శాశ్వతమా? కేవలము మాపైననే ఆధారపడియున్నది శాశ్వతమని యెంచనగును, మావైభవమా దానిని హరియింప వేచియున్న శాత్రవుల చేతులలో నున్నది. ప్రేమ మామానసముల నాకర్షించిన మగువలచేతులలోనున్నది, రెండూ పరుల నాశ్రయించి యున్నవే. ఇందులో నొకదానినైన ననుభవించనిమానవుడు నాకొక్కొక డుండును. ప్రేమనో వైభవమునో చవిచూచి అచిరకాలముననే దానినడబాయువారనేకులు గలరు. కాని రెంటిని యథేచ్ఛముగాచాలకాల మనుభవించి ఏకముహూర్తముననే వాటిని కోల్పోయిన నాబోటి నిర్భాగ్యు డొకడూ ఉండడు. వైభవముశాశ్వతమని నేనెంచలేదు, కాని ప్రేమ నా జీవితసర్వస్వమై యుండెను. మా కుటుంబమున నున్నవారము ముగ్గురము. నా దౌర్భాగ్యమున ముగ్గురము మూడుత్రోవల బట్టవలసివచ్చెనే! వారిద్దరూ జీవించియున్నారో లేదో? స్త్రీబాలవృద్ధజనముల ప్రాణములు పవిత్రములని ప్రతీతి. తండ్రిగా రనుభవ

శాలురగుట నీ సంకటము నెట్లని భరింపగలరు. కాని హసీనా గతి ఏమాాయెనో? ప్రేయసీ! పంజరములోని పక్షివలె నీ వెట్టి బాధల పడుచున్నావో! శోకావేగమున నీమానసము కలత చెందినప్పుడెల్ల నా వక్షము నీశిరస్సునకు విశ్రాంతిస్థానమై యుండెను. నాకర్ణరంధ్రములగుండా నీదుఃఖమును నాహృదయ సాగరమున బోసి నీహృదయమును చులకబర్చుకొనుచూ నీ కన్నీటిని నాచేతులతో తుడుచుకొనుదానవు. ఇప్పుడు ని న్నట్లు ఊరడించువారెవ్వరు? ఏమీాయెరుగని ముద్దరాలవు నీ కీనిర్బంధము ఘనమని తోచకపోవచ్చును, యుద్ధమున చెరగొన్న స్త్రీలను శత్రువు లేరీతిని పరిభవింతురో నీ కను భవసిద్ధ మగునప్పుడు నీ దుస్థితి కడుగంతాపకర మగును. ఈదూాపత్సముద్రమును తరింపదగిన మనస్థైర్యము అబలవగు నీ కెట్లలవడగలదు? బాధానివారణమునకై ప్రాణముల త్యజింతువో లేక ప్రాణములు తీపగుట వారు నిన్నుపెట్టు అగచా ట్లను సైచియుందువో?... నీ వెట్లుచేసిననూ నాకు తృప్తియ న్నది ఉండదు- ఈ పాడుచెవులు ఎట్టిపాపవార్తను విన నున్నవో!

(శంభూజీ వచ్చును)

శంభూ—(స్వగ) హసీనా కొప్పగించిన పని అది నెర వేర్చగలదో లేదో సంశయమే. అభిసారికాపాత్రము నది ఎంత చతురతతో అభినయించిననూ సమయమునకు దాని ధైర్యము

క్రుంగిపోయెనా పుట్టిమునుగును. కనుక దానిచేత కాక మిగిలియున్న దానిని బాలిశుడు నేను వేయనట్లు చేతును. అది బ్రతికి యుండెనా నా పన్నుగడ బయలుపడుటకు సాక్షియగును కావున, త్వరలో దాని కాయువుమూడు యత్నము చేయవలెను. హసీనాచేత కాని, వీనిచేత కానిశివాజీ మడిసినచో మహారాష్ట్ర రాజ్య గర్భిని వాని భార్యలకు విశ్వాసపాత్రుడనైన నాచేత జిక్కక తప్పదు...సుమేరు ప్రాంతము నాచేతులనుంచి హఠాత్తుగా లాగుకొనిన ఆదౌర్భాగ్యుడు తన యావద్రాజ్యమూ ఇంత త్వరలో నాకు కరగతమగునని కలనైన దలచియుండడు కదా! బుద్ధిబలమున్న నిట్లుండవలెను. (ప్రకా) ఏమి దొరగారూ, రాత్రి నిద్దర చక్కగా పట్టినదా?

మహ—నాబోటి దౌర్భాగ్యున కెంత నిద్రపట్టగలదో నాకూ అంతే పట్టినది. నిలువెల్ల నీఱయి యుండు నాకు నిద్ర యెక్కడిది.

శంభూ—విపద్దశయందును సంతసము చెందుట కవకాశ మప్పుడప్పుడు చిక్కును. స్వజనదుఃఖము స్వసుఖమును చెరచునట్లు స్వజనసుఖము స్వదుఃఖమును తొలగించును.

మహ—నిజమే కాని నా ప్రకృతావస్థయందు నా స్వజనసుఖము నెరుంగుటెట్లు? ఒకవేళ శత్రుపక్షమువారి మూలమున దాని నారయుదమన్ననూ వారిమాటలు నమ్ముటెట్లు? అసత్యమూ కపటమును నన్ను వంచించుటయందు వారికి ముఖ్యసాధనములు, అందుకు వారి ననవలసిన పనిలేదు.

శంభూ—శాస్త్రవపక్షమువారు తమవార్తలకు తగిన నిదర్శనములను చూపిన వాటిని నమ్మరా?

మహా—అట్లు చేయుటవలన వారి కేమిలాభ్ధి కలదు?

శంభూ—శతృత్వ మిత్రత్వము లాగంతుకములనియు మానుషత్వము శాశ్వతసంబంధమనియూ నిర్ధారితము కాదా?

మహా—మీమాటలు నాకర్థము కాలేదు.

శంభూ—మీకిట్టినుట మీబద్ధవైరిశిరము ఛేదింపబడినచో మీకు జాలిగొల్పునా?

మహా—ఏమీ! మాతండ్రిగారి శిరమును ఛేదించిరా?

శంభూ—లేదు. నేచెప్పునది ఉదాహరణము. పోనీ, ఇంకొకటి చెప్పెదను. మీబద్ధవైరి తనకత్యంతప్రియుడగువాని మరణవార్త విని ఏడ్చుచుండ మీ బోటి యుదారుల హృదయము కరిగిపోదా?

మహా—మీవచనములు సందిగ్ధముగా నున్నవి. నా ప్రియురాలగు హాసీనావిషయమున నేదైన వైపరీత్యము ఘటిల్లినదా? త్వరగా చెప్పుడు.

శంభూ—నేనొక ఉదాహరణమును మనవిచేసితిని గాని జరిగినదాని గూర్చి ప్రసంగించలేనని ఇదివరకే చెప్పినాను.

మహా—నిదర్శనమును బట్టి విషయము నూహింపవచ్చును, నిదర్శనమింత భయావహముగా నున్నది గనుక విషయముకూడా అంత భయావహముగా నుండవలెను.

శంభూ—ఆవిషయము భయావహమగునో కాదో,

ఎంత భయావహమైనదో. వీటిని గురించి భిన్నాభిప్రాయము లుండవచ్చును.

మహా—లజ్జాకరమైన స్థితిలోనుండుటకన్న స్త్రీ మరణించుటయే మేలని చాలామంది అభిప్రాయపడుదురు.

శంభూ—మీ యభిప్రాయ మదికాదా?

మహా—హాసీనా విషయమున మృతి నూహించుట కూడా నాకు దుస్సహమే. ఇంక వక్రోక్తి వర్జించి స్పష్టముగా మాటలాడుదు. ఆమె జీవించియున్నదా? ఆ సౌకుమార్యము తలపునకు వచ్చునప్పుడు ఆమె ఇట్టి విపత్తియందు ప్రాణములు వీడెనన్నను నాకు వింతగా తోపదు.

శంభూ—మీ రట్లు తలచవద్దు. ఆమె శరీరస్థితి మును పటి కన్న బాగుగా నున్నది.

మహా—మునుపటికన్న బాగుగానుండుటకు హేతువు కానరాదు, సరేకదా, అప్పటివలె నుండుటకూడా ఆశ్చర్యమే.

శంభూ—ఇంతవరకూ ఆమె దేహస్థితిని గురించి చింతిలుచున్న మీరు ఆమెసేమ మెరిగి అంతగా సంతసించిన ట్లగపడదే?

మహా—బ్రతికియుండిన ఏమి ప్రయోజనము? ఆమెకు సంతస ముండదు.

శంభూ—అయ్యా, నే నసత్య మాడను; ఆమె యిప్పు డానందమున తులతూగుచున్నది.

మహా—ఆమె శరీరస్థితియు మానసిక వ్యవస్థయు మును

పటికన్న బాగుగ నున్నవంటిరి. మీ యభిప్రాయము నాకు గోచరించ లేదు.

శంభూ—మానస మానందమయి మగుటచేతనే శరీ రారోగ్య మతిశయించినది.

మహా—ఇది సత్యమని నే నెంచను- నా వియోగమున ఆమె కానందము కల్గు టెట్లు ?

శంభూ—ఆవియోగముచే ఆమెమనోరథసిద్ధికి ఘటిల్లిన విఘ్నము తొలగి యుండవచ్చును.

మహా—నా వియోగముచే ఆమెకు సఫలము కాగల మనోరథ మామె కేది ఉండగలదు ?

శంభూ—మీయందలి అనురాగ మంతరించెనేమో ?

మహా—ఇది అసంగతము, అసంభావ్యము. నా యం దలి అనురాగ మంతరించుటకు నే నేమీ చేయ లేదు. నవ్వుల కైన ఆమెతో నేనెన్నడూ కలహించ లేదు, కలలోనైన ఆమెను కసర లేదు.

శంభూ—మి మ్మిప్పుడామె లెక్కింపకుండుటకు మీ నిష్ఠురప్రవర్తనము కన్న వేరు కారణము కలదేమో ?...జయ శాలియు మీకన్న నధికు డగు వీరు డెవడైన ఆమెచిత్తాకా శమున పొడచూపకూడదా ?

మహా—ఇదివరకే అట్లు జరుగకుండుటకు హేతువేమి?

శంభూ—అన్యోన్య సందర్శనము కాకపోవుట చేత కావోలు.

మహా.—నే నాయెదృష్టిపథమునుండి తొలగినవెన్క వా డామెకంట పడెనా?

శంభూ—మీ యిద్దరికి వియోగము కలుగజేసిన వాడు ఆమె కంట పడినవాడూ ఒక్కడే ఏమో?

మహా—ఏమీ, అబాజీసోన్ దేవా?

శంభూ—ఆకోతి నేస్త్రీ మోహించును? నేనుదయము శివాజీ మహారాజుగా రిచ్చటికి వచ్చుట మీరెరుగరా?

మహా—శివాజీ వచ్చినతోడనే హాసీనా వానికంఠమున పుష్పహారము వేసినదా?

శంభూ—ఎంత ప్రేమయున్న నట్లు చేయుటకు కుల కాంత తెగించునా?

మహా—సరిసరి- ఈకులకాంత తనకాంతు నేకాంత ముగా సందర్శించుట కేవేని ఏర్పాటులు చేసియున్నదా ఏమి?

శంభూ—నేటిరాత్రి నాప్రయత్నము మూలముననే ఆమెకు మహారాజు దర్శనము ప్రాప్తించగలదు.

మహా—ఇట్టి సందర్భమున మధ్యవర్తిత్వము నానంద ముతో స్వీకరించిన నీచుడు కులకాంతల కవమానము చేకూ ర్చుటకు వారియెడ ఎట్టి యపదూరునైన సృజించుటకు వెను దీయబోడు.

శంభూ—కులకాంతల వ్యర్థముగా అపకీర్తిపాలు చేయు వా డుండునా?

మహా—నాభార్య దుష్కృత్యముల నాచెవిని వేయు

టకు మీరేల పూనితిరి;

శంభూ—ఆ కులట మోసగించిన భర్తచే దానికి తగిన శిక్ష చేయించుటకు మీ యెడల నాకుగల వైరభావము వదిలి మీకడకు వచ్చితిని. అట్టిస్త్రీ తన జనమునకే కాక మానవ కోటికే శత్రువని భావింపనగును.

మహా—ఆమె నాయెడ నింత ద్రోహము తలపెట్టునని నేను నమ్మజాలను.

శంభూ—అట్లయిన ప్రత్యక్షప్రమాణముతో మీకు పనిలే దన్నమాటే!

మహా—ఏమీ? ప్రత్యక్షప్రమాణమా! మీరు నాకు ప్రత్యక్షముగా నేమిచూపగలరు? నా హసీనా శివాజీని ప్రేమ భిక్ష పెట్టుమని యాచించుట చూపగలరా? వానిచే ధిక్కరింప బడి వాని పాదములకు మొక్కుచున్నట్లు చూపగలరా? దైన్యభావమొందిన దాని మోమును వీక్షించి శివాజీ జాలిగొని దాని నక్కునజేర్చి ముద్దులతో నింపిన దృశ్యము చూపగలరా?......ఎందుకీ వ్యర్థప్రలాపములు?

శంభూ—ఇట్టి దృశ్యములే మీకంట బడినప్పుడు మీ కన్నులనుకూడా మీరు విశ్వసించరేమో?

మహా—ఆ హసీనా నా కంటిలోని పాప. అదే నన్ను మోసగించినప్పుడు చైతన్యములేని నా కన్నుల నే నెట్లు విశ్వసింతును?

శంభూ—తనభార్యా దుష్ప్రవర్తనముల విశ్వసింప

జాలక తినకన్న లే విశ్వసనీయములు కావని యెంచు వెర్రి బాగులవానిని చూడ నాకు జాలిపట్టుచున్నది. ఇట్టి అగాధ భర్తృప్రేమ నెంచియైన ఆమె మోసగించ కూడదు.

మహా—తన్నంత ప్రేమించిన భర్తను మరచి కంట పడిన క్రొత్తవానిని వలచుటకు హసీనా వేశ్య కాదే! సర్దారు గారూ! దాని దుష్టచేష్టల నాకగపరిచితిరేని నేను మీకు చెప్పినచొప్పున నడుచుకొందును.

శంభూ—అట్లయిన నామె రూపు మాపెదరా?

మహా—అబ్బా! ఎంత మాటాడితిరి! తనప్రేమనెల్ల నాయందు నిక్షిప్తముచేసి పలుసాగులు నావక్షమున కీలించిన ఆమెశిరమును నేను ఛేదించవలెనా?

శంభూ—మిమ్ము అధఃకరించి అన్యుని వక్షమున నామె వాల్చిన శిరమును ఛేదించుటకు మీరు వెనుదీయనేల?

మహా—అయ్యో! ఆమెయెడ నాకెట్టి గాఢప్రేమ యున్నదో ఎవ్వరూ ఊహించలేరు. నా కోపోపశమమునకు దాని వధించుటకన్న నేనే ప్రాణహాని కావించుకొని ఆమె కోర్కె నిరాటంకముగా నెరవేరనిచ్చుటమేలని నాకు తట్టుచున్నది.

శంభూ—ఇది న్యాయము కాదు.

మహా—ఏల ?

శంభూ—మెత్తనైన మీచిత్తమును వశపరచుకొన్నది కావుననే ఆమె అట్టి నిందాస్పదమైన పని చేయసాహసించి

నది-నరే, మీ రాత్మహత్య కావింతురు. దాని పరిణామ మెట్లుండునో ఇంచుక యోచించితిరా? ఆమె స్వేచ్ఛాచరణమున కాటంకము లేకపోవుట నరే, ఇక ఆమె నుదాహరణముగా గొని అన్యస్త్రీలు దురాచారప్రవర్తకు లగుదురు. నాలిముచ్చులు నలుగడల చెలరేగుదురు. ఆమె దుష్ప్రవర్తనమున మీ వంశమునకు శాశ్వతమైన మచ్చ సంక్రమించకుండ జేయుట మీకు విధికాదా? ఆమె జీవించియుండునంతవరకు మీకులమునకూ శీలమునకూ ఎంత హైన్యము ఘటిల్లునో ఇంచుక యోచింపుడు. ఆమెపై మీకుగల అవ్యాజప్రేమవృత్తమునకు విషఫలము జనించెను. కావున ఆమె నంతమొందించుడు. తద్రక్తప్రవాహమును కన్నులార గాంచి శోకాశ్రువుల మోదాశ్రువులుగా మార్చుడు. ఇంకొకటి, ఆ కులట దుండగముల ప్రత్యక్షముగా చూచునప్పుడు ఆమె నొక్కర్తెనే చంపినంతమాత్రమున పూర్ణఫలముండదు. దానితోకూడ దాని ప్రియుని అంతమొందించవలయును. శివాజీమహారాజు నాకు ప్రభువైయుండ మీకిట్లు బోధించుటవలన నే నెంతనిరపేక్షావర్తనమునకు గడంగుచుంటినో, కులకాంతలు దుష్టవర్తనమాచరించుట చూడ నా కెంతరోషము జనించునో మీరే ఊహించుకొనుడు. శత్రుశేషమును సమయించిన పిదప మీరు స్వతంత్రులు కావున ఆత్మహత్య యథేచ్ఛముగా నొనరింపవచ్చును. ఇట్టి సందర్భమున మూడువధలు జరుగుట సర్వసామాన్యవిషయము.

మహా—ప్రేమచూపుటకన్న కర్తవ్యనిర్వహణము యోగ్యతరము, కులకళంకినిని కూల్చుట అత్యావశ్యకము; మిండగానితో కూడ దానిని మృత్యుదేవతకు బలియిచ్చి అమితానందమున ప్రాణముల బాసెదను.

శంభూ—అది అత్యుత్తమము.

మహా—ఇంతతో మీరు స్వస్థులని యెంచవద్దు. మీరిప్పుడు నాతో చెప్పిన విషయములు నాకంటబడకున్న ఆ పాపదంపతుల హరింపనున్న ఖడ్గము మీకంఠముపై బడునని నమ్ముడు.

శంభూ—అందు కేమిగాదవ? ఇక నాకు సెలవొసంగుడు. సాయంకాలమునకు కావలసిన పరికరములతో మీకడకు వచ్చెద. నావెంబడి వచ్చుటకు సంసిద్ధులైయుండుడు.

మహా—నే నిప్పుడే సిద్ధముగా నున్నాను.

(తెర వాలును)

శంభూ—(బయటికి వచ్చి) నేదలచిన కార్య మింతవరకూ సానుకూలముగా నెరవేరినది. ఇక శివాజీ విశ్రామాగారమును పువ్వులతో నలంకరించవలెను. ప్రక్క గదిలో వాని భార్యలను, రెండోదానిలో మహమ్మదును ఒండొరులకు తెలియకుండ కూర్చుండబెట్టు ఏర్పాటులు చేయవలెను. అట్లొనర్చితినా శివాజీహసీనాల సంభాషణ వారందరికీ విన?డును... ఆబాజీని ఈకుట్రలో చేర్చలేదు. మంత్రి మాారు చెవులలో పడకూడదు. నామతమున నాల్గవచెవి నైన నంట

కూడదు. "మంది చేరితే మఠమునకు చేటు". ఆబాజీకి నాపత్నుగడ ఏమాత్రమైన చెవిసోకినచో ఈసరికే నన్నంత మొందించుటో లేక బందిఖానాలో పడద్రోయుటో జరిగి యుండును. అదే త్వరగా ఇటకే వచ్చుచున్నాడు.

(ఆబాజీ వచ్చును.)

ఆబా—మామగారూ, సుబేదారుకొడుకు జాడ గాని కోడలిజాడ గాని తెలిసినదా అని ఆబాసాహెబు నేడు నన్ను డిగినాడు. ఈసాయంత్రములోగా వారి నాతని సముఖమున నిలుపుదునని ఒప్పుకొన్నాను. ఇటుపైని వారిని దాచియుంచు టకు వీలులేదు సుడీ.

శంభూ—నేటిరాత్రి హసీనాను శివాజీయెదుట నిలుప నున్నాము కదా, ఆమె నొకసారి చూచి మోహవాగురుల జిక్కి ఆతడామెతో ప్రసంగించెనా సర్వమూ మరచిపోవును. ఐనను దానిమగని నేటిరాత్రి ఆ మేడలోనే యుంచెదను. హసీనాప్రశంసలో బడిన శివాజీజ్ఞప్తికి మహమ్మదు రాకుండు టయే మేలు, లేకున్న అతని కాయువు మూడినదన్నమాటే.

ఆబా—నేను నెరవేర్చవలసిన పనులు చాలాయున్నవి. ఊపిరితీయుటకైన తెరపిలేదు. మొన్నటి లూటీలోసంపా దించిన వస్తుచయమెల్ల ఆబాసాహెబెదుట పెట్టవలెను, యుద్ధచతురులకు బహుమానము లీయవలెను, ఎన్ని ఏర్పా టులు చేయవలసియున్నది!

శంభూ—కొలువు ముగిసినతోడనే తిరిగివచ్చెదను

సాటిలేని రత్న మొకటి మీాకులభించినదనియూ దానిని నిండుకొల్వున జూపుట భావ్యముకాదని తలచి ఏకాంతమున జూపుటకు దాచియుంచితిననియూ తెలిపి వెంటనే ఆమెను లోని కంపుము.

ఆబా—మీా ఆలోచన బాగుగా నున్నది. అట్లే చేసెదను. (పోవుదురు)

—ఐదవ రంగము—

(గుల్‌జార్ అమీానాలు)

గుల్—అమీానా, తుదకు నౌలుక్కాను నేను తెచ్చుకొంటిని. శూరుల కేదైన సులభసాధ్యము సుమా.

అమీా—భుజశక్తిచేతనే పొందగల్గితిరా?

గుల్—మరేమి? పురుషులు భుజబలముచేతనే సర్వమునూ నిర్వహింతురు.

అమీా—ఇంతపని నెరవేర్పగలిగిన ఆ కంకణము లెంత బరు వుండునో!

గుల్—(స్వ) అఆఁ! దీనికి తెలిసిన ట్లున్నదే? (ప్రకా) నీ పరియాచకము నా కర్థము కాలేదు. నేను కపటమన్న దెరుగను.

అమీా—పోటుబంట్లు దర్బారునకు గాజులు తొడుగుకొని వెళ్ళుదురా?

గుల్—అది నీ కెవరు చెప్పిరి?

అమీ—మిమ్ము జూచినవారే. ఊళ్ళో అంతట ఇదే ప్రస్తావము- లావుగా పొడవుగానూ ఉన్న ఒకస్త్రీ దర్బారుకు వచ్చి తనవాజ్యెము విచారించుమని మహారాజుగారిని వేడుకొనగా, ఆమె కపటస్త్రీ అయియుండునని వారి కనుమానము కలిగినను ఆడవారియందలి ఆదరముచే రాజుగారు సందేహము బైటపెట్టలేదని ప్రతివారూ చెప్పుకొనుచున్నారు.

గుల్—చూచితివా? స్త్రీ వేష మెంతచాకచక్యముతో వేసినను నా పురుషత్వము శివాజీవంటి శూరుని చిత్తము నాకర్షించినది. నా పురుషత్వము నీమనము నాకర్షింప లేక పోయెగదా?

అమీ—మీయందు గొప్ప ప్రజ్ఞ యున్నది. అందు ననే మీరు స్త్రీ వేషము దాల్చినప్పుడు పురుషులుగానూ పురుష వేషమున నున్నప్పుడు స్త్రీగానూ కానవచ్చుచుందురు. మీమాటలలో పస ఏమీ కానరాదు; బంటువృత్తి మాని వెనకటి వృత్తినే స్వీకరించుట మేలు, అందులోనైనా మీరు రక్తస్రావము పుష్కలముగా కావించుచుందురు.

గుల్—అట్లైన నా యాశలన్నీ అడుగంటవలసినదేనా? ఆ విందులూ, ఆ రకరకాలమద్యమూ, అంతఃపురమూ-

అమీ—ఏమి యంతఃపురము, ఏమి కథ-మిమ్ము స్త్రీ అని భావించి ఎవరైన వారి అంతఃపురమునకు కొనిపోకున్న నదియె చాలును.

గుల్—నాకెట్టి ఆశాభంగము కలిగిననూ నీవు దయ దలచి నాకు భార్యవైతివేని నాదుఃఖముల నెల్ల మరతును.

అమీ—నే నిట్టి స్త్రైణునకు భార్యను కాజాలను.

గుల్—నీవు గీసినగీటు దాటనని ప్రమాణము చేసె దను.

అమీ—అదేమి గొప్ప? భార్య మగనిపై తన అధి కారమును చలాయించదా?

గుల్—నీ వంతఃపురమున నుండి నన్ను బానిసెల బహిఃపురమున నుంచిననూ నేను కడుసంతోషముతో నుం దుందును. నా కోర్కె తీర్పవా?

అమీ—నేను స్వతంత్రను కాను. నా యజమాను రాలి సమ్మతిని పడయవలెను.

గుల్—మీ రాణిగారు తాము స్వయముగా శివాజీ అంతఃపురమునకు పోవుట లేదా? వారు నిన్నేల ఆటంకపర చెదరు?

అమీ—తినబోవుచూ రుచి యడుగనేల? ఏమి జరుగ నున్నదో కనిపెట్టి ముందుగతి నిశ్చయించవచ్చును.

గుల్—నీ యిష్ట మెట్లో అట్లే జరుపవచ్చును.

అమీ—అమ్మగారితో మీరుకూడ పోవలయును కదా? ఆలస్యమగుచున్నది.

———

—:ఆరవ రంగము:—

———

(శివాజీ ఆబాజీసోన్ దేవులు)

శివా—నేడు ఏలొకో నాచిత్తము వ్యాకులపడు చున్నది.

ఆబా—తెల్లవారినది మొదలు చాలా శ్రమకోర్చి యుంటిరి, కావున అలయుట సహజమే. అందుచేత ప్రభువు వారి మానసము కలతచెంది యున్నది.

శివా—ఇది ఒళ్ళు అలయుటచేత గాని మానసిక శ్రమచే గాని కలుగునది కాదు,అవి నాకు చిరతరాభ్యస్తములే, నేను వాటిని లెక్క సేయను.ఏదేని పాపకర్మమాచరించునపుడు చిత్తములో సంభవించు కలవరము నేడు నాకనుభవసిద్ధమైనట్లున్నది. ఏమీ తోచకున్నది.

ఆబా—మీ ప్రవర్తనకు వ్యతిరేకమైన పని నేడేమి జరిగినది?

శివా—నేడే అననేల? ప్రతియుద్ధమున వీరులకు లజ్జాకరమైన లూటీ చేయవలసివచ్చును. ఈ సర్వసామాన్యమైన కలికాలపు రాజనీతికన్న ప్రశంసనీయమగు నీతిపథము నేర్పరుపవలెనని నేను చేయు యత్నములన్నియు నిష్ఫలము లగుచున్నవి. శాత్రవుల సొత్తునైన దోచుకొనుట నాయభిమతము కాదు, ఇక నిరపరాధులగు ప్రజల ధనముమాట చెప్పనేల? వేరుపాయము తోచదాయె. ధనము లేకున్న సైన్యమును

కూర్చజాలము, పారితోషికము లిచ్చినగాని భటులు పరాక్ర మించరు; స్వరాజ్యప్రాప్తికి చాలినంతసొత్తు నా పూర్వు లార్జించి యుంచలేదు, నిధినిక్షేపములు నాకు దొరకలేదు.

ఆబా—చేతజిక్కిన ద్రవ్యమునుకూడ ప్రభువువారు వాఘసు చేయుచునే యున్నారు.

శివా—భవానీదేవి కటాక్ష మున్నచో ద్రవ్యమునకు కొదవ యుండదు. అప్పుడు పరులసొమ్ము నపహరింప నవ సరముండదు.

ఆబా—మీ రించుక విశ్రాంతి చెందితిరేని చిత్త క్షోభకొంత ఉపశమించును. విశ్రామాగారమును చక్కగా నలంకరించితిమి.

శివా—ఆహా! ఈ గవాక్షమునుండి చొచ్చుచున్న మందమారుతము భవనమున కెదుటనున్న జలధారాయంత్ర ములనుండి ఎగయు నీటితుంపరలతో నిండి ఆయాసము నచిర కాలమున అంతరించుచున్నది. ఇందలి పటములు నవరస దృశ్యములచే కనువిం దొనర్చుచూ భారతభూమి ప్రాచీనేతి హాసము కన్నులకు గట్టుచున్నవి. క్షణభంగురములగు రూపా కారములకు చిరస్థాయిత్వ మాపాదించి భగవత్సృష్టికన్న మానవసృష్టియే మేలని తోపించు . ఈ చిత్రలేఖనము లోక మున కెంత యుపకార మొనర్చుచున్నది! దేశకాలావచ్ఛిన్న ములగు వస్తువుల కాకట్టడుల మాన్పించె గదా? ఇందలి వస్తువులన్నియు ఉత్కృష్టము లగుటచే ఈగది రత్నభాండార

మన నొప్పును.

ఆబా—మహాప్రభూ! అనర్ఘమగు రత్నమొకటి నేటి లూటీలో నాకు దొరికినది, త్రిభువనముల దానికి సాటి లేదన వచ్చును. దానిని దర్బారులో అందరిమొసుట చూపుట భావ్యము కాదని ఏకాంతమున ప్రభువువారి కర్పించుటకు నిశ్చయించితిని. అది తనుశ్రమ సంతటిని అపనయింపగలదు.

శివా—ఈ దాపరికమూ రహస్యసందర్శనములన్న నాకు గిట్టదని మీరెరుగరా? అదీకాక నా మావళాలు చూడదగని రత్నము నావద్ద నుండదగునా? వీరమాతల గర్భముల యందు జనించిన శూరరత్నములతో పరిచయమొనర్చుకొనుటకు రాళ్ళగనినుండి వెలువడిన మీ రత్నమున కర్హత యుండదని నా అభిప్రాయము.

ఆబా—మహాప్రభూ! ఈ యపరాధమును మన్నింప వేడెదను, ఇంకమీద నిట్టి పొరపాటు జరుగనీయను.

శివా—సరే, దాని గొనిరండు. (ఆబాజీ పోవును) ఎంత విలువగల రత్నమైనా నేను దానిని ధరించక అమ్మి స్వరాజ్యప్రాప్తికి తగిన పరికరముల సేకరింతును. (హసీనా వచ్చును) ఏమిది? ఈ అపురూప యవనవనిత ఎవతె? పుష్పాలంకారము చేతను వింతవాసనలగుప్పు అంబరములచేతనూ పరివృతమై ఇలగల వనితల మీరిన యింపుసొంపు గొల్పు వినయమర్యాదాది భూషణములతో తలవంచి నిలిచి

నది! సాధ్వీమణీ, ఇన్ని చౌకీపారాల దాటి నీ విచ్చటికి కెట్లు రాగల్గితివి ?

హా—మహారాజా, స న్నెవ్వరూ ఆటంకపెట్టలేదు ; పౌరాజవానులు నన్ను చూచి నివ్వెరపడిరి.

శివా—ఇం దాశ్చర్యమేమి ? ఆరోగ్యము, తారుణ్యము, సౌందర్యములతో నిండిన నీయందు నిర్మలత్వము, నిష్కాపట్యము, సౌజన్యము ప్రతిఫలించుచున్నవి. ఇవి ఎట్టివారి నైన తబ్బిబ్బు చేయగలవు.

హాసీ—(స్వ) ఈతడా శివాజీ! ఈతనిగూర్చి నేను విన్నదానిబట్టి అతి భయంకర రూపుడని భావించియుంటిని. ముఖము నందౌదార్యము దయయూ, తాండవమాడుచున్నవి...కాని బాహ్యస్వరూప మంతరంగ ప్రవృత్తికి విపరీతముగా నుండవచ్చును, ఇందుకు నేనే తార్కాణము. సౌశీల్య మంతయు కేవలాభినయమని యెంచి భర్తృఘాతకుడగు వీనిపై పగ దీర్చుకొనవలయును.

శివా—యువతీవతంసమా, నీవు త్రోవ తప్పినావు ; నీ కెవరితో పని గలదు ?

హాసీ—ప్రభువువారితోనే.

శివా—అటులనా ? ఏమి పని ?

హాసీ—మీ రాజ్యమున ఉన్నతపదవియందున్న నొక వ్యక్తిపై నేను ఫిర్యాదు చేయవలసియున్నది.

శివా—ఆ యధికారి దుండగ మెట్టిది?

హాసీ—ఆతడు దొంగిలించినాడు.

శివా—అట్లైన నేడు దర్బారుకు నీ వేల రాలేదు? స్త్రీలనుండి అపహరించిన వస్తువులను వాపసు చేయుదుమని నీవు వినలేదా... పోనీ ... ఇప్పుడైనా మించిపోలేదు. నీ వస్తు వేది దొంగిలింపబడినదో చెప్పితివేని వెంటనే యిప్పించెదను.

హాసీ—అది దొరుకునది కాదు.

శివా—నీ కా చింత వలదు-దాని హరించినవా డెట్టి అధికారియైననూ సరే, వానిచేత నీ వస్తువు నీ కిప్పించెదను.

హాసీ—దానికి రూపరసగంధములు లేవు; కావున తెచ్చిచ్చుటకు వీలులేదు.

శివా—నీకు మానభంగ మొనర్చెనా? చెప్పు మా ఖలు డెవడో.

హాసీ—లేదు, లేదు-ఆవస్తువు హరింపబడినదని నాకు చింతలేదు; తత్కాలమున సుఖమే కలుగుచున్నది.

శివా—వింతగానున్నది! వస్తువు పోయెనని చింత లేదా? అట్లైన ఫిర్యాదుచేయుట కవకాశ మేది? నీ కిప్పుడేమి కావలయును?

హాసీ—అతడు దొంగిలించిన వస్తువువంటి దాతని వస్తువు నాకు లభించునట్లు చేయగోరెదను. ఆతడుహరించినవస్తువు నాకు లభించుట అసంభవము కావున దానిసాటి వస్తువును చూచుకొనినయెడ ఊరట చెందెదను.

శివా—నీ మాటలు నా కర్థముకాలేదు-నీ వేదో ప్రణయమునకు సంబంధించిన ప్రస్తావము చెప్పునట్లున్నది.

శివా—ప్రణయరాజ్యమున చోరుడే న్యాయాధికారి కావున, నీప్రేమను హరించినవారికడ ఫిర్యాదుచేయుము, వారే తగు విచారణచేసి నీకు రావలసిన దాని నిప్పించెదరు.

హాసీ—మీ యానతిలేక అతడు నన్ను ప్రేమించుటకు సాహసింపడు.

శివా—బాగుబాగు! అతడు నిన్ను ప్రేమించుటకు నాజోలి యేల?

హాసీ—అతడు హిందువు, నేను మహమ్మదీయ వనితను, మా పరస్పరప్రేమ మీకు సమ్మతము కాకపోవచ్చును.

శివా—మీ పరస్పరానురాగము మీ చిత్తవృత్తుల ననుసరించి యుండును. రాష్ట్రహితమునకు ప్రతికూలము కానిచో వ్యక్తిస్వాతంత్ర్యమునకు నే నడ్డురాను.

హాసీ—అతని కిప్పటికే ఇద్దరు భార్యలు కలరు!

శివా—అట్లైన అతని యిష్టము, ఆతని భార్యల యిష్టము; దేశశాసనము నతిక్రమింపకుండిన అందు నాప్రమేయమే లేదు.

హాసీ—ఈమాట నాకు సంతసము కూర్చుచున్నది.

శివా—ఇంతకు మిక్కిలి నన్నడుగదలచినది లేకున్న కాలయాపన మొనర్పక నీవారిని నీవరుగ వచ్చును.

హసీ—నా ప్రియు డీమేడలో నుండుటచే నే నిటనుండి కదలలేను.

శివా—హసీ-ఆతని నీ చెంతకు రమ్మందునా!

హసీ—మన ఏకాంతవాసమున మూడవవానితో నేమి పని? మహారాజా! మీరు యుద్ధములయందును రాజ్య పరిపాలనమునందునూ అతిచతురులని పేరువడసిన ప్రభువులు కదా, పరాక్రమాతిరేకమున పరులరాజ్యముల స్వాధీనపరచు కొనినట్లే ప్రతాపముచూపి లలనామనోరాజ్యములపై దాడి వెడలరేల?...ఆఁ. ఇది యొకవింత కాదు-మీకు ప్రణయవిద్య నేర్పదగిన స్త్రీ ఇంతవరకూ దిక్కు లేదు, ఆ యుద్యోగము నాకు ప్రసాదించెదరా?

శివా—ఇది నన్ను కోరదగిన కోర్కె కాదు.

హసీ—మహాప్రభూ! మీ శౌర్యమును గూర్చియూ యుద్ధచాతుర్యమును గూర్చియూ వినియుంటిని-కాని మీ రెంతశూరులో అంతసౌందర్యవంతులని యిప్పుడు నాకు తెలిసినది.

శివా—సౌందర్యమా!...లంకలో హరిశబ్దమువలె మహారాష్ట్రమున సౌందర్యము పూజ్యము, మీ ఆగ్రాయందలి భవ్యప్రాసాదముల యెదుట మా పునామేడ లెట్లుండునో మీ అందము ముందర మా చంద మట్లుండును. మీ శరీరములు తాజ్ మహల్ వలె నిగనిగలాడుచుండ, మా శరీరములు సహ్యాద్రిశిఖరమువలె మోటుగా నుండును. అదీకాక శరీర

సౌష్టవమునకై మీవారివలె మేము పూనికతో పాటుపడము. ప్రకృతియు లలితకళలునగా మీవారికిపోలె మాకుతోడ్పడవు. మాకు సౌందర్య మబ్బుటెట్లు? అది సుఖమునబుట్టి సుఖముననే పెరుగును. ఆజన్మమూ సౌఖ్యమెఱుగని మాకు సౌందర్యమెట్లొదవును?

హాసీ—మీయందు వాస్తవముగా సౌందర్యము కలదో, లేక మిమ్ముచూచి నేనట్లు భ్రమపడుచుంటినో చెప్పజాలను. స్త్రీ చిత్తము స్త్రీలకుకూడ దురవగాహము. ఏది యెట్లున్నను నాప్రేమ మీయందు లగ్నమైనదని చెప్పుట కాక్షేపము లేదు.

శివా—సౌందర్యమువలెనే ప్రేమయు సుఖముపై నాధారపడి యుండును. మీవారెన్ని శతాబ్దములనుండియో సుఖమున నోలలాడుచుండుటచే మీకు ప్రేమవ్యవహారములు మెండు, ప్రేమరాజ్యమున మీరెప్పుడును వర్తింతురు. మావా ళ్ళేసుఖమును చూచుకొని ప్రేమప్రసంగములలో తల దూర్చెదరు? మాకు స్వాతంత్ర్యము సున్నయగుటచే నిజమైన సుఖమూ పూజ్యమే. పారతంత్ర్యనిగళముచే మా కాలు చేతులు బంధింపబడినవి. స్వేచ్ఛగా నొకఅడుగు వేయజాలము. బెల్లమును చీమలవలె మాయిళ్ళను తురకచారులు ముట్టడించి యుందురు. మేము చేయు పనులూ మే మనుకొన్నమాటలూ తక్షణమే పాదుషావారి చెవి కెక్కును. వారెప్పుడు పైని పడుదురో అను భయముచే మాగుండెలు తటతటలాడుచునే

యుండును. ఆప్తులతో మాటలాడునపుడునూ అదే జంకు. మా నోళ్ళు, కాలుసేతులూ పారతంత్ర్యమున బంధింపబడి యున్నప్పుడు మాభావములకు మాత్రము స్వాతంత్ర్య ముండునా? ఈ దేశమునకు మేము స్వాములమన్న మాటే మరచినాము. ముందెప్పుడైన నది మాకు స్వాధీనమగునను ఆశ కూడా లేదు. అలవాటుచేత స్వాతంత్ర్యవాసనకూడ మాకు గిట్టకున్నది. తురకల అడుగులకు మడుగు లొత్తుచుండుటయే మాకు సర్వస్వ మనిపించుచున్నది. పారతంత్ర్యవిషముచే నార్ద్రిమగు భారతభూమిని స్వేచ్ఛాబీజములు మొలక లెత్త నేర్చునా?...ప్రేమకు కూడా స్వాతంత్ర్య మున్నది-పెద్దల మాటల నది సరకుచేయదు, లోకాపవాదకు లొంగదు, రాజాజ్ఞనూ ధర్మమునూ అణగద్రొక్కును, జాతిమతభేదములకు గాని శత్రుత్వమిత్రత్వములకు గాని తావుంచక దేశమర్యాద నవలీల నతిక్రమించును. అగాధములైన మహాసముద్రములు కాని, ఆకసమునంటు పర్వతపంక్తులు గాని దానిగతి నిరోధింపజాలవు, ప్రేమ ఇతరులనూ తనవారినీ వేరుగా జూడనీయక సమత నారయును ట్లాచరించుచుండును. ఇట్టి స్వేచ్ఛావిహారము పారతంత్ర్యపల్వలమున బడియున్న మాకెట్టు లలవడును?

హాసీ—మహారాజా, అట్టి పారతంత్ర్యమునకు మీరు బహిర్భూతులు కావున ఈవర్ణన మీయందు వర్తింపదు.

శివా—స్వాతంత్ర్యభేరీనాదము పారతంత్ర్యసుషుప్తి,

యందు గాఢముగా నిద్రించిన మామహారాష్ట్రదేవత చెవుల సోకునప్పుడెల్ల బీజపూరు, గోల్కొండ, ఢిల్లీసింగము లా ధ్వనికడిరిపడి మాయత్నముల నిరోధించుచున్నవి. వారి యాటలు సాగకుండ మాభటులకు స్వాతంత్ర్యాసక్తియను అభేద్యకవచమును తొడగవలసియున్నది. అప్పుడు మాహృదయములందు అజయ్యమైన ఆత్మవిశ్వాస ముద్భవించును. ఇది ఒకటి రెండు వత్సరములలో నిర్వహింపబడు కార్యముగాదు. తలకు మీరినపని దాపుననుండ తన్ప్రేమరాజ్యముపై దాడి వెడలుటకు నా కవకాశ మేది?

హంసీ—స్వాతంత్ర్యనిర్వహణమునకై పోరుచూ మీరు శ్రాంతులైన తరి మిమ్ము సేదదీర్చుటకు నాబోటి సహధర్మిణి యుండినచో మీయుత్సాహము రెట్టింపదా?

శివా—అందుకు తగిన యేర్పాటులు నాతల్లిదండ్రు లిదివరకే ఒనర్చినారు. నా పెద్దభార్య చతురసంభాషణముతోడనూ నాచిన్నభార్య తనసౌందర్య విభ్రమములతోడనూ నా యుల్లమును రంజిల్లజేయుటకు తగిన సామర్థ్యమును కలిగి యున్నారు.

హంసీ—శివాజీమహారా జెంతప్రతాపవంతుడో అంత రసికుడని నేను తలచుచుంటిని, కాని, అదిభ్రాంతి యనియు భువనమోహినినని అహమిక కల్గిన నా సౌందర్య మాతని యెడ నిష్ఫలమనియూ ఇప్పుడు స్పష్టమైనది.

శివా—నీ సౌందర్య మద్వితీయము కాదని ఎవ రన

గలరు? చైతన్యము గలవారినెల్ల అది జడములను చేయగలదు. పాషాణమువంటి జడపదార్థములకైన చలనము కలిగించును. ఇక సర్వసామాన్యుడను నే నొకలెక్కా!

హాసీ—వట్టిమాటలవలన ప్రయోజనమేమి? నాదురవస్థ చూచి మీచిత్త మించుకేని కరుగదుగదా! ఆర్తనై వేడుచుంటిని-మీ యందలి యనురాగము మిక్కుటమై నా తనువు పారవశ్యత నొందినది, కీళ్ళలన్నియు సడలినవి, అసంఖ్యులగు ప్రజల బ్రోచిన మీ ప్రతాపమునకు అబలనగు నన్ను బ్రోచుట బరువయ్యెనా? అయ్యో!

శివా—బాగుబాగు. ఆర్తత్రాణమన అన్యస్త్రీల నపేక్షించుట— ప్రజల బ్రోచుట యన పరకాంతల నపహరించుట— చక్కని ధర్మసూత్ర వ్యాఖ్యానమే! నీ సౌందర్యమునకు మెచ్చుకొంటిని. కాని కోరరాని నీకోర్కెను కొనసాగింప జాలను.

హాసీ—నా రూపము మీకు నచ్చులేదా? నా మత మడ్డువచ్చెనా?

శివా—రూపమా! మొదటనే చెప్పితినే భువనమోహనమని.

హాసీ—సరికదా, దాని చూచుటవలన మీ మానసమున నెట్టికోర్కెయూ జనింపలేదా?

శివా—మాతల్లి జిజాబాయి నీబోటి లావణ్యవతియైనచో గాని, నీయుదరమున పుట్టియుండిన గాని నేను

కూడా సుందరుడనై యుందునుగదా అనుకోర్కె జనించినది. కాని అవి అసంభవములని యెరిగితిని.

హసీ—(చేతనున్న కటారి పారవైచి) మహారాజా! మోసమాయె. నా ఆశలన్నిటిని ఒక్కమాటతో భంగము నర్చితిరి!

శివా—అదేమి? నీ వే మాశించితివి?

హసీ—ఈకటారితో మిమ్ము జంపదలచితిని, కాని మీమాటలు వినినంతోడనే మనస్సు మారెను.

శివా—ఇందు మోసమేది? ఊరక నన్ను చంపవలెనను పాపపుటూహ జనించి తనంతటతానే నశించినది... సరేకాని, నన్ను చంపునంత ఆగ్రహము నీకేల జనించినది?

హసీ—నాభర్తను చంపినది చాలక నాకు కోపమేల జనించెనని అడుగుచుంటిరిగా?

శివా—నీభర్త యెవరు?

హసీ—కళ్యాణప్రాంతపు సుబేదారు కుమారుడు మహమ్మదు.

శివా—అటులనా! నేను నీభర్తను చంపితినని పగ సాధింప నెంచితివా? సరే-కాని నీపతిని నేను చంపినట్లు నాకు జ్ఞప్తియే లేదు.

హసీ—అడుగడుగున అనేక దుష్కృత్యము లొనర్చువారికందరికటి జ్ఞప్తియుం దుండునా? గతమున కేమి? నేడు నాకుమానభంగమొనర్ప నసుకట్టలేదా?

శివా—బేలా, నీ అనుమానమును విన్నపిమ్మట నాకు వింత పొడముచున్నది. నే నట్టి ప్రవృత్తికలవాడ నైనచో, ఈ తరుణమును వ్యర్థముగా పోనిత్తునా?

హాసీ—ఇది యొక టక్కు. నా మనోభావము నెరిగి పిమ్మట నన్నేటులేని వలలో వేసుకొన నిశ్చయించుకొని యుందురు.

శివా—నాచిత్తవృత్తి నాకంటె నీకు చక్కగా తెలిసినట్లు మాటలాడుచున్నావు! పోని నీలోపమును నేను తీర్చినచో నీకోపము పోవునా?

హాసీ—నా లోపము తీరు టెట్లు? నాప్రియుని చిరవియోగమున నాకు కలిగిన దుఃఖము ద్రవ్యాదులచే అపనయింపవచ్చునని వ్యవహారజ్ఞులైన రాజనీతిజ్ఞులు తలంతురేమో కాని ఆమరణవ్రతము మానకయుండుటయే నిసర్గప్రేయసులకు సంతసము గూర్చును.

శివా—నీ భర్తను నేనపహరించితినంటివి కావున అతనికి మారుగా వేరొకపతిని నీకు కూర్చుట నాకు కర్తవ్యము.

హాసీ—నీచవాసనల నెంతఅణగద్రొక్కినను అవి పైకి రాకమానవు. పుట్టిననాటి బుద్ధి పుడకతోఁ గాని పోదు... సరే-ఆభర్త యెవరో ఇంచుక సెలవిచ్చెదరా?

శివా—నీభర్త కీడగు సుందరుని కూర్చినచో నీ కభ్యంతర ముండదు కదా?

హాసీ—దాంపత్యమన్న బజారు బేరమా? అది వర్తకులకు చెల్లునుకాని ప్రేయసులకు సరిపడదు.

శివా—సర్వవిషయములన్నా నీపతి కీడుదీయని పురుషుడు నీయెదుట నిల్చిన వాని నుపేక్షింతువా?

హాసీ—(స్వ) ఈత డెట్టి కపటరచన కావింపనున్నాడో?

శివా—మాన మర్ధాంగీకారము, అబాజీ, (అతడు వచ్చును) ఆ వ్యక్తి సిద్ధముగా నున్నాడా?

ఆబా—మహాప్రభూ, శంభూజీగా రాతని నిదివరకే సిద్ధపరిచి యుంచినారు.

శివా—ఆతని గొనిరమ్మని మామగారితో చెప్పుము-(అతడు పోవును) సాధ్వీ, నీపతి మృతిచెందెనని నీకు దృఢమైన నమ్మకమున్నదా?

హాసీ—ఆహా! మీచేత జిక్కినవారికి మృతి తప్పునా? ఇక వారిదర్శనము మీజన్మమున నాకు కలుగదు.

శివా—నీవు సాధ్వివని ప్రతీతి కలదు. తదన్యుల నరింప వన్నమాటే.

(అబాజీ, శంభూజీ, మహమ్మదును వత్తురు)

హాసీ—(మహమ్మదును కౌగిలించి) ప్రాణేశా, ఇన్నినాళ్ళెచటనుంటిరి? మీ రీలోకమును వీడిరని విని నేనెంత తహతహబడితినో మీరెరుగుదురా? ఇంతదనుక నన్నుబాసి యుండి నే డీవిషమపరీక్షలో నెట్లు కడతేరుదునో చూడ వచ్చితిరా? ఇది మీకు భావ్యమా?

శివా — తరుణీమణీ - వ్రతభంగ మొనర్చుచుంటివి- ఇప్పుడైన మేలకువ తెచ్చుకొనుము. పరపురుష సంటుట పతివ్రతకు భావ్యమా?

మహా — ప్రేయసీ! మనము స్వార్థపరాయణులమై మర్యాద మీఱుచుంటిమి. ముందీ మహాత్ముని పాదములపై బడుదము రమ్ము. వీరి యౌదార్యము మూలముననే మన మిండ్లొరుల చూచుకొన గల్గితిమి. నీవు వారిననిన కఠినోక్తులు నా చెవిని పడినప్పుడు నాకు పట్టరాని కోపము వచ్చెను. వారికిగల అసామాన్యస్త్రీదాక్షిణ్యముచే వారు దానిని సరకు చేయరైరి. (మొక్కుదురు.)

హంసీ — నాథా, వారు నిన్ను హత్యచేసిరని పొరపాటు పడి వారిని నేడు చంప నుద్యమించి, శీలసంపద గాంచి విరమించితిని.

మహా — ప్రేయసీ, నీ వీమహారాజును మోహించి ప్రేమభిక్ష యాచించుట కిట వచ్చితివని విని మిమ్మిద్దరిని చంపి నే నాత్మహత్య చేసుకొనుటకు నిశ్చయించితిని.

శివా — ఈ అసత్యకల్పనచేసి హత్యావ్యూహము నల్లిన దెవరు?

మహా-హంసీ — (శంభూజీని చూపి) ఈ మహాత్ముడు.

(సఖీ సోయరాబాయిలు వత్తురు)

సఖీ — మీరు లేనినేరములను మోపి మాంచి త్తములకు కలతగూర్చిన వాడూ ఇతడే.

శివా—(భార్యలతో) మీరుకూడ ఈకుట్రలో చేరిన వారేనా? ఏమి మామగారూ మఱేఁ ప్రాంతమును మీస్వాధీనమున నుంచనందుకు నాపై పగబట్టి మీరొనర్చిన తంత్రమా ఇది?

ఆబా—ఆబాసాహెబ్, వీరి మానసములను కలతపెట్టుటలో నా కెట్టి సంబంధము లేకున్నను, నేను నిర్దోషిని కాను. హసీనాబీబీని తమకర్పించి కొన్ని దురాగతముల నల్పుటకు తమసమ్మతిని బడయదలచి ఈవ్యూహమును పన్నుటకునే నొడంబడితిని.

శివా—ఈ దుష్టరచనకు సూత్రధారి మామగారే. ఆబాజీ-మీ నేరమును ఒప్పుకొన్నందుకు సంతసించితిని. స్వరాజ్యస్థాపన మొనరింపవలెనన్న మనవారూ పరులునూ సంతసింపవలయును. మామగారూ, మీరు పన్నిన కుతంత్రము సఫలమైనచో నే నిదివరకే ప్రాణములు బాసియుందును. మీప్రాణములను నేను హరించినచో నన్నెవ్వరూ నిందింపరు. మీరు స్వార్థపరాయణులై రక్తసంబంధమేని లెక్కచేయరైరి. న్యాయపరిశీలన చేయవలసివచ్చెను కావున నేనుకూడ దాని నక్కరచేయను. మీరు స్వామికిని, వారి భార్యలకూ, నిసర్గప్రేమికులగు ఉత్తమదంపతులకునూ ఒకమహాఘోరమైన ద్రోహ మొనర్చినందుకు శిక్షారూపముగ మీప్రాణములహరించినను అశిక్షతక్కువే యగును. నేను మీ కవమాన మొనర్చితినను మిషచే నీదుస్తంత్రము పన్నితిరి కావున మీ

యపరాధము సహజమౌట క్షమించి, మీరు విశ్వాసపాత్రులు కానందున మిమ్ము నా దేశమునుండి నిర్వాసితుని జేసితిని. (గుల్ జారు అమీనాలు వత్తురు.)

గుల్—మహమ్మదుగారూ, వారే మీబీబీగారు, ఈ గడియవరకు వారిని కాపాడి తిరుగ మీ కప్పగించితిని, నేను నిర్వహించిన ఈ ఘనకార్యమునకై అమీనాను నా కొసంగుడు.

హాసీ—పారితోషికము నొందుటకు నీవు పడిన పాటేమి?

గుల్—ఆనాడు మీచేతిలోని కైజారు తీసుకొనలేదా? అది మీయొద్దనున్న ఏమి అపాయము తటస్థించియుండునో ఇంచుక యోచింపుడు.

మహ—సరే-మాకు తలపని తలంపుగా పునర్దర్శనము లభించె. కావున నీకు బహుమతి ఇవ్వతగినదే. అమీనా కంగీకారమున్నచో మా యాటంకము లేదు.

(అహమ్మదు వచ్చును.)

అహ—అమ్మయ్యా, ఇప్పటికి నాకన్నులు చల్లనాయె. నాకొడుకూ కోడలూ జీవించియున్నారు.

శివా—ఇదే వీరిని మీ కప్పగించుచున్నాను. అన్న మాట నిలుపబెట్టుకొన్నందుకు సంతసమాయెను.

అహ—మహారాజా, మీరు ధన్యులు. మీరు కుటిల హృదయులనియు, ద్రోహులనియు వినియుంటిని, కాని అవి

కిట్టనివారి పలుకులని నేడు మా కనుభవసిద్ధమయ్యెను. ఇంత సత్యాచరణము, సౌజన్యము, పరోపకారబుద్ధి, ఇంద్రియనిగ్రహము, క్షమ, దూరదృష్టిగల మీరు మీ సచ్ఛీలసంపద చేతను విశ్వాసనీయులగు మీ భటుల పరాక్రమము చేతనూ మహారాష్ట్రమును మీ ప్రభుత్వమునకు లోబరచుకొని కాల క్రమమున స్వరాజ్యస్థాపన మొనర్తురు. అప్పుడు ఛత్రపతులను మీ బిరుదు సార్థకమగును.

ఉ. గా.——వృద్ధుల యాశీర్వచన మమోఘము——

శుభాస్తు. ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః.

సమాప్తము.